★ అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

120 మే - జూన్ 1990

"నదీనదాలూ
అడవులు కొండలు
ఎడారులా మనకడ్డంకి?"

విషయసూచిక

శ్రీశ్రీ వర్ధంతి : మహాప్రస్థానం నుండి మరోప్రస్థానందాకా		3
కవితలు :		
పోరుపూలమాల	—గౌతమ్	[illegible]
జనంకత్తిని సానబెట్టాల్సిందే !	—క్రామిక్	[illegible]
అడవి అంతరంగం	—నటరాజ్	8
చెరచీలుస్తున్న పాట	—సియ్యార్కె	9
పాటతో పదినిముషాలు	—[illegible]మాత్మ	10
పదునెక్కిన వెన్నెల	—అజ్ఞాతచంద్రుడు	11
నా ఒడికి చేర్చరూ	—"Force"	12
అవినీతి - అన్యాయం	—బి.యన్. స్వామి	13
బుల్లెట్స్	—ఎమ్.ఎస్.ఆర్.	36
చిగుళ్ళు	—శ్యామ్	64
చేనేతకూలన్నా !	—రుద్రజ్వాల	65
వేగుచుక్క	—సుచిత్ర	66
కథలు :		
కొండసిగలో గోగుపూలు	—మయూరి	14
తుపాకులు ఆడలు కోయలేవు	—కాడి	37
వ్యాసాలు :		
పర్యావరణ ఉద్యమం - మార్క్సిస్టు దృక్పథం	—కె. అనూరాధ	18
విస్తరిస్తున్న ఉద్యమంలో పురోగమిస్తున్న మహిళలు	—'రాగో'	29
భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమ చరిత్ర	—వి. సుబ్రమణ్యం	45
ఉత్తరం .		
బాపల్యం తిర్గాలి ...	—ఎస్. వేణుగోపాల్	54
విరసం విశేషాలు :		58
స్వీకారం :		64

"అరుణతార"కు రచనలు, చందాలు, విరాళాలు పంపవలసిన అడ్రసు :

వి. చెంచయ్య

6-5-13, కావలి - 524 201, నెల్లూరు జిల్లా.

KLVA106M103

జూన్ 15 శ్రీశ్రీ వర్ధంతి

మహాప్రస్థానం నుండి మరోప్రస్థానం దాకా

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాంపోదాం పైపైకి"

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను?
నేనుసైతం
విశ్వసృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను!
నేనుసైతం
భువనఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!"

"కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేదీ
పెనునిద్దుర వదిలించేదీ
మునుముందుకు సాగించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి"

"నాలో కదిలే నవ్యకవిత్వం
కార్మికలోకపు కళ్యాణానికి
శ్రామికలోకపు సౌభాగ్యానికి"

"ఒక వ్యక్తిని మరొక వ్యక్తీ
ఒకజాతిని వేరొక జాతీ
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా? ఇకపై సాగదు."

"అహింస ఒక ఆశయమేకాని
ఆయుధం ఎప్పుడూ కాదు
ఆశయం సాధించాలంటే
ఆయుధం అవసరమే మరి".

"సరిహద్దులు లేనీ
సకల జగజ్జనులారా
మనుష్యుడే నా సంగీతం
మానవుడే నా సందేశం".

"ఈ పదవులు ఈ బ్రదుకులు
శాశ్వతమని భ్రమించకు
ఎరుపెక్కిన తూర్పుదిక్కు
అపరాధుల క్షమించదు"."

"తెల్ల కమ్యూనిస్టులు
రక్తపాతావి కనిష్టులు
విప్లవానికి బహిష్టులు
ఇందిరారాధనలో శ్రేష్టులు
నవభారత ధార్తరాష్ట్రీ
రివిజనిస్టులు."

"విప్లవకారుల విధ్వంస
బీభత్సకాండకు నా ప్రశంస
అదెన్నడూ కానేరదు హింస
అది నూతన చేతనా శిరంప
మానవమానస మానసరోవర
హంస."

"యిప్లవం యాడుందిరా
ఆడనే నీకూడుందిరా నీగూడుందిరా
గోడుగోడువ యేడస్తవుంటే
యాడు నీవంక రాడింకరా."

"తలకాయలు దొర్లా
లన్నాడు బిర్లా
జాను సత్యం తలకాయ దొర్లింది
భాస్కరుడి తలకాయ దొర్లింది
ఇదే హింస.
బోర్లాపడుకున్న సంపాదకా విను
నక్సలైట్లు ఛేదిస్తున్నారు గాంధీ
విగ్రహాల శిరస్సులను
అదే అహింస."

"నువ్వో
సైంటిస్టువి కావాలంటే
ఆర్టిస్టువి కావాలంటే
ముందుగా
కమ్యూనిస్టువి కావాలి."
"మీరట ప్రజలంటారు
నేనూ ప్రజలంటాను
మీ ప్రజకూ నా ప్రజకూ
పొంతన కుదరదులెండి."

"తెల్లవాడు నాడు నిన్ను భగత్సింగ్
అన్నాడు
నల్లవాడు నువ్వు నేడు నక్సలైటు
వన్నాడు
ఎల్లవాడు రేపు నిన్ను వేగుచుక్క
అంటారు."

"కమ్యూనిజమంటె నీ
కమ్మయ్యో ఎంత భయం?
నిజం చెప్పనా, కమ్యూ
నిజానిదే తుది విజయం."

శ్రీశ్రీ

పోరు పూల హాల

—గౌతమ్

వీరుడా ఓ చంటన్నా అందుకో జోహారులన్నా
పోరుబాటలో పూసినట్టి ఎర్రపూవుల వందనాలు ॥వీరుడా॥

పల్లెలన్ని తిరిగి తిరిగి మళ్ళీ నీవు వస్తవాని
మల్లెపూల దండగుచ్చి చెల్లి చేతికి దండలిస్తే
అన్న నీవు రాకపోయే మల్లెపూవులు వాడిపోయె
ఎర్రజండ నీడలోన చెల్లి కన్నులు నిప్పులాయె ॥వీరుడా॥

గూడెలన్ని తిరిగి తిరిగి గుండెలన్ని మేలుకొలిపి
అడవిబాటలో అడుగులేసి పోరుదారిలో వస్తవాని
బీరపూవుల దండగుచ్చి బీదజనుల చేతికిస్తే
అన్న నీవు రాకపోయే బీరపూవులు వాడిపోయె
బీదజనుల కంటినీరు కాలికాలి మంటలాయే ॥వీరుడా॥

చెట్టుచేమలు తిరిగి తిరిగి గుట్టుమట్టులు చూసుకోని
ఎర్రజండలు చేతబట్టి అలసి నీవు వస్తవాని
వెదురుపూల దండగుచ్చి ఎదురుచూపులు చూస్తువుంటే
అన్న నీవు రాకపోయే వెదురుపూవులు వాడిపోయే
ఎదురుచూపులు ఎర్రనాయే - వెదురుచీలి విల్లు ఆయే ॥వీరుడా॥

తూర్పు కనుములు తిరిగి తిరిగి మార్పుకొరకు మార్గమేసి
సూర్యునితో చేయికలిపి చుక్కలాగా వస్తవాని
పొద్దుతిరుగుడు దండగుచ్చి పొద్దువరకు వేచివుంటే
అన్న నీవు రాకపోయె పొద్దుతిరుగుడు వాలిపోయే
అడవిఅంతా చీకటాయె సుక్కలే మాకు దారిచూపె ॥వీరుడా॥

పోడుగొట్టే దాదాలతో ఆటఆడి పాటపాడి
వెల్లవరము తాలుకాలో అల్లిబిల్లిగా పోరునల్లి
విల్లు చేతపట్టుకొని అడుగులేసి వస్తవాని
గరికపూల దండగుచ్చి గిరిజనుల చేతికిస్తే
అన్ననీవు రాకపోయే గరికపూలు వాడిపోయే
గిరిజనులే సేనలాయె గరికపూలే గన్నులాయె ॥వీరుడా॥

గన్ను చేతపట్టుకొని కళ్ళనీళ్ళు తుడుచుకోని
నిన్నుతలచి కనిపించి అన్నలల్లో కలిసిపోయి
ఎర్రజండల దండగుచ్చి అడవిమెడలో మాలవేసి
నీ బాటలోనే అడుగులేసి ఎర్రదారిలో సాగిపోతాం ॥వీరుడా॥

[కా॥ చంటికోసం—]

జనం కత్తిని సానబెట్టాల్సిందే!

కంటతడిని ఒత్తుకున్నాం
బండబారిన గుండెని జెండాగా ఎత్తిపట్టుకున్నాం
ఊపిరి బిగించిన పిడికిళ్లలో!
పల్లెపాఠశాలల్లో ప్రజ గురువుల పాదాలచెంత పాఠాలు నేర్చుకొంటూ-
తడబడిన అడుగుల ఒడిదుడుకులతో
గతాల రగతంతో ఎరుపెక్కిన వసంతాన్ని కళ్లకద్దుకోడానికి
ముళ్లడొంకల్నే కాదు - తుపాకీ గుళ్లని కూడా ముద్దాడుతూ నడుస్తున్నాం!
భవిష్యత్ ఆశల చిత్రపటాన్ని గీయడానికి
కలల ఆశయ అక్షరాలను దిద్దుతున్నాం!
మిత్రులారా! భయం చీకటి గుండె తలుపుల్ని తెరవకండి!
పిరికితనం నరనరాల్లో కప్పుకున్న ఈ దోపిడీ సర్కారు
మనం కళ్లెర్రజేస్తే కాలిపోయే కాగితంపులే!
దారి జూపేవాడా! కష్టాల కన్నీటి సుడిగుండాలు దాటాల్సివుంది.
నావనడిపినవాడా! మానవి గాయాల ఎదలో, దిగులిని ధిక్కారంతో
ఏటికి ఎదురీదటం మన విధి!
అస్తవ్యస్తమైన జనజీవన నౌకను ఆవలి తీరానికి నడపాల్సి ఉంది!
పాపపంకిలమైన ప్రజాస్వామ్య బూటకపు వ్యవస్థలో-
ప్రజాబంధుల్నే కాదు - పాలక రాబందుల్ని చీల్చి చెండాడాలి!
కర్తవ్యం వెన్నుతట్టే ప్రజాకళల కలాన్ని కత్తిగా రూపించిన వాడా!
కవితాయుద్ధంతో విషసంస్కృతి చీకట్లు చీల్చినవాడా!....
క్రూరనిర్బంధ కోరల కత్తులబోనులే కాదు -
మన శరీరాలు వాడి కళ్లముందు ప్రమోషన్ కాయితమై కన్పించిన
ఎన్‌కౌంటర్ని సైతం ధిక్కరించి నెత్తుర్ని పూయించడం నేర్చుకోవాలి!
మనతల్లి భూదేవిని భుజాలకెత్తి మోస్తున్న
కష్టజీవుల పక్షపాతులమైన మనం
భవిష్యత్కాల అంతర్నేత్రం తెరవటానికి
జనం కత్తిని సానబెట్టాల్సిందే!

—శ్రామిక్

అడవి అంతరంగం

1

అడవి ఘోషిస్తోంది, తనకోసం తాను శోకిస్తోంది,
సమస్త మానవాళికై రోదిస్తోంది.
జీవకోటి హృదయాలపై నాగరిక విషబాకు కరాళహేలగానం చేస్తోంటే
అడవి అంచెలంచెలుగా కుంచించుకుపోతోంది.
చెక్కిలిపై జారిన అశ్రువులా అడవిసంపద విషాదభరితమై
పుట్టింటి హృదయఘోష వినిపిస్తోంది.
ఇప్పుడు అడవి పుడమి మనోఫలకంపై తీయనిగురుతు
రేపు ఒక స్మృతి.

2

మనిషికి భాష్యం చెప్పి జీవన పథగమనాన్ని నిర్దేశించింది.
నాగరిక పురోభివృద్ధికి నగారా మ్రోయించింది.
అడవి మానవాళికి మాతృమూర్తి.
పచ్చటి జలతారు దుప్పటిలా పర్వతాలను పరుచుకొని
చల్లగాలి సంగీతానికి సెలయేరుల నృత్యంచేసే అడవి
విలాస భవనకుడ్యాలకు ఉరితీయబడుతోంది
ఆధునికతా యంత్ర విన్యాసానికి జీవన్మరణ రణభూమిలోని
క్షతగాత్ర బాల వీరునిలా ఆక్రందన చేస్తోంది.

3

అడవి రక్షణకవచం, బడుగుజీవులకు ఆశ్రయం
అమ్మలాగ ఒడిలో దాచుకొంటుంది.
ఇప్పుడు ఆ తల్లి ఒడి చిరుగుల పీలికవుతోంది, చిక్కిశల్యమౌతోంది.
సరుకులకై చిలికిన నగర సంద్రం నుండి ఎగిసే గరళాన్ని
తన అంగాంగాల పులుముకొనే అడవి భూమినుండి వెలివేయబడుతోంది.
అడవి అల్పజీవుల ఆయువుపట్టు - అలసిన జీవాలకు ఆలంబన
అగ్నికీలలు అలసినపుడు హృదిలో దాచుకొంటుంది.
అదనుచూసి దావానంలా విస్తరింపచేస్తుంది.
అడవి అనలం పుట్టిల్లు - ప్రజాయుద్ధ పాఠశాల.

అందుకే అడవి ఆక్రోశిస్తోంది-
నిర్మలమైన జనజీవన రాగాలాపన తన ఒడిలో వినిపించండని
సమస్త మానవాళిని వేడుతోంది - అన్నలను చేతులెత్తి అర్థిస్తోంది.

—నటరాజ్

చెర చీలుస్తున్న పాట

పాటంటే ఇన్నాళ్ళూ మనస్సు పరవశించడంకోసమన్న వాళ్ళంతా
ఈరోజు జనంకోసం పాట జలాంతర్గామి అయిందంటున్నారు!
పాటను జనయుద్ధనౌకను జేసి
పాటలోని మాటలను తూటాలుగా ఒప్పుకుంటున్నారు,
అందుకే పాటవెనకాల మాట పరిగెడుతూ
మన్నవలకోసం మొగమాటం విడిచేస్తోంది!
పాటిపుడు శ్రమజీవి చెమటచుక్కసారమై ప్రశ్నిస్తోంది,
చరిత్ర సారాన్ని చాటడమేగాక కష్టాల కారణాలను వెతికి
పోరుబాట ప్రాముఖ్యాన్ని చెప్పి
అట్టడుగు గుండెలోతుల్ని తాకి బండల్నికూడా కరిగిస్తుంది,
జనం నవనాడుల్ని కదిపి సాయుధుల్ని చేస్తుంది!
పాటను 'SEDITION' క్రింద చూసినపుడు
చీకటిలో కలిసిపోయి వెలుతురుని వెతుక్కొని
'SAID ASIAN' గా మారీనాడు-
ఆఫ్రికాలో మండేలా విడుదల విన్యాసాల్లా
జనం పాట సముద్రమై పొంగిపొర్లుతోంది!
పాటను 'TADA' చట్రంలో ఇరికించాలనుకుంటే
బంధించలేని వెల్లువై డాక్టరేటు పట్టాపుచ్చుకొని
మాటను కాటాలో తూస్తుందీనాడు!
ఆ పాటకోసం.... సాగరతీరం వింటశబ్దాల నిట్టూర్పుల్ని విన్పిస్తుంది.
పాటకు లయగలిపే గజ్జల్ని మించిపోవాలని
అలలు గలగలలు లయల్ని నేర్చుకుంటున్నట్టుగా
కెరటాలలో రిహార్సల్స్‌చేస్తూ అలుపంటూ లేకుండా
ఎదురుచూస్తుంది విశాఖ (జన) సముద్రం!

ఉక్కుపాదాల క్రింద పనిజేసే వాళ్ళంతా
పాట పథంలో పోరు నేర్చాలని ఉబలాటపడుతున్నారు,
దండకారణ్యమంతా పువ్వుల తివాసీని
బాటలుజేసి అడవి మల్లెల్నిపంప సన్నాహాలుచేస్తుంది,
ఉప్పొంగి పారిన నక్సల్బరీ నదీ ఉద్ధానమంతా
ఆటపాటల బ్రతుకుబాట నేపథ్యంకోసం
డాల్ఫిన్ కొండెక్కి దీపస్తంభాన్ని సెర్చిలైటు చేసుకొని
జనవాహినిలో కలవాలని ఉవ్విళ్ళూరుతోంది!
పదునెక్కిన పాట చెర చీల్చుకొస్తున్నపుడు
పాట హిమమై కరిగి నీరై సస్యశ్యామలంచేస్తున్నపుడు
ఆపగలిగేదెవరు!

(10-4-90 న విశాఖకు 'గద్దర్ రాక' సందర్భంగా రాసింది)

—సియ్యారెల్

పాటతో పది నిముషాలు

సాయంకాలం.... రోడ్డుపక్క....
ఆహ్వానాల చేతులుచాచి కుర్చీలు ఒళ్ళోకి తీసుకున్నాయి
బల్లచెక్క గ్లాసెడు మంచినీళ్ళిచ్చి చల్లగా స్పృశించింది.
హోటలుకుర్రాడి చెమటబిందువుల్ని అసహ్యించుకుంటున్న జనం మధ్య
పెదాలు కత్తిరించుకుని కూర్చున్నాను
తలమీద సీలింగుఫ్యాను కాలమంత సహజంగా కదులుతోంటే
జనం కన్నీటికి మాటలు నేర్పుతున్న పాట
కరచాలనంతో నాకాళ్ళకింద భూమి క్షణం కదిలిపోయిన స్పర్శ
రాగరంజితమైన ఆ పాట విద్యుత్ప్రవాహమై నన్ను చుట్టేశాక
మనోనేత్రం మీద జనసముద్రాన్ని ముద్రించుకున్నాను
తీర్చిన బాణంలా ఆ పాట
అనుభవాల పుటల్లోంచి ఉబికి వచ్చిన సిక్కోలు యుద్ధం
కళ్ళముందు సజీవ చిత్రమై కదిలిపోయింది
కడుపుసొదల కన్నీట పుట్టినపాట లక్షల పిడికిళ్ళ హెచ్చరికై
రక్తచలన సంగీతం వినిపిస్తున్న పాట

వెలుగుల ప్రస్థానం మీద నెత్తుటి ముగ్గులు పోస్తున్న
వీరుడి చివరి శ్వాసలో సైతం కత్తిమొనలా మెరిసేపాట
నేల నేలంతా వ్యాపిస్తూ క్రాంతి సూర్యుల్ని మొలిపిస్తున్నపాట
అడవి దివిటీల పొలికేక ఆ పాట
ఆ పాట ఏరువాకతో తూరుపు తెలవారి ప్రశ్నించటం నేర్చుకుంది
ఆంక్షల అరచేతుల్లోంచి అగ్నికణంలా దూసుకుపోతున్న ఆ పాట
జనశత్రుల గొంతుల్లో వెలగపండు
ఇంటిపేరు వంగపండు

—పరమాత్మ

పదునెక్కిన వెన్నెల

కామాంధుల కౌగిలిలో నా అక్కచెల్లిళ్ళ ఎందరి మానాలో
చీకటిబజార్లల్లో ఆర్పబడ్డ దీపాల పొగల్లో ఆవిరై పోతుంటే
ఆ ఆవిరిని సొమ్ముచేసుకొని అందలమెక్కే వాళ్ళను చూస్తూ
సదాచార, సాంప్రదాయాల మాటున స్వేచ్ఛా సమాధులు కట్టబడి
నయవంచకపు మాటలతో వంచింపబడి
జీవితాంతం భయంగుప్పిట్లో మోడుబారిన బ్రతుకులు ఈడ్చుకొస్తుంటే
భారాన్ని భరించలేని పిరికొన్ని బ్రతుకులు
నూతికో, గోతికో, అగ్నిలోనో, అంధకారంలోనో
ఆహుతై పోతున్న భారతావనులను చూస్తూ
వెర్రిమొర్రి ఆలోచనల కుర్రకారు వింతచేష్టల పరాకాష్ఠ
ఆత్మహత్యల అంచులకు నెడుతుంటే
ఖాకీల, కామాంధుల క్రౌర్యం పురివిప్పి
స్వైరవిహారంతో మానాలను దోచి, ప్రాణాలను తీసి
చట్టంనీడలో చల్లగా సేదతీర్చుకొంటుంటే
ఓ నేస్తాల్లారా నేను ఇపుడు
మెత్తగా పరుచుకొన్న పచ్చికబయళ్ళపై వెచ్చగా పవళించి
మత్తుగా ఎలా నిద్రపోగలను
ప్రశాంతమైన సముద్రంలో ప్రకాశవంతమైన నా ప్రతిబింబాన్ని చూసి
ఎలా మురిసిపోగలను

నిర్మలమైన ఆకాశంలో నిండుపున్నమిలా ఎలా వెలుగగలను
అందుకే
మెత్తగా పరుచుకొనివున్న పచ్చికబయళ్ళను చురకత్తులు చేసి
అసమానతల సమాజాన్ని చీల్చిచెండాడుతాను
స్తబ్దతగానున్న సముద్రగర్భంలో
నిక్షిప్తమైయున్న అగ్నిపర్వతాలను ఢీకొట్టి అలజడులు సృష్టిస్తాను
నిస్తేజమైన ఆకాశంలో సగభాగాన్ని
ఉత్తేజం చేసి ఎరుపెక్కించటానికి
వాడియైన నవ యవ్వనాన్ని నిర్మలమైన వెన్నెలను ధారపోస్తాను.

—అజ్ఞాతచంద్రుడు

నా ఒడికి చేర్చరూ!

తప్పిపోయిన నా పిల్లలు వాళ్ళు
బాల్యపు మాధుర్యాన్ని స్మరించుకుంటూ దిగాలుపడుతుంటారు
వాళ్ళ పాలచెక్కిళ్ళపై ఈ కుళ్ళిన వ్యవస్థ తన మచ్చలను ముద్రిస్తుంది.
ఆకలిరాకాసి వాళ్ళ బాల్యాన్ని కొంచెం కొంచెంగా కొరుకుతున్నా
వాళ్ళ కళ్ళల్లో ఆశ దోబూచులాడుతూనే వుంటుంది
టీ గ్లాసుల్లో కరగని చక్కెరలా, ఫలహారశాలల్లో మకిలిపట్టిన పాత్రల్లా
వారు తారసపడుతుంటారు
మేస్త్రీల అదిలింపులు చీదరింపులు
వాళ్ళ లేతహృదయాలను తూట్లుపొడుస్తూంటే
చిరిగి పేలికలై ఆయిల్ తుడిచిన గుడ్డగా
మెకానిక్ షెడ్డుల్లో, కార్ఖానాల్లో తన ఉత్సాహాన్ని అంతా పులుముతూ
విషాదంగా ఓ మూలకి వొదిగిపోతుంటారు
నడవలేని శాస్త్రీలు రిక్షాలో గునుస్తూంటే
ఎగశ్వాస ఎగదన్నుతున్నా మండుటెండలో వాళ్ళ బాల్యపు మాధుర్యాన్ని
బొట్లు బొట్లుగా కారుస్తారక్కడ
భూస్వామి పశువుల కాపరులై వాళ్ళ చిట్టి చిట్టి పాదాలు కదిలిస్తుంటారు
ఆసామి కొష్టంలో పేడపురుగులై
తమకు తెలియని తన్మయత్వంలో మునిగితేలుతుంటారు

బండబూతులు తిని బతుకుతూ
యజమాని చేతి చర్నాకోల చేసే నాట్యానికి వేదికగా వాళ్ళప్పగిస్తారు
పిడికెడు ఎంగిలి మెతుకులకోసం
కలవారి లోగిళ్ళలో పాసంట్లు తోమే బ్రష్‌లవుతారు
నా బంగారు కూనలు పఫాయి చేసే చీపురులవుతారు
తప్పిపోయిన పిల్లల్ని తలుచుకుని లెరుక్కుపోతున్న కడుపుతో
తల్లడిల్లే తల్లిని నేను
బాబూ వాళ్ళెక్కడైనా కనిపిస్తే గుర్తించి నా ఒడికి చేర్చరూ!
వాళ్ళను బాధించే ఆకలి - దారిద్ర్యం ఆనవాలు మీకు,
దిక్కులేని తమకు బుక్కెడు అన్నంకోసం
రాచిరంపాన పెట్టే కామందుపై కసీ
తమ బాల్యాన్ని జుర్రుకుంటున్న వ్యవస్థపై ద్వేషం
నా బంగారుకూనల కానవాలు నాకు;
తప్పిపోతున్న ఈ నా పిల్లల్ని నా ముంగిటికి చేర్చరూ
పోరాటం బళ్ళోకి పంపి తిరుగుబాటు చదువు చెప్పిస్తా
విప్లవం ఉరఫ్ పీడిత ప్రజాఉద్యమాలు నా చిరునామా
ఈ తల్లి కోరిక తీర్చరూ - నా బిడ్డల్ని నా ఒడికి చేర్చరూ!

—"Force"

అవినీతి - అన్యాయం

కాపనాకాస్తున్న ఇంటికుక్కలే
హెచ్చరికగా అరవవు, కరవవు, సరికదా
పట్టపగలు ఇంట్లో దూరి
దోచుకుంటున్న వాడి పాదాలు
తోకాడిస్తూ నాకుతున్నాయి.
తోటి మంచిపనిషి చూసి
దొంగ అని కేకేసినందుకు, అతణ్ణే
ఉరుముతూ వెంటాడుతున్నాయి!

—బి.యస్. స్వామి

కథ :

కొండసిగలో గోగుపూలు

—మయూరి

ఎవరో పిలిచినట్టయి లేచికూర్చున్నాడు సుక్కు. కళ్ళు నులుముకుని అటుయిటు చూశాడు.

అంతా నిశ్శబ్దంగా వున్నట్టుంది. ఏ అలికిడీ లేదు.

ఆవలింతలుతీసి చిటికెలువేస్తూ అవతలికి నడిచాడు. చల్లగాలి ముఖం మీద ఒక్కసారిగా చరిచింది. ఈ నిద్రమత్తు వదలి మసకచీకటిలో అడవికేసి చూశాడు.

రాత్రంతా వర్షం పడీపడీ అపుడే తగ్గుతున్నట్టుంది. చెట్లకొమ్మలు నీటికి తడిసి ఆకుల్తో బరువుగా వంగిపోయాయి. ఆకుమీంచి ఆకుపై రాలుతున్న చినుకులు టపటపమంటున్నాయి. కాళ్ళకింద మట్టి మెత్తగా నానింది. తుంపర చినుకులు....

మూత్రంపోసి ఆకాశంకేసి చూశాడు. ఎక్కడో ఏవో చుక్కలు అలా కన్పించి మాయమయ్యాయి. అంటే తెల్లవారడానికి యింకా రెండు గంటలుందన్నమాట!

ఇంతరాత్రి ఏమిటి చేయడం! చల్లనిగాలి.... తుంపర చినుకులు.... ఒళ్ళు చల్లబడిపోయింది. మళ్ళీ నిద్ర రావడం అసంభవం. కళ్ళు చీకటికి అలవాటుపడ్డట్టున్నాయి. కాళ్ళు అలవాటుగా పొలంవేపు నడిచాయి.

పొలంనిండా నీళ్ళు.... పాలుపొంగినట్టుగా నీళ్ళు. ఏతంబావికేసి చూశాడు. పరుచుకుని పారుతున్న నీళ్ళల్లో అది కన్పించలేదు. ఆ మూలన నీళ్ళు పాములా మెలికలుతురుగుతున్నాయి. సున్నితంగా సవ్వడి.....ఎక్కడో ఏరు పారుతున్నట్టుంది. ఎవరో శ్రావ్యంగా పాట పాడుతున్నట్టుగా వుంది. గాలి అలలపై తేలియాడుతూ వస్తోంది ...

'హమ్మయ్య'! ఇలాంటి వర్షాలు ఇంకో నాలుగు చాలు. తమ దరిద్రం వదులుతుంది. ఎవడి దయా అవసరంలేదు.

కాళ్ళు గుడిశెలోకి నడిచాయి. విత్తనాల వడ్లగంప వద్ద ఆగిపోయాయి. అంతలోనే ఆ ఆలోచనకు నవ్వొచ్చినట్టుంది. 'ఉరికి ఉరికి పశువుల మేపితే పొద్దు తొందరగా గుంకుతుందా?' మళ్ళీ బయటకు నడిచాడు. చూరుపక్కనున్న మద్దిమొద్దు మీదకూర్చున్నాడు. చూరునీళ్ళు చలలో టపటపరాలాయి.

మెరుపు మెరిసినట్టయింది. అడవి ఉరిసిన గుడిసెలా వుంది. తడిసిన బుర్ర మెరిసినట్టయింది ఎందుకు తెలివిడిపడిందో అర్థమైనట్టుంది. ఆ పిలిచిం దెవరో తెలిసినట్టుంది

అది కలా! నిజమా! లేక తన ఆలాపనా! కాదు నిజమే. తానే అన్న లని పిలిచాడు. తనకోసం ఆగమని పిలిచాడు. వారి వెనక పరిగెత్తుతున్నాడు. తన పిలుపు విన్నారు. అక్కడే నిలబడి అన్నారు పరిగెత్తకు పడతావు జాగ్రత్త అని నిదానంగా రమ్మన్నారు. ఇది నిజంకాదూ! నిజం అయితే యిక్కడెందుకుంటాడు?

అవునూ! అన్నలు నిన్ననే వచ్చి వెళ్ళారు కదూ! అన్నలు ఆ మాట అన్నప్పటినించీ అదే అలోచన, అదే ఆలాపన! కునుకు ఎప్పుడు పట్టిందీ! కల ఎప్పుడువచ్చిందీ! కలలో అన్నలు ఎంత కళగా కన్పించారు! గంభీరమైన ముఖాలు. ఆ ముఖాల్లో ప్రసన్నత, నిండైన డ్రెస్సు, నిలువెత్తు ఆయుధం. ఆ కళ్ళల్లో ఎంత కాంతి! ఆ అక్కల్లో ఎంత ధైర్యం!

అవునూ! ఈ అన్నల రాకవల్ల తమ జీవితాల్లో ఎంతమార్పు వచ్చిందీ! అన్నలు తమ పల్లెల్లో ప్రవేశించి అపుడే మూడేళ్ళయిపోయింది! తమ జీవితాలు మారిపోయి మూడేళ్ళయింది! అన్నలు రాకముందు తమ జీవితాలు ఎలావుండేవీ! తాను పుట్టడం, వయసు పెరగడం, అన్నకి వదిన, వదినకి యిద్దరు పిల్లలు, అక్కలకి బావలు, వాళ్ళకీ పిల్లలు, ఆ పిల్లలకి పిల్లలు, పిల్లలు తల్లులవడం, తల్లులకి పిల్లలవడం. అలా ఒక యిల్లు పల్లెంతగా పెరగడం. అంతకుతప్ప ఏ మార్పు వుండింది?

ఎవరికీ కిట్ట బట్టలు లేనికాలం అది. అన్న కొనుక్కున్న అంగడి బని యన్ నిక్కరుతో ఏళ్ళు వెళ్ళదీశాడు. వదిన చుట్టుకునే తువ్వాలే చీరగా ఎంత కాలం గడిపిందీ! తానైతే పల్లెచుట్టూ వున్న గుట్టలే అంగీ లాగులుగా ఎన్నేళ్ళు గడిపాడో! దారాలుదారాలుగా చిరిగిన అన్న నిక్కరే తనకి కొత్త డ్రెస్సు.

చలికాలం కప్పుకోవడానికి బట్టలు! కందఆకులు. పైన గుడిసె. పొలం పండితే తిన్నట్టు లేకుంటే ఎండినట్టు ఎంత మంచి పొలం కాజేశారు ఫారెస్టు వాళ్ళు. ఒళ్ళంతా గుల్లచేసుకొని పొరకంత నరికినపొలం! అంతేనా? ఆకు తెంపినా అధికారం చెలాయించారు కల్లు కోడి కావాలన్నాడు గార్డు. తానూ అన్నా పనిమీద వెళ్ళారు. ఒంటరి వదిన భయపడిపోయింది ఇద్దామన్నా యింట్లో ఏమీలేదు ఇదే అదనని వదిన శరీరాన్ని....

ఆకలి తీరడంకోసం ఎంత పోరాటం ..! అంబలి బతుకులు... అది తప్పితే ఏరుసీళ్ళు... ఇలాంటిపేతప్ప ఏం మారింది బతుకు? తునికాకు సీజన్లో ఎంత వెట్టి... ఎంత అన్యాయం....? అన్నలు రాకపోతే తమ బతుకులు యింకా యిలాగే తెల్లవారేవేమో.

అన్నలు వచ్చారు తమకు ఎన్నో వచ్చాయి. ధైర్యం వచ్చింది. దైన్యం పోయింది. తమ నోట్లోకి నాలుక వచ్చింది. వడ్డీ తగ్గింది సంగం వచ్చింది. లంచాలు పోయాయి. అన్నిటికన్నా అసలైంది తమ జీవితాలే మారిపోయాయి. కొత్త కొత్త మాటలు... కొత్త కొత్త పాటలు... కొత్త కొత్త ఆలోచనలు... కొత్త కొత్త జీవితాలు...

అవును! తాను కూడా అన్నలతో కలసి పనిచేయాలి. ఈ దొరల రాజ్యం, దోపిడీ రాజ్యం కూల్చాలి. తమ రాజ్యంకోసం తాను కూడా యుద్ధంచేయాలి.

అదేమిటి? అన్నలు తన దీక్షని అనుమానించారు, అలా తనని అవమానించారు. కాకపోతే అదేమిటి? ఇంకా కొద్దిరోజులు ఆలోచించుకోమంటారా?

అదేంకుదరదు. ఈరోజే వెళ్ళాలి. అన్నల్తో కలవాలి. అన్నల్లో కలవాలి. అరే! ఇంకా తెల్లవారదేమి? ఇదేం వర్షం?

సోమన్న లేచినట్టున్నాడు. తమ్ముడి వాలకంచూశాడు. వర్షంలో తడుస్తూ అక్కడ కూర్చున్నావేమని ప్రశ్నించాడు అందుకు మౌనమే సమాధానమైంది. ఏదో అర్థంచేసికొన్న వాడిలా మళ్ళీ అడగలేదు అన్న.

తెలతెలవారుతోంది నీరు తేటపడ్తున్నట్టుంది. సోమన్న కట్టతెంపి పొలం నీళ్ళు పోనిచ్చాడు. అన్నాతమ్ములు పొలంపనిలో పడ్డారు.

వదిన లేచింది ఉపుడూ నూకలూ పిండిచేసింది. అంబలి కాచింది.

ఆకుదొప్పల్లో తలాయింత అంబలి తాగారు. ఇక వదిన కూడా పొలంలో దిగింది పిల్లలు బురదిమట్టిలో ఆడుతున్నారు. అరువు తెచ్చిన ఎడ్లతో ఆపూటకే పని పూర్తవ్వాలని సోమన్న ఆరాటం. కానీ రంధిపెట్టుకున్న తమ్ముడో- అని తపన.

ఆపూటకే పని పూర్తిచేయాలని ఆరాటం. ఆ వెంటనే అన్నల జాడ వెళ్దామని ఆలోచన.

ఆపూట గడిచింది.

తమ్ముడి హుషారుకు ఆశ్చర్యపోయాడు అన్న.

ఈ పంట రాగానే వీడి పెళ్ళి చేస్తే అన్నలన్న ఆలోచన వదలి పల్లెలో ఉండకేంచేస్తాడు? తానుండడంలేదూ! అన్న ఆలోచన అలాసాగింది.

తమ్ముడి ఆలోచన యిలా సాగింది.

ఇంతదాకా వాళ్ళు అన్నలు. తాము ఆదివాసులు. ఇపుడు తాను అన్నల్లో కలిస్తే తామే అన్నలు - అన్నలే తాము. తమ చేతుల్లో తుపాకులు. తమ చేతుల్లోకి రాజ్యం ... తమదే రాజ్యం. వదిన కూడా ఎంత మురిసిపోయిందీ! అన్నలే మళ్ళా ఆలోచించుకోమన్నారు.

ఇంకా ఏం ఆలోచన? వెనక్కిమళ్ళేవాడికి మరో ఆలోచన, ముందుకే వెళ్ళాలనే తనకెందుకా ఆలోచన!

అలా ఆలోచిస్తూ అలసట మరిచాడు.

అరే! అపుడే పనిపూర్తయిపోయిందా!

ఆశ్చర్యపోయాడు అన్న.

అలా వెళ్ళొస్తానని అడవిలోకి నడిచాడు సుక్కా.

అదేపోక.

ఆ రాత్రంతా అన్నావదినా ఎదురుచూశారు. అక్కడక్కడ వెతికారు. అయినా జాడలేదు.

నెలరోజులగ్గానీ తిరిగిరాలేదు సుక్కా.

అప్పటికే మారినట్టున్నాడు సుక్కా.

అన్నల్లో అన్నగా వచ్చాడు సుక్కా.

అన్నల్లో అన్నగా వచ్చాడు సుక్కా.

ఆనవాయితీగా హెచ్చరించింది సంగం.

అన్నల్లో కలవడం అంటే సుక్కల్లో కలవడం

మాటిగా పోలీసు తూటాలు ప్రాణాలే తీయవచ్చు.

పెళ్ళిమీదకు మనసు మళ్ళి - మళ్ళీ యిటే రావచ్చు.

పొయ్యి అంటిస్తే పొగచూసి పోలీసులు రావచ్చు.

పొడి గడకే బుక్కాల్సివుంటుంది.

నిద్రపస్తున్నపుడే నిన్ను వెంబడిస్తారు

అన్ని సంగతి ఆలోచించు. అన్నీ ఆలోచించు మరోసారి అన్నారు.

విన్నవేవీ సుక్కాకి కొత్తకాదు. వినివిని విసిగిపోయాడు.

అలా భయపడితే అన్నలెలా పనిచేయగలరు?

అడివంటే ఏమిటో తెలియని అన్నలు ఏ ధైర్యంతో వచ్చారు. అడవిలో పుట్టిన తాను అడవిలో తిరగడానికి ఏమిటి? తమకోసం దూరంనుండి ప్రాణాలివ్వడానికొచ్చారు వీళ్ళు. తనకోసమే తన ప్రాణం ఇవ్వడానికి ఏమిటి తనకి?

20 ఏళ్ళ విరసం మహాసభల ప్రసంగ వ్యాసం :

పర్యావరణ ఉద్యమం - మార్క్సిస్టు దృక్పథం

—కె. అనూరాధ

ఈరోజున మూడవ ప్రపంచ దేశాలన్నింటిలో సామ్రాజ్యవాద సంక్షోభం ఒక ఉన్నత దశను చేరుకుని ఎన్నో సామాజిక ఉద్యమాలకు దారితీస్తోంది. ముఖ్యంగా జాతుల విముక్తి పోరాటాలు స్త్రీ విముక్తి ఉద్యమం పర్యావరణ ఉద్యమం. సామ్రాజ్యవాద సంక్షోభం ఈ ఉద్యమాలకు చారిత్రిక అవసరాన్ని కల్పించింది.

పారిశ్రామిక యుగం దాని అత్యున్నత దశకు చేరుకున్నప్పుడు మనకు పర్యావరణ స్పృహ అనివార్యత ఏర్పడింది. అప్పటివరకూ దానికి చారిత్రిక అవసరం లేకపోయింది

మనిషి అంతవరకూ ప్రకృతితో చేసే నిత్యపోరాటంలో ఒక సమతౌల్యం వుండేది. ఆ సమతౌల్యం సమాజ పురోగతితోపాటే మారుతూ వచ్చింది. పెట్టుబడిదారీ సమాజంలో అ సమతౌల్యం తిరిగి సవరించలేని మార్పులకి దారితీసేటంతగా మారడం మొదలయ్యి ప్రకృతి అస్తిత్వానికే హానికరంగా మారింది. పెట్టుబడిదారీ సమాజంతో మానవులకూ ప్రకృతికీ మధ్య సంబంధంలో చాలా

అందుకే అన్నలిచ్చిన డ్రెస్సు వేసుకున్నాడు. అన్నచేత తుపాకీని ఆప్యాయంగా తీసుకున్నాడు. తనలో ఏదో అనిర్వచనీయ ఆనందం. ఆ డ్రెస్సులో చూసి అందరూ మురిసిపోయారు వదిన మరిదిని చూసి మరీ దీవించింది.

అన్నలలో లేడాడు సుక్కు. అందరికీ లాల్ సలాం.

వాళ్ళు కన్పిస్తున్నంతదూరం కన్నీళ్ళతో చూసింది పల్లె. అన్నలు అలా ముందుకు సాగుతూనే ఉన్నారు.

ఇపుడు సుక్కు ఆదివాసీ మాత్రమే కాదు.

ఆదివాసులకే అన్నగా ఎదిగినవాడు.

అడవిలో ఆయుధం వాడు

అడవిని సాయుధం చేస్తున్నవాడు.

వేగంగా మార్పు జరుగుతుంది. ప్రకృతి మీద వత్తిడి ఎక్కువ అవుతుంది. తత్ఫలితంగా, ప్రకృతీ, మానవుల అసమతౌల్యం ఒక కొత్త రూపాన్ని ఎత్తింది.

ప్రకృతి మీద జరుగుతున్న ఈ దాడివల్ల అంతిమంగా ప్రజలే నష్ట పోతున్నారు. అందుకే ప్రకృతికోసం ప్రజలు ఈరోజున ఎన్నో పర్యావరణ పోరాటాలు చేస్తున్నారు.

పర్యావరణ సమస్యలు :

ఒక శాస్త్రీయరంగం (discipline) గా పర్యావరణానికి (ecology) వందేళ్ళ కంటే ఎక్కువ చరిత్ర లేదు. పర్యావరణ శాస్త్రం మొదట్లో జంతు శాస్త్రంలో భాగంగా వుండేది. ఆ తర్వాత 1868 లో ఎర్నెస్ట్‌హెకెల్ అనే శాస్త్ర వేత్త 'ఎకాలజీ' అనే మాటను మొట్టమొదటిసారి వాడారు. జంతువులకూ, వాటి చుట్టూవున్న నిర్జీవ, జీవ వాతావరణానికీ మధ్య వున్న సంబంధమే పర్యావరణ శాస్త్రంగా వుండేది. క్రమంగా పర్యావరణం తన పరిధిని పెంచుకుంటూపోయి చివరికి మానవుడిని కేంద్రంగా తీసుకుంది. క్రమంగా ఇతర అన్ని శాస్త్రాలు ఈ శాస్త్రంలో చేరిపోయాయి. అన్ని జీవశాస్త్రాలు, సామాజిక శాస్త్రాలతోపాటు గణిత, ఆర్థిక శాస్త్రాలు కూడా చేరాయి. దానితో పర్యావరణ శాస్త్రానికి ఒక విశాల దృక్పథం ఏర్పడింది.

ఇటీవల పర్యావరణ సమస్య చాలా వివాదాస్పదంగా మారింది. ఎవరి సైద్ధాంతిక అవగాహననుబట్టి వారు దీనిని విశ్లేషించడం జరుగుతోంది. అయితే ఇతర సామాజికపరమైన సమస్యలకీ పర్యావరణ సమస్యలకీ మౌలికమైన భేదం ఒకటుంది. అదేమిటంటే- ఇతర సమస్యలన్నీ గతంమీద ఆధారపడి వర్తమానంలో కేంద్రీకృతం అయ్యివుంటే పర్యావరణ సమస్యలు మాత్రం భవిష్యత్తులో కేంద్రీకృతం అయ్యివున్నాయి. అందుకే పర్యావరణ సమస్యలు చాలావరకూ జరగబోయేవాటిని గురించి ముందే అంచనాకి వచ్చినవి. ఇదిలా జరుగుతుంది అని చెప్పడం కష్టం. అందుకే పర్యావరణ సమస్యలను అర్థం చేసుకొనడానికి ఒక స్పష్టమైన సూత్రం ఏదీ చెప్పలేం. కేవలం ఒక ప్రాతి పదిక మాత్రం చేయగలం. అదేమిటంటే- సామ్రాజ్యవాదం ఈ భూమి మీద ఎన్నో పర్యావరణ వైరుధ్యాలను సృష్టిస్తోంది. ఈ వైరుధ్యాలు అంతిమంగా సామ్రాజ్యవాద వినాశనానికి దారితీస్తాయి.

పర్యావరణ సమస్యలకు సామ్రాజ్యవాదం ప్రధాన కారణం కాగా, అస మాన ఆర్థికవ్యవస్థ, తప్పుడు అభివృద్ధి పథకాలు కూడా పర్యావరణ సమస్యలకు దారితీస్తున్నాయి.

మన ఉత్పత్తి విధానమే ప్రకృతి విరుద్ధంగా వుంది. ఉత్పత్తిని విప రీతంగా పెంచి, ప్రపంచ మార్కెట్టులో ఆధిపత్యం సంపాదించడం కోసం సామ్రాజ్యవాద దేశాలు పోటీపడుతున్నాయి. ఈ పోటీలోపడి ప్రకృతినీ ప్రకృతి వనరులనూ పూర్తిగా దోపిడీ చేస్తున్నాయి. అటు పారిశ్రామిరంగంలోనూ ఇటు వ్యవసాయిరంగలోనూ అత్యధిక దిగుబడికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞా నాన్ని పెంపొందిస్తున్నారు. ఈ క్రమంలో అతి తక్కువ కాలంలో అతి వేగంగా ప్రకృతి విధ్వంశం సాగుతుంది. పెట్టుబడిదారుడు వస్తూత్పత్తిలో పెట్టేఖర్చులో పదోవంతు కూడా పర్యావరణ రక్షణకోసం ఖర్చుపెట్టడు. ఎందుకంటే పెట్టు బడి పెట్టిన ప్రతి పైసామీద లాభంకోసం చూస్తారు. ప్రకృతికి కలిగిన లాభం గాని నష్టంగాని వారి పరిధిలోకి రాదు.

కాలుష్యం :

సామ్రాజ్యవాదం ప్రకృతి మీద చేసిన దాడి ఫలితంగా వాతావరణం కలుషితం అయ్యింది. కాలుష్యం అనేది పెట్టుబడిదారీ విధానానికి ఒక వ్యక్తీ కరణ మాత్రమే. భూమి, నీరు, గాలి, తిండి పదార్థాల కాలుష్యాన్ని మొట్ట మొదటిసారి సామ్రాజ్యవాద దేశాల ప్రజలు ఎదుర్కొన్నారు. పర్యావరణ సమ స్యల మీదా, వాతావరణ కాలుష్యం మీద 1962లో రేచల్ కార్సన్ అనే అమె రికన్ శాస్త్రవేత్త 'సైలెంట్ స్ప్రింగ్' అనే పుస్తకం రాసింది. చరిత్రలో పర్యావరణ చైతన్యం గురించి ఒక స్పష్టమైన అవగాహనను మొదటిసారి ఆ పుస్తకం కలిగించింది. పాశ్చాత్య దేశాల్లో ఆ పుస్తకం పెద్ద సంచలనాన్ని కలిగించింది. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి చెలరేగి వాతావరణ పరిరక్షణ ఉద్య మాలు చెలరేగాయి. ఆ ఉద్యమాల ఫలితంగా అక్కడ ఎన్నో మార్పులు కూడా జరిగాయి. తత్ఫలితంగా అభివృద్ధిచెందిన దేశాలు తమ దేశాలను వదిలేసి ఆ కాలుష్యాన్ని మూడవ ప్రపంచ దేశాల మీదికి వదలడం మొదలుపెట్టారు.

పెరుగుతున్న గ్రీన్‌హౌస్ ఉష్ణోగ్రత :

వాతావరణ కాలుష్యం ఇప్పుడు చరమదశకు చేరి 'గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్'కీ భూమి ఉష్ణోగ్రత పెరుగుదలకు దారితీసింది. ఈ భూఉష్ణోగ్రత పెరుగుదల అనేది ఇప్పు డంతర్జాతీయంగా ఒక ప్రధాన సమస్యగా మారింది. పారిశ్రామిక దుష్ఫలి తాలన్నీ కలిసి ఈ ప్రమాదాన్ని సృష్టించాయి. వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్ క్లోరోఫ్లోరోకార్బన్స్ అనే విషపదార్థాల శాతం పెరిగి భూమి పైపొరల్లో వున్నటు

వంటి 'ఓజోన్' రక్షణ పొరను తొలిచేసాయి. అడవుల నిర్మూలనవల్ల కార్బన్ డైయాక్సైడ్ శాతం పెరుగుతుంది. అలాగే పారిశ్రామిక వ్యర్థపదార్థం అయిన క్లోరోఫ్లోరోకార్బన్స్ కూడా వాతావరణంలో పెరిగిపోతున్నాయి. రెఫ్రిజరేషన్ ఫోమ్స్, ఎరోసాల్స్ వాడకం వల్ల క్లోరోఫ్లోరోకార్బన్‌ల శాతం పెరుగుతుంది. ఈ విషపదార్థాలు ఓజోన్ పొరను నాశనంచేస్తాయి. కార్బన్‌డైయాక్సైడ్ సూర్యరశ్మి నుండి వచ్చే ఉష్ణోగ్రతను పెంచడానికి ఉపయోగపడుతుంది. ఈ రెండిటి ఫలితంగా ఓజోన్ పొరలో ఒక పెద్ద చిల్లు ఏర్పడింది. ప్రమాద కరమైన అల్ట్రావైలెట్, ఇన్‌ఫ్రారెడ్ కిరణాల నుండి జీవజాలాన్ని కాపాడేది ఓజోన్‌పొర. అది దెబ్బతినడం వల్ల భూమి ఉష్ణోగ్రత పెరగడంతోపాటు, ప్రమాదకర కిరణాల వల్ల జీవజాలానికి ఎన్నో ఇతర సమస్యలు కూడా వస్తాయి. ఉష్ణోగ్రత పెరగడం వల్ల ధ్రువాల దగ్గిర మంచు కరిగి భూమి ముంపుకుగురయ్యే ప్రమాదం వుంది. ఇప్పటికే చిన్న చిన్న దీవులు, బంగ్లాదేశ్, థాయిలాండ్ దేశాలు ముంపుకుగురమ్యే ప్రమాదం వున్నదని శాస్త్రజ్ఞులు చెప్తు న్నారు. అలాగే ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల పెద్దఎత్తున అడవుల దహనాలు జరుగుతున్నాయి. గత రెండేళ్లుగా తగలబడిపోతున్నాయి.

అడవుల నిర్మూలన :

ప్రస్తుతం మనకు చాలా పెద్ద సమస్యగా మారింది అడవుల నిర్మూలన **(deforestation)**. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి పేరుమీద జరిపే కార్య క్రమాల వల్ల ప్రకృతికీ తద్వారా సమాజానికీ ఎన్నో నష్టాలు జరుగుతున్నాయి. అడవి నిర్మూలన కూడా దాని ఫలితమే. అడవులు మానవ సమాజాన్ని, జీవ జాలాన్ని, వాతావరణాన్ని, భూసారాన్ని, భూగర్భజలాన్ని, వర్షాలనూ, వరద లను, కరువును అన్నిటినీ నిర్ణయిస్తాయంటే మనకి ఆశ్చర్యంగా వుంటుంది. దట్టమైన అడవుల వల్ల వర్షాలు పడతాయి ఆ వర్షపు నీరంతా భూజలంగా నిలవ అవుతుంది. చెట్ల వేళ్ళు నేలంతా పట్టుకుని ఉంటాయి గనక భూమికోత నుండి కాపాడతాయి. చెట్ల వల్ల అక్కడి గాలి కూడా శుభ్రపడుతుంది. (కార్బన్ డైయాక్సైడ్ శాతం తగ్గుతుంది) రాలిన ఆకులు భూసారాన్ని పెంచుతాయి. అడవులు ఋతుపవనాలను ప్రభావితం చేస్తాయి.

మన జీవితంతో ఇంతగా పెనవేసుకుపోయిన ఈ అడవులను నిర్మూలిస్తే, వర్షపాతం తగ్గిపోయే ప్రమాదం వుంది. వర్షాలు పడ్డప్పుడు భూమి పైపొరల్లోని సారవంతమైన భూమి కొట్టుకుపోయి రిజర్వాయర్లలో చేరి వరదలకు దారి

తీస్తుంది. అడవుల నిర్మూలన వల్ల అక్కడ నివసిస్తున్న గిరిజనులకు ప్రత్యక్ష సమస్యలు కలిగితే, ఎక్కడో నివసిస్తున్న మనకు కూడా పరోక్ష సమస్యలు కలుగుతాయి.

అడవుల నిర్మూలన మన వలసవాద కాలం నుండి సాగుతూనే వుంది. ప్రొటెక్టెడ్ ఫారెస్టు పేరుతో కలప దొంగతనాలు మరింత తేలికయ్యాయి. ఇప్పుడు అడవులలో సరికొత్త రకం దాడి సాగుతోంది. ఈ దాడి మన పాలక వర్గాలు అభివృద్ధి పేరుమీద చేస్తున్నాయి. 1976లో నేషనల్ కమిషన్ ఆఫ్ ఎగ్రికల్చర్ (జాతీయ వ్యవసాయ కమిషన్) సామాజిక అటవీ పథకాన్ని ప్రారంభించింది (Social Forestry); నిజానికి ఈ పథకానికి మించిన ద్రోహం మరొకటి లేదేమో. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యాలలో అడవిసంపదను సంరక్షించడం గిరిజనులకు వంట చెరకు, పశుగ్రాసం, వ్యవసాయం వంటి తక్షణ అవసరాలు తీర్చడం లాంటివి వున్నాయి. ఈ ఆశయాలన్నీ చెట్లు నాటడం (afforestation) వల్ల జరుగుతాయని, దానిని ఒక మహత్తర కార్యక్రమంలా ప్రచారం చేస్తోంది ప్రభుత్వం.

కాని ఈ స్కీము కింద ప్రజలకు అవసరమయ్యే చెట్లుకాక పేపర్‌మిల్లులకు, రేయాన్ ఫ్యాక్టరీలకు అవసరమయ్యే యూకలిప్టస్, సరుగుడు, పిచ్చితుమ్మ చెట్లు నాటుతున్నారు. సామ్రాజ్యవాదం పర్యావరణ పరిరక్షణ పేరుమీద కూడా లాభాలు సంపాదించగలదని చెప్పడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ అవసరం లేదు.

సామాజిక అటవీ పథకం వల్ల గిరిజనుల మాట ఎలావున్నా అడవి పర్యావరణం మాత్రం మరింత క్షీణిస్తుంది. యూకలిప్టస్ లాంటి మొక్కల వల్ల భూగర్భ జలాలు అంతరించి, భూమి విషపూరితం అవుతుంది. పైగా అడవి పర్యావరణంలో ఒకేరకం మొక్కలు వేయడం వల్ల జీవజాలానికి తీవ్ర నష్టం జరగవచ్చు. చాలా రకాల జీవజాలాలు అంతరించే ప్రమాదం వుంది.

అడవి నిర్మూలనకు వ్యతిరేకంగానే మన దేశంలో ఎక్కువగా స్పందన వచ్చింది. 1972లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని 'చమోలీ' ప్రాంతంలో మొట్టమొదటిసారి అక్కడ గిరిజనులు అడవి నిర్మూలనను వ్యతిరేకించారు. దీనినే 'చిప్కో' ఉద్యమం అంటారు చిప్కో అంటే కౌగిలించుకోమని అర్థం. అక్కడి గిరిజనులు చెట్లను కౌగిలించుకొని వాటిని కాంట్రాక్టర్ల బారి నుండి తప్పించారు. ఆ రకంగా 'చిప్కో' పర్యావరణ ఉద్యమాలకు నాంది అయ్యింది.

చిప్కో తర్వాత దేశంలో నలుమూలల నుండి ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. కర్నాటకలో కోలార్, టుమ్కూర్ జిల్లాల్లో రైతులు యూకలిప్టస్ వ్యతిరేక క్యాంపేను చేపట్టారు. డూన్‌లోయలో పాలరాతి క్వారీలను వ్యతిరేకిస్తూ అక్కడి ప్రజలు ఆందోళన చేస్తే చివరికి సుప్రీంకోర్టు వారికి అనుకూలంగా తీర్పు నిచ్చింది. కాని ప్రతిసారి ఇంత అనుకూలత లభించదు.

మూడవ ప్రపంచ దేశాల్లో అభివృద్ధి పేరుమీద ఎంతో వాతావరణ వినాశనం జరుగుతోంది. పెట్టుబడిదారీ సమాజంలో అభివృద్ధి ఎప్పుడూ పాలక వర్గాల ప్రయోజనాలకోసమే అంటే ప్రజా వ్యతిరేకంగానే సాగుతుంది ఈ అభివృద్ధికి బలయ్యేది బీద ప్రజలు, స్త్రీలు, ప్రకృతి.

అభివృద్ధి పేరుమీద సాగిన హరిత విప్లవం భూమినీ, భూగర్భజలాలనూ, విత్తన సంపదనూ, పంటల జన్యు పరిణామాలనూ అంతిమంగా వాతావరణాన్ని కూడా నాశనం చేసేసింది. అధిక దిగుబడి ఒకటే లక్ష్యంగా ఈ విధ్వంసం సాగింది. వీటిల్లో అన్నిటికన్నా ప్రమాదకరం భూమికీ, భూగర్భ జలాలకీ కలిగే నష్టం. భూసారాన్ని దెబ్బతీయడమేకాక భూమిని విషపూరితం చేసేస్తున్నాయి. ఈ కొత్త సాంకేతిక పద్ధతులు. నీటిమట్టం పడిపోవడం, భూగర్భజలాలు పురుగు మందులతో విషపూరితం కావడం లాంటివి చాలా పెద్ద నష్టాలు. ఈ నష్టాలను పూడ్చడం ఒకోసారి అసాధ్యం కూడా కావచ్చు.

ఇవికాక అభివృద్ధి పేరుమీద, దేశ పురోగతికి చిహ్నంగా చూపబడుతున్న భారీ నీటి ఆనకట్టలు ఇప్పుడు చాలా వివాదాస్పదంగా మారాయి. భారీ ఆనకట్టల వల్ల వేలాదిమంది ప్రజలు నిర్వాసితులు కావడం, వేలాది ఎకరాల భూమి ముంపుకు గురికావడమేకాక, అక్కడి వాతావరణంలో కూడా చాలా ప్రమాదకరమైన మార్పులు జరుగుతాయి. నీరు నిలువ వుండిపోవడం, తద్వారా భూమి చేదెసిపోవడం, నీరు ఎత్తు నుండి పడటంవల్ల భూకంపాలు వచ్చే అవకాశం పెరగడం లాంటివి జరగవచ్చు. పైగా నిర్వాసితులకు సరైన నష్టపరిహారం దొరుకుతుందన్న నమ్మకం వుండదు. ప్రస్తుతం నర్మదా ప్రాజెక్టు విషయంలో దేశంలోని మేధావులంతా ఆందోళన చేస్తున్నారు. అలాగే సువర్ణరేఖ, తెహ్రీ నీటి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు పోరాడుతున్నారు.

నర్మదా ఆందోళనను పాలకవర్గాల స్వభావాన్ని అంచనా వేయడానికి ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో మధ్యప్రదేశ్‌లో హర్సూద్ అనే చిన్న గ్రామంలో నర్మదా వ్యతిరేక ర్యాలీ జరిగింది. దేశం

లోని అన్ని మూలలనుండి 50,000 మంది జనం ఆ ర్యాలీలో పాల్గొన్నారు మన ప్రస్తుత పర్యావరణ శాఖ మంత్రి మేనకాగాంధీ కూడా పాల్గొన్నది. నర్మదా గురించి జనతాదళ్ ప్రభుత్వం సరైన న్యాయం చేస్తుందని ప్రజలు అనుకున్నారు. కాని ఎన్నికలలో గెలిచిన మరుక్షణం నర్మదా ప్రాజెక్టు కట్టి తీరుతామని ప్రకటించారు. గత పదేళ్ళుగా ఈ ప్రాజెక్టు పట్టువిడవకుండా వున్న కాంగ్రెసు ప్రభుత్వం మాత్రం మొన్నటి ఎన్నికలలో దెబ్బతిన్నాక, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని నర్మదాడామ్ ఎత్తును తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దీన్నిబట్టి మనకు అర్థం అయ్యేది ఏమిటంటే ప్రభుత్వం తాను చేయగలిగిన పనిని కూడా ఎంతో వ్యతిరేకత వస్తేగాని, వారి ఉనికికి దెబ్బతగులుతుందనుకుంటేనే తప్ప చేయదు.

అన్ని ప్రమాదాలనూ మించినది అణుశక్తి. అది కేవలం ప్రకృతిమీదే కాదు మానవజాతి ఉనికిమీదే దాడి అనడం అతిశయోక్తికాదు. అణుశక్తి విషయంలో మేధావులందరిలోనూ చాలా విభేదాలు వున్నాయి. మరీ ముఖ్యంగా అసమ సమాజంలో అణుశక్తిని పాలకవర్గాలు తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటారనేది విదితమే. అందుకే అణుశక్తి శాఖ నేరుగా ప్రధానమంత్రి ఆధిపత్యం క్రింద వుంటుంది. ఆ శాఖకు ఎటువంటి స్వతంత్ర హక్కులు వుండవు. అణ్వాయుధాల మాటెలావున్నా ఆ కేంద్రాలు స్థాపించిన చోట ప్రజలకూ, వాతావరణానికీ జరిగే హాని తీరనిది. ప్రపంచంలో సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశాల్లోనే ప్రమాదాలు తప్పలేదంటే మనలాంటి చిన్న దేశాల అవస్థ ఎటిటో ఊహించవచ్చు. చెర్నోబిల్ లాంటి ప్రమాదాన్ని మన దేశంలో ఊహించగలమా ?

ఇవన్నీ ప్రధానంగా మన ముందున్న పర్యావరణ సంబంధిత సమస్యలు ఈ సమస్యల విశ్లేషణ విషయంలోనే వివిధ వర్గాల మధ్య భేదాభిప్రాయాలు వున్నాయి. ఎవరి సైద్ధాంతిక అవగాహనను బట్టి వారు ఈ సమస్యల పరిష్కారానికి పూనుకుంటున్నారు.

మొత్తంమీద వివాదాస్పదంగా వున్న విషయాలేమిటంటే ఈ ఉద్యమం ఎవరు నిర్వహిస్తున్నారు: వారి లక్ష్యం ఏమిటి; వారి ఎత్తుగడలేమిటి; అసలు సమస్య తీవ్రతను ఎవరు ఎలా గుర్తిస్తున్నారనేవి చర్చనీయాంశంగా వున్నాయి. ఈ ప్రశ్నల మీద ఆధారపడి మనం ఈనాడు ఉనికిలో వున్న పర్యావరణ ఉద్యమాలను విశ్లేషించవచ్చు.

వివిధ దృక్పథాలు :

పర్యావరణ ఉద్యమంలోని విభిన్న దృక్పథాల (trends)ను, ఉత్పత్తి విధానం, ఉత్పత్తిశక్తుల వైపునుండి అర్థంచేసుకోవడం సరైన పద్ధతి ప్రస్తుతం రెండు రకాల అవగాహనలు ఉనికిలో వున్నాయి. వాటిల్లో మొదటిది :- ఉత్పత్తి సాధనాలలో పరిష్కారాన్ని వెతకడం. అంటే వున్న వ్యవస్థలో ఏ మార్పు లేకుండా కేవలం ఉత్పత్తి సాధనాల మార్పుని ఆశించడం. రెండవది మార్క్సిస్టు అవగాహన :- అది ఉత్పత్తి విధానంలోనూ, ఉత్పత్తి సంబంధాల లోనూ పూర్తి మార్పును ఆశిస్తుంది

వీటిల్లో మొదటిరకం అవగాహనే ఇప్పుడు ఎక్కువగా చలామణీలో వుంది. దీనిలో మళ్ళీ రెండు రకాల దృక్పథాలు వున్నవారు వున్నారు. అందులో మొదటిరకం సాంప్రదాయవాదులు. వీరు కొత్త ఉత్పత్తి సాధనాలను వ్యతిరేకించి మళ్ళీ వెనక్కి (back to nature) పోదామనే సిద్ధాంతాన్ని నమ్ముతారు. నూతన సాంకేతిక అభివృద్ధిని పూర్తిగా నిరాకరిస్తారు. సమస్యలన్నిటికీ అదే మూలం అని భావిస్తారు. ఇది గాంధేయవాద దృక్పథానికి దగ్గరగా వుంటుంది. చాలామంది మేధావులు, పర్యావరణ శాస్త్రజ్ఞులు ఈ సిద్ధాందాన్ని భుజానవేసుకుని తిరుగుతున్నారు. సుందర్‌లాల్ బహుగుణ, బాబా ఆమ్టే, క్లాడ్ ఆల్వారెస్ లాంటి వారి సిద్ధాంతాలు వినడానికి చాలా ఆకర్షణీయంగా వుంటాయిగాని వాస్తవానికి చాలా దూరంగా వుంటాయి.

ఆధునిక యుగమే పర్యావరణ సమస్యలను తెచ్చిపెడుతోందని చాలా మంది భ్రమల్లో వున్నారు. ప్రకృతిలోని వనరులను పారిశ్రామిక యుగానికి ముందు నుండీ కూడా వాడేవారు. సహజ వనరులకు వాడకపు విలువతో పాటు మారకపు విలువ కూడా వుండేది. ఉత్పత్తి విధానంలో మార్పులు వచ్చినకొద్దీ ఉత్పత్తి సంబంధాలలో కూడా మార్పులు వచ్చాయి. ఉత్పత్తి మీద దోపిడీవర్గాల ఆధిపత్యం పెరుగుతూ పోయింది.

ఈ కోవలోకే చెందిన రెండవ రకం మేధావులు, వున్న వ్యవస్థలోనే కొన్ని సాంకేతిక మార్పుల్లో పరిష్కారం వెతుకుతారు. వీరు నూతన ఉత్పత్తి సాధనాలను వ్యతిరేకించరు. వాటిని ఆహ్వానిస్తారు. సాంకేతిక అభివృద్ధే వీరికి పరమార్థం. సాంకేతిక అభివృద్ధి ఒకవేళ పర్యావరణానికి నష్టం కలిగిస్తే దానిని నివారించడానికి పరిశోధనలూ, సాంకేతిక మార్పులు ఆలోచిస్తారు దేశంలో వున్న ప్రముఖ పర్యావరణ మేధావులు అనిల్ అగర్వాల్, ధీరేంద్రశర్మ,

కల్పనాశర్మ, భారత్ డోగ్రా ఈ కోవలోకే వస్తారు. పర్యావరణ సమస్యల మీద ఇప్పటి వరకూ వీరు చేసిన కృషిని తక్కువ చేయడం మంచిది కాదు. మరీ ముఖ్యంగా ప్రజలలో పర్యావరణ అవగాహన పెంచడంలో వీరి పాత్ర గణనీయమైనది. అయితే వీరి అవగాహనతో మనకు ఏకాభిప్రాయం లేకపోవచ్చు. వీరిలో కూడా ఒకరితో ఒకరికి కొన్ని విభేదాలు వున్నప్పటికీ మౌలికంగా అందరూ ప్రస్తుత వ్యవస్థలోనే పరిష్కారాన్ని ఆశిస్తారు. ప్రభుత్వానికి సూచనలు చేసి, పూర్తిగా ప్రభుత్వ నిర్వహణ పద్ధతుల మీద పథకాల మీద ఆధారపడతారు.

అయితే ఇక్కడ కొంత గందరగోళం కూడా వుంది. వీరి అంతిమ లక్ష్యం ఒకటే అయినా కూడా వీరిలో ఒకరితో ఒకరికి చాలా విభేదాలు వున్నాయి. ఈ విభేదాలు పర్యావరణ అవగాహన విషయంలోనే వున్నాయి. ప్రకృతి ఎంత వరకూ తిరిగి సరిచేయలేని మార్పులకి గురైంది అన్నది ఒక వివాదాస్పద విషయం అయితే, అణుశక్తి మరో వివాదాస్పద అంశం. చాలా మంది మిగతా అన్నిటినీ వ్యతిరేకించినా అణుశక్తిని మాత్రం పూర్తిగా సమర్థిస్తారు.

ఇక్కడ మరొక అంశాన్ని కూడా చర్చించాల్సి వుంది. ఈ ఉత్పత్తి సాధనాలలో పరిష్కారాన్ని ఆశించేవారిలో కొంతమంది ప్రత్యామ్నాయ శాస్త్రాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఇది ఈమధ్య చాలా ఎక్కువగా వెలువడుతున్న ఆలోచన. ఇది ఎంతో శాస్త్రీయంగా, అభివృద్ధికరంగా కన్పించే ఒక అశాస్త్రీయ ప్రమాదకర ధోరణి. వీరు సమస్యను కొంతవరకూ సరిగ్గానే అర్థంచేసుకుంటారు గాని పూర్తి తలక్రిందుల పరిష్కారాన్ని చూపుతారు. Peoples Science (ప్రజల శాస్త్రం) అని alternate science (ప్రత్యామ్నాయ శాస్త్రం) అన్న ఆకర్షణీయ పదజాలంతో శాస్త్రాలనీ, సాంకేతిక విధానాన్నీ తప్పుపడతారు; శాస్త్రవిజ్ఞానం ఎవరి చేతిలో వుంది, ఎవరి ప్రయోజనాలు కాపాడ్డానికి వున్నది అనే అంశాన్ని పూర్తిగా విస్మరిస్తారు ఈ మేధావులు. సమాజం వర్గాలుగా విభజింపబడినప్పుడు, ఏ శాస్త్రం అయినా ఏ జ్ఞానమైనా పాలకవర్గాల కోసం, వారి ప్రయోజనాలకోసం ఉపయోగపడుతుంది అనే వాస్తవాన్ని వీరు గుర్తించరు. పాలకవర్గాలకు ఉపయోగపడుతోంది గనుక ఆ శాస్త్రాన్నే పూర్తిగా నిరాకరిస్తామా లేక వర్గసమాజాన్ని వ్యతిరేకిస్తామా ? అణుశక్తి ప్రస్తుతం పాలక వర్గాల చేతిలో వున్నది గనుక అది ప్రజలకు ప్రమాదకరంగా వున్నది. కానీ అదే అణుశక్తిని ప్రజలకు ఉపయోగపడే పద్ధతుల్లో వాడచ్చన్న విషయాన్ని కూడా మనం గుర్తించాలి.

అంతిమంగా ఈ దృక్పథాలన్నిటికీ భిన్నమైనది మార్క్సిస్టు దృక్పథం. పర్యావరణకూ, సామ్రాజ్యవాదానికీ మధ్య సంబంధాన్ని, దాని చారిత్రిక క్రమాన్ని అర్థంచేసుకొని, సమస్యకు పరిష్కారాన్ని వర్గసమాజం మూలంలో వెతికి పట్టుకున్నది మార్క్సిస్టు దృక్పథం. ప్రకృతికి మానవులకు మధ్య సంబంధాన్ని గతితార్కిక క్రమంలో అర్థంచేసుకుంటేనే సమస్యకు సరైన పరిష్కారం వెతకగలం- ప్రకృతికీ, సమాజానికీ, మానవ మేధస్సుకీ గల ఐక్యతను అధ్యయనం చేసే శాస్త్రం మార్క్సిజం. మార్క్సిజం పర్యావరణ సమతౌల్యాన్ని, అసమతౌల్యాన్ని సరైన కోణంలో అర్థం చేసుకుంటుంది.

భూమిమీద వున్న అన్ని జీవరాశుల మధ్య ఒక సమతౌల్యం వుంటుంది. దీనినే పర్యావరణ సమతౌల్యం అంటారు. ఈ సమతౌల్యం మొత్తం జీవజాలాన్ని అంతరించిపోకుండా కాపాడుతూ వచ్చింది. మొత్తం పర్యావరణాన్ని చిన్న చిన్న యూనిట్లుగా విభజిస్తే ఆ యూనిట్లలో కూడా ఏదో ఒక రూపంలో సమతౌల్యం వుంటుంది. ఆ యూనిట్లనే పర్యావరణ వ్యవస్థ (ecosysteme) అంటారు. ఉదాహరణకు అడవి, సముద్రం, నగరం, గ్రామం కొన్ని పర్యావరణ వ్యవస్థలు.

పర్యావరణంలో అసమతౌల్యం పెట్టుబడిదారీ యుగంతో ప్రారంభం కాలేదు. అది అనాదిగా సాగుతూనేవున్నది. (విధ్వంసం-నిర్మాణం అనే క్రమంలోనే మానవసమాజ నిర్మాణం సాగుతుంది. కాని వ్యాపారంకోసం సాగే విధ్వంసంలో నిర్మాణం అనేది అసాధ్యం.) పర్యావరణంలో పూర్తిస్థాయి సమతౌల్యం (static equilibrium) అనేది మానవుల ఆహార సేకరణ దశలో వుండేది. ఎప్పుడైతే మానవ మేధ అభివృద్ధిచెంది ప్రకృతి మీద తన పట్టును సంపాదించుకున్నదో అప్పుడే ఈ అసమతౌల్యం క్రమంగా మొదలైంది. మానవులు స్థిర వ్యవసాయం నేర్చుకున్నారు. పశుపాలన నేర్చుకున్నారు. ఉత్పత్తిలో మిగులు అనేది మొదలైంది. ఎప్పుడైతే మిగులు అనేది మానవ సమాజంలోకి వచ్చిందో ఆనాడే సమాజం వర్గాలుగా విభజింపబడింది. ఒక అల్పసంఖ్యాక వర్గం అత్యధిక సంఖ్యాకవర్గంపై దోపిడీ సంబంధాలను నెలకొల్పుకున్నది.

ఉత్పత్తి విధానంలో వచ్చిన ఈ మార్పు అటు సమాజంలో ఇటు ప్రకృతిలోనూ అసమతౌల్యాన్ని సృష్టించింది. మనుగడకోసం జరిగే ఉత్పత్తి లాభా

న్వేషణకోసం జరగడం మొదలైంది ఈ ఉత్పత్తి విధానంలో, పంపిణీ విధానంలో మార్పే పర్యావరణ అసమతౌల్యాన్ని సృష్టించింది.

అసమతౌల్యం (dis equilibrium) అనేది ఒకరకంగా లేదు. మారుతున్న ఉత్పత్తి సంబంధాలకనుగుణంగా అసమతౌల్యంలో కూడా మార్పులు వస్తూవున్నా ప్రతిసారి ఒక కొత్త సమతౌల్యం ఏర్పడుతోంది. కాబట్టి ఉత్పత్తి విధానం ప్రమాణంగా అటు సామాజిక సమతౌల్యం ఇటు పర్యావరణ సమతౌల్యం రెండూ కూడా మారుతూవున్నాయి. ఈ మార్పులు క్రమంగా తిరిగి సరిచేయలేని మార్పుల వైపుకు పోకుండా కాపాడాలంటే రెండిటి సమతౌల్యాన్ని మార్చాలి. ఎందుకంటే పర్యావరణ సమతౌల్యం సామాజిక సమతౌల్యంతో ముడిపడి వున్నది. అందుకే సమాజం వర్గరహితంగా మారనిదే ప్రకృతిలో, పర్యావరణ స్థితిలో మార్పులను ఆశించడం అవివేకం అవుతుంది. అందుకే పర్యావరణ ఉద్యమం సామాజిక మార్పుకోసం జరిగే ఉద్యమంలో భాగంకానిదే సమస్యకు అసలు పరిష్కారం లభించదు.

అయితే మన దేశంలో ఇంతవరకూ జరిగిన పర్యావరణ ఉద్యమంలో మార్క్సిస్టుల పాత్ర ఏమీలేదనే చెప్పాలి. అక్కడక్కడా ఆయా సమస్యల మేరకు వారి అవగాహనను ప్రకటించారు తప్ప నేరుగా ఎక్కడా పాల్గొనలేదు. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే పర్యావరణ ఉద్యమం ఒక దీర్ఘకాలికమైనది. దానికి వెంటనే పరిష్కారం లభించదు. దానిని మొత్తంగా వర్గపోరాటంలో భాగం చేయాలేగాని విడిగా చూడలేము. కాని ఆ మేరకైనా ఇంతవరకూ ఎక్కడా ప్రయత్నాలు చేయకపోవడం వల్ల మనకి సరైన దృక్కోణం అలవడలేదు.

ఇప్పటివరకూ పర్యావరణం ఒక పారిశ్రామిక పథకంలోనో లేక శాస్త్ర సాంకేతిక విభాగంలోనో భాగంగానే వుందిగాని, సామాజిక పథంలో (social polic)y దానికి స్థానం లభించలేదు. బహుశ సోషలిస్టు దేశాలలో కూడా ఇక్కడే వైఫల్యం జరిగినట్లుంది. అందుకే అక్కడ కూడా పర్యావరణ సమస్యలు పూర్తిగా పరిష్కారంకాలేదు.

ఇప్పటికైనా పర్యావరణ ఉద్యమాన్ని అభివృద్ధి నిరోధకుల బారి నుండి తప్పించాల్సిన బాధ్యత మనమీదే వుంది. ప్రజలను పర్యావరణ సమస్యలపై చైతన్యవంతం చేయడం అంటే సామాజిక మార్పుకోసం చైతన్యవంతం చేయడమే.

వ్యాసం :

విస్తరిస్తున్న ఉద్యమంలో పురోగమిస్తున్న మహిళలు

—'రాగో'

ఆదివాసీ ఆచారాలతో, కట్టుబాట్లతో తరతరాలుగా అణచబడి వున్న మహిళ తన సంసారం, తన పొలం, తన వంట, తన పిల్లలు, తన అడవి పనులతోనే రోజులోని ఇరవైనాలుగ్గంటల్లో పదహారు, పద్దెనిమిది గంటలవరకు సతమతమవుతూ ఇపుడిపుడే తేరుకుంటుంది. లోకం గూర్చి తాను తెలుసుకుంటుంది. తనపై సాగుతున్న అణచివేతను అర్థంచేసుకుంటుంది. రివాజులు, భగవంతుడు, పాపము, పుణ్యము పనికిరాదు అనే మాటల చాటున ఇన్నాళ్ళుగా అతి హీనంగా కట్టిపడేసిన తీరులోని గుట్టును అర్థంచేసుకుంటుంది. అది మారాలంటుంది.

మగాడితో ఎందులోనూ తీసిపోకుండా, ప్రతి పనిలో భుజం భుజం కలిపి ఒళ్ళు వంచి కష్టంచేసే అక్కలు తమ వ్యక్తిత్వాన్ని గుర్తించమంటున్నారు. ఇంటికోసం, పిల్లలకోసం, సంసారం కోసం అరవ చాకిరిచేసే అక్కలు, తమ మానాన తాము పడి ఉండడం కాకుండా తమ గూర్చి పట్టించుకోవాలంటున్నారు. పెళ్ళి కాకముందు తల్లి, తండ్రి మాట తూచ తప్పక పాటించి, పెళ్ళయ్యాక అత్తారింట్లో అందరి మాటకు తలూపుతూ పుట్టెడు చాకిరిచేసే అక్కలు గంగిరెద్దులా పడఉండడం అంటున్నారు.

తమకూ సంఘాలు కావాలంటున్నారు. తాము రాజకీయాలు నేర్చుకుంటామంటున్నారు. తామూ పోట్లాడుతామంటున్నారు. మాతోకానిదేది అంటూ సవాల్ చేస్తున్నారు. వీరెవరో, ఎక్కడివారో చూద్దాం.

మహారాష్ట్రలోని గడచిరోలి జిల్లాలో జనాభాలో సగం ఆదివాసీలే ఉంటారు. జిల్లాలోని సిరోంచ, అహేరి, ఏటపల్లి, చాముర్షి, ధనోరా, కుర్కెడ, ఆర్మూరీ, మరియు గడచిరోలి తాలూకాలన్నింటిలోనూ ఆదివాసీలుంటారు. ఆదివాసీల్లో వివిధ తెగలవారున్నప్పటికీ, భిన్నసంస్కృతులయినప్పటికీ, విభిన్న భాషలు మాట్లాడినప్పటికి వారి అందరి అవసరం ఒక్కటే. వారి అందరి సమస్య ఒక్కటే. రాజగోండు, మాడియా, అల్పి, పర్ధాన్, గోవారి, వతన్‌కారితో పాటు

గైరాదివాసీ కులాలు కాపు, నేతగాని వారుకూడా తమ భాషగాని, తమ ప్రాంతము గానీ, తమ రాష్ట్రంగానీ, తమకంటేనూ వెనుకబడి పొట్టచేతబట్టుకొని వలసవచ్చి స్థిరపడుతున్న 'ఉరన్' తెగ మహిళను కూడ కలుపుకొని వారందరూ 'ఆదివాసీ మహిళా సంఘం'లో ఒక్కటవుతున్నారు.

దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్ కార్యకలాపాలు విస్తరించిన వెయ్యికి పైబడిన గ్రామాల్లో స్త్రీలు సంఘాలంటున్నారు. ఊరూరా సంఘం, రేంజి సంఘాలు జిల్లా కమిటీల వరకు ఎదిగిన మహిళా ఉద్యమం, మహిళా ఆర్గనైజర్స్‌ను కూడ ఏర్పర్చుకొని మరింత పురోగమిస్తుంది. తమపై సాగుతున్న అణచివేతను ఎదిరించే క్రమంలో సంఘటితపడుతున్న మహిళలు రాజ్యము, రాజ్యహింసతో పోరాడక తప్పని పరిస్థితులే జిల్లా అంతటా నెలకొని ఉన్నాయి.

1980 నవంబర్ 2న కామ్రేడ్ పెద్దిశంకర్ అమరుడైనప్పటి నుండి పరోక్షంగా, 1984 ఫిబ్రవరిలో కమలాపూర్‌లో విచ్ఛిన్నమైన మహాసభల నుండి ప్రత్యక్షంగానూ ఉద్యమంలో వస్తున్న అనేక నిర్బంధాలను వారూ ఎదుర్కొంటున్నారు. ఇబ్బందులను వారూ అనుభవిస్తున్నారు.

అమరుడు కామ్రేడ్ 'సలంద్ర' పెద్దిశంకర్ మరణవార్త విని 'మొయిన్ చిన్‌పేట ఊరంత మూగబోయి కూచున్నది. చెఱచబడ్డ చెల్లెలు కుమిలికుమిలి ఏడుస్తుంది' అంటూ తెలుగుదేశం నలుమూలలా తనపాటతో అడవి సందేశాన్ని వినిపించాడు. ఆనాడు కొడుకును పోగొట్టుకున్నామన్న ఆవేదనతో శోకతప్త హృదయాలైన అమలక్కలు ఇవ్వాళ అడవి అడవంతా ఎర్రజెండా లెగరవేస్తున్నారు. శంకరన్న బాటలో సాగిపోతున్నారు.

ఊళ్లోకి తమకోసం వచ్చే అన్నలకు సద్దిమూటలందించే అవ్వలు, తల్లులు అక్కలు, చెల్లెళ్ళు పాటలు వింటూ, ఆటలాడుతూ పోరాటాన్నాలపించారు. తమ బతుకుతో ముడిపడిఉన్న అనేక కూలిపనుల్లో చేసిన కష్టాన్ని అతి తక్కువ రేట్లకు బహిరంగంగా దోపిడీచేసే కాంట్రాక్టర్లను (ఠేకేదార్) విలదీయడం మొదలు తమపై అన్ని విధాలా దోపిడి, అణచివేతను, తమ శీలాన్ని శంకిస్తూ చెలగాటమాడే దగాకోరు అధికార్ల వరకు అందరితో పోరాడి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. పోరాట మార్గములో అన్నలతో భుజం, భుజం కలుపుతూ కదనరంగానికి సిద్ధమవుతుంటే 'ఆదిలోనే హంసపాదు' అన్నట్టు అడ్డు తగిలిన సాంప్రదాయకవాదులను, ఊరు పెద్దలను, ఇంట్లోని ముసలివాళ్ళను ఎది

రించక తప్పలేదు. వారు తిట్టినా, బెదిరించినా, చివరకు కొట్టినా, పెళ్ళిచేసి ఓ అయ్యచేతిలో పెడితేగాని తిక్క కుదరదని అదలించినా, ఆర్భాటంచేసినా ఓపిగ్గానే భరించి సహించారు. తాము చేసేది తప్పుకాదన్నారు. మగాడితో అన్ని పనుల్లో పాలుపంచుకొనే ఆడది సంగంలో, పోరాటంలో ఎందుకు పాత్రురాలు కాకూడదన్నారు. తమ అన్నదమ్ములతో, కులంవాళ్ళతో, గూడెంవాళ్ళతో కలసి తమ బతుకుపై సాగుతున్న దోపిడీని ఎదిరిస్తూ భూమికోసం పోరాడక తప్పదని కచ్చితంగా చెప్పారు. అడవిలో వచ్చే ప్రతి సమస్యలో భాగస్వాములవుతున్నారు. అన్ని పోరాటాల్లో పాలుపంచుకుంటున్నారు.

ఎండాకాలం వచ్చిందంటేనే ఎండలతో అడవి అడవంతా మండిపోతుంది. ఆ నెలరోజుల్లోనే నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి తునికాకు కూలికి వెళ్ళక తప్పదు. పుంజులు కూయగానే జబ్బకు నీళ్ళబుర్ర తగిలించుకొని గుడ్డపేగందుకోని అడవిదారి పట్టే అక్కలు ఆకాకు రిబ్బుకోని మూటకట్టుకోని పొడిపొడి ప్రాణాలతో నాలుక పిడుచకట్టుకపోంగ మిట్టమధ్యాహ్నం ఇంటిదారి పడుతారు. తిరిగి పొద్దు గూట్లోపడేవరకు ఇంటిల్లిపాది కట్టలు కడితే, కొంగు నడుముకు బిగించి బలిమికి నెత్తిపైకి ఆ కట్టల మూటను ఎత్తుకోని కళ్ళం పైకి తీసుకెళ్ళి వాడి మొగాన పారేసి, వాడిచ్చింది పుచ్చుకోని, వాడు కూసే కారుకూతలన్నీ మౌనంగా భరిస్తూ, మనసు చిన్నబుచ్చుకోని ఇంటిదారి పట్టే ఆదివాసి అక్క

ఇవాళ ఎదురుతిరుగుతుంది. న్యాయంగా తనకు చెందాల్సిన ధర గూర్చి గొంతెత్తి అరుస్తుంది. కష్టపడే కూలిబిడ్డ, చెమటోడ్చే కష్టజీవి ఎవడి పంచన పడుండాల్సిన అవసరం లేదంటుంది. అదరింపులు, బెదరింపులు, ఈసడింపులు, ఛీత్కారాలు చెల్లవంటుంది. మర్యాద ఇచ్చిపుచ్చుకోవాలంటూ, పోరాటపథంలో పురోగమిస్తూ తునికాకు పోరాటములో విజయాలు సాధిస్తూ తర్ఫీదుపొందుతుంది. సమ్మె మొదలు బద్మాష్ ఠేకేదార్ల కళ్ళాలు కాల్చేవరకు నేడు మహిళలు అన్నింటిలోనూ ముందుంటున్నారు. తునికాకు సీజన్‌లో అడవి అడవంతా ఆ నెల రోజులు అక్కల్తోనే కళకళలాడుతుంది. లేత కొమ్మలకు చిగురించిన లేలేత ఆకులను పదిలంగా తెంపుకోని పెట్టుబడిదార్లకు నోట్లకట్టలుగా మారుస్తున్న ఆడపడచులు 'పచ్చనాకు సాక్షిగా' మరిన్ని విజయాలు సాధిస్తారని ఆశిద్దాం!

చలికాలం వచ్చిందంటేనే ఒళ్ళంతా పగుల్లు పడుతుంది. వర్షాభావంతో నీళ్ళు చాలని పొలాలు నెర్రెలుపాసి నోళ్ళు తెరుచుకున్నట్టు ఒళ్ళంతా పగలు

తుంది. కప్పుకోను బట్టపేగుల్లేక, పరచుకోను చాప చింపులే దిక్కై తెలతెల వార్లు నిప్పుతో గడుపుతూ నిద్రమబ్బులో కాలుతూ బొబ్బలతో, వేడిదగడు బుర్రలతో ఒళ్ళంతా హూనం చేసుకొనే ఆదివాసీలు తునికాకులు అందేవరకు వెదురు కూపుల్లో కూలిపనులు చేస్తుంటారు. ఆదివాసీల అవసరాలను కాలదన్నుతూ, అడవంతా కొల్లగొట్టుకోని కొప్పనంలా ట్రక్కులు మెలుక్కొని అడవినుండి మిల్లు దారి పట్టే వాహనాలకు ఏ విఘాతం కలుగకుండా చక్కనైన బాటలు వేయడంలో పొద్దు పొద్దంతా వంచిన నడుం ఎత్తకుండా మగాడితోపాటు కూలిపని చేసి ఆడదైనందుకు రెండురూపాయలు తక్కువ తీసుకోని ఇంటిదారి పట్టడం మాత్రమే తెలిసిన ఆ ఆడది ఇవాళ 'సమాన పనికి సమాన కూలి' అంటూ నిలదీసి పుచ్చుకుంటుంది.

వెదురుకూపుల్లోనే మరో పనికి వస్తే రీబండలింగ్ పనులు. ఇవి కూడ ఎక్కువగా మహిళలే చేస్తుంటారు. ఈ మహిళలు ఎదుర్కొనే సమస్యలెన్నో.

రోజువారి కూలీలుగా వచ్చే అక్కల జీవితాలతో చెలగాటమాడే బాబులకు (మిల్లు ఉద్యోగులు) వీరు అన్నితీర్ల పడి ఉండేవారు. వాడు ఇచ్చినంత కూలి తీసుకోని, రమ్మన్ననాడే కూలికిపోతూ నానా అవస్థలు పడేవారు. కంటికి నచ్చిన పడచులతో సరసాలాడుతూ వాడి 'లైంగిక మదం' తీర్చుకోవడంలో చిత్తం వచ్చినట్లు వాడుకోని నలిగిన పువ్వులా చేసేసి చేతులు దులుపుకునేవారు. దురదృష్టవశాత్తు ఆ పడచు కడుపు పండితే నాటు వైద్యంతో సరిపెట్టడం, అల్లరికి దిగకుండా కులపెద్దల చేతులు తడపడం, మించుకొస్తే 'నాదికాదుపో' అనడంతో పీడ వదిలించుకునేవారు. ఇది గతకాల బాబుల వైభవం. కానీ సమస్యలు వారిని సంఘటితం చేశాయి. పోరాట కమిటీల్లో సమీకృతులవుతూ దుష్టులైన ఒకరిద్దరు బాబులకు దేహశుద్ధి చేసి తమ తడాఖా చూపేసరికి రిమ్మతిరిగిన బాబులు బుద్ధిగ మెసలుకోక తప్పడం లేదు ఇతరత్రా కూలినాలి పనుల్లో జిడ్డు దివాన్‌జీలు, గడసు ఠేకేదార్లు ఎన్నితీర్ల వేదించినా మూగజీవుల్లా అనుభవించిన మహిళలు నేడు తమ జోలికి రాకుండా, తమతో సరసాలాడకుండా ఉండేట్లు బుద్ధిచెప్పుతున్నారు.

కూలి డబ్బులతో పొట్టపోసుకుంటూ యేటేటా కరువుతో సతమతమయ్యే ఆదివాసీలకు జానెడు గుడ్డకూడ కరువే. చేతిలో డబ్బుల్లేక, ఉప్పు మిరపకాయలకే నానా అగచాట్లుపడుతూ బతుకు వెళ్ళదీసే ఆడజీవికి ఒంటిమీద ఆ జానెడు గుడ్డలేకున్నా వెళ్ళదు. దానికోసం తాను ఎన్ని అవమానాలను భరించిందో తలచుకుంటేనే గుండె తరుక్కుపోతుంది. నగదు డబ్బులున్ననాడో, పంటమీద నాలుగు

గింజలు వచ్చిననాడో నీ ఋణం తీరుస్తానని షావుకారి కాళ్ళ కడుపులు పట్టుకోవి మానం పూర్తి గుడ్డపేగు సాధించేవరకు దేవుడుదిగొచ్చివలత పని అయ్యేది. అన్న మద్దతు మీద వాడడిగినంత చేతుల పెట్టకపోయేసరికి ఆ పాపిష్ఠి షావుకారికి కోపం వచ్చి వాడు ఏంచేసినా అడిగేనాధుడే లేకుండే వాడు. తన ఆడదాన్ని వాడు తిట్టినా, కొట్టినా ఎద్దొనంటి మగాడు ఏం చేసే దమ్ములుండేవిగావు. బాకి కట్టన్నాడు నడిబజాల్లో ఒంటిమీదా జానెడు టవల్ గుంజేసి 'ముర్వగెత్తె' (స్త్రీలు గోచిగా వాడే లోపలి గుడ్డ) మీద విలబెట్టి నోటికొచ్చినట్టు తిట్టుతూ తన కళ్ళ ముందే ఆ టవల్ కాలబెట్టినా చేసేది లేక కళ్ళనీళ్ళు పర్యంతమై గుడిశెకొచ్చి పాత చింకితో గుండెలు పగిలిపోయేలా ఏడ్వాల్సిందే తప్పా ఏం చేసేదిగాదు. ఇవాళ ఆ లావా రగుల్కొంది. ఆ బడబాగ్నులు పేలుతాయన్నట్టున్నవి.

గూడెంలో, గుడిసెలో అడుగడుగునా అధికార్ల వేదింపులతో వేగలేక పోయేవారు ఆదివాసి సన్న జీవాలు. కాలు కదిపినా, కాయ తెంపినా, ఆకు ముట్టినా, గడ్డ తవ్వినా అటవీశాఖ వారు అనుమతించడం అటుంచి దయ్యాల్లా వెంటపడేవారు. దండుగలు అంటూ, దడావతులంటూ పీక్కుతినేవారు. కొంప, గూడు లేక నీడకోసం పక్షుల్లా విలవిల్లాడే జీవులు చిన్నపాటి గుడిసెలేసుకుంటే అవి కాల్చి బూడిదచేసే వరకు జంగ్లాతువాళ్ళు విద్రపోయేవారుకాదు. వారికెంత తడిపినా వారి దాహం తీరేదిగాదు.

ఆ కసాయి వ్యవసాయంతో వేగలేక, ఉన్న కొంద్రతో చాలక పంట కాళపడి భూమి నరుక్కుంటే అక్కడా ఈ అధికారులే ప్రత్యక్షమయ్యేవారు. ఈ అధికారుల చట్టం వలయంలో చిక్కుకున్న బతుకుల్లో ఏం చేసినా పాపమే. ఏం చూసినా నేరమే. పొలం దున్నేకాడ గడ్డిమోసేకాడ తన వానితో తాను భుజం భుజం కలిపి బండికిరుసులా తన వంతు పనులు తాను చేసే ఆడది అధికార్ల మూలంగా ఎన్నో హింసలనుభవించేది. తన వాన్ని కేసుల నెపంతో పోలీసు లాకప్పుల్లో చిత్రహింసలు పెడుతూ, కోర్టుపాలు చేసి గుంటెడు భూమికోసం జైళ్ళకీతోస్తున్న ఈ వ్యవస్థ మీద ఆమె పగతీర్చుకుంటుంది. ఆ నరకము ఆ యమయాతనలు ఇక రాకూడదనుకుంటూ 'ఎర్రజండా'లతో 'కిరియ' (దాస) చేస్తూ కదం కలుపుతుంది.

వీరు చేస్తున్న ప్రతి పోరాటాన్ని అణచడానికీ, ఈ సమస్యల వలయం నుండి బయటపడకుండా, ఈ చిత్రహింసల కుంపటి నుండి విముక్తి కాకుండా ఖాకీమృగాలు అనుక్షణం వీరిని వెంటాడుతూనే ఉన్నాయి. గూడాల్లో క్యాంపు

లేస్తున్నారు. ఇల్లిల్లు గాలిస్తున్నారు. అయినా చలించని మహిళలు సవాలుకు జవాబిస్తున్నారు. ఒకనాటి గొడ్డెటి అక్కలు (మాడియా మహిళ) కాదు వాళ్ళు. అడవన్నల చేతుల్లో బందూకులు చూస్తున్న తరం ఇది బందూకుల్తోనే బందూకుల్ని ఎదిరిస్తే తప్పా ఈ కుళ్ళు వ్యవస్థ పీడ వదలదని ట్రేనప్ అవుతున్న మహిళలు వాళ్ళు. ఆకాశంలో సగం మీరు అంటూ కవులు మనసారా చెప్పే తియ్యని మాటలకు నిజంగా సజీవ సాక్ష్యం వాళ్ళు. వీరు ఈ యేడాదికాలంలో పోలీసులతో బాహాబాహీ పోరాటానికి దిగి సాధించుకున్న విజయాలు మచ్చుకు కొన్ని :

రేగులవాయి ఊళ్లో సంఘం అన్నను అరెస్టు చేయడానికి పోలీసులు వచ్చి ఊరంతా చుట్టుముట్టి ఇంటిచుట్టు వలయం పన్నారు. ఇది పసిగట్టిన అక్కలందరు ఒక్కుమ్మడిగా పోలీసుల చేతిలో చిక్కిన సంఘం అన్నను పట్టుకున్నారు. ఏ నేరం చేయని మా అన్నను ససేమిరా విడవమంటూ తెగబడి నిల్చేసరికి బెంబేలు పడ్డ పోలీసులు ఆ కార్యకర్తను విడిచిపెట్టిపోక తప్పలేదు.

ఆల్లపెల్లిలో అకులరేటు పెంచమంటూ, కరువు నివారణ చర్యలు చేపట్టాలంటూ వందలాదిమంది స్త్రీ, పురుషులు ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు అడ్డుతగిలి జిల్లా నాయకుడైన తొర్రెం పోచంను అరెస్టుచేసి వ్యానులో ఎక్కిస్తుండగా అక్కలందరూ వ్యానుచుట్టుముట్టారు అక్రమంగా తమ నాయకున్ని అరెస్టుచేసినందుకు పోలీసులతో ఘర్షణకు దిగకతప్పలేదు. పోలీసులు గుడ్లప్పగించి చూస్తుండగానే నలుగురక్కలు కూడి వ్యానులో నుండి తమ నాయకున్ని దింపుకోని మోర్చా (ప్రదర్శన) జయప్రదం చేసుకున్నారు.

రొండవాయిలో సంఘ సభ్యుణ్ని అరెస్టుచేయడాన్ని, 'పేంద్రి' క్యాంపు పోలీసులు ఊళ్ళ వెంట తిరుగుతూ ఇళ్ళలోకి చొర్రి వెర్రివేశాలు వేయడాన్ని సహించని మహిళలు తమ రేంజిలోని అన్నలందరితో కలసి పేంద్రి పోలీసు క్యాంపు పైకి ప్రదర్శన తీసుకెళ్ళి వందలాది పోలీసుల మధ్య ధైర్యంగా నిలబడి 'మా గూడాల్లోకి వస్తే ఊర్కోం' అంటూ హెచ్చరించి తమవాణ్ని విడిపించుకోనిగాని వెనక్కి తిరగలేదు. వందలాది జనాలను, అందులో అగ్రభాగాన మహిళలను చూసిన S.R P (స్పెషల్ రిజర్వు పోలీసు) లకు నోట మాటరాలేదు.

కసంసూర్ క్యాంపును చుట్టుముట్టి 15 మంది SRP జవాన్లను బయటకు పిలిచి, తమ బంధూకులన్నీ గదిలోనేపెట్టి రావాలని షరతు విధించి అరెస్టుచేసిన తమ అన్నలను వెంటనే విడుదలచేయని పక్షంలో తీవ్రపరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించి విడిపించుకున్నారు.

రాజారంలో హోళీ పండుగనాడు తమతో సరసాలాడుతూ, రంగులు చల్లుతూ వెకిలిచేష్టలు చేస్తూ పోలీసుబుద్ధి పోనిచ్చుకోని ఓ పోలీసోడి తల పగిలింది. వార్త తెలిసిన తోటి పోలీసులు క్యాంపునుండి ఆఘమేఘాలమీద వచ్చేసరికి అక్కలు, అన్నలు బడితెలతో ప్రత్యక్షమయ్యేసరికి తల పగిలిన తోటి వాణ్ని భుజానవేసుకొని వచ్చినదారి పట్టకతప్పలేదు. నిజంగా ఆనాడు పోలీసోడి తల పగలగొట్టిన సంఘం మధునక్కను మెచ్చుకోనివారులేరు. తరతరాలుగా పోలీసుల జంగ్లాతువాళ్ళ వేదింపులకు గురవుతూ బానిసల్లా బతుకు వెళ్ళదీస్తున్న వారికి మధునక్క దారిచూపి ఆదర్శమైంది. పోరాడితేపోయేది బాధలుమాత్రమే. నన్న నైజం ఏమేరకర్థమైందోగానీ ఆవిడ మాత్రం ఆచరణలో అక్షరాలా నిరూపించింది.

గురిజలో పండు ముసలిది లేవలేక తన మానాన తాను కుక్కిమంచంలో పడిఉంటే గిల్లికజ్జాలు పెట్టుకునే పోలీసులు అనవసరంగా ఆమెను కదిలించారు. మాటామాట ముదిరింది. అదనా ముసల్ది అన్ని మాటలంటుందా అని పోలీసు పొగరు గుర్తుచేసింది. ఊరంత చేరుకుంది. అక్కలు అన్నలు దడికొయ్యలందుకున్నారు. ఇంకేం! హోరాహోరీగా తలపడ్డారు. రక్తం చిమ్ముతుంది. లెక్క చేసిన వారు లేరు. ఆ ఘర్షణలో తన కాళ్ళ వద్ద పడిపోయిన ఓ పోలీసోడి తలపై ముసలిదాని ఊతకర్ర బలంగా పడింది. తల చెక్కలయింది. దిమ్మ దిరిగిన పోలీసు సొమ్మసిల్లిపోయాడు. ఖంగుతిన్న పోలీసులు కాలికి బుద్ధి చెప్పారు.

జీవన్మరణ పోరాటములో దిన దినం వారితో సహకరిస్తూ, ముందుకొస్తున్న మహిళలపట్ల అన్నలకెంతో అభిమానం ఏర్పడింది. విశ్వాసం పెరిగింది. ఠేకేదారును, సర్కారోన్ని, పోలీసోన్ని వీరోచితంగా ప్రతిఘటిస్తూ ప్రతి సమస్యలో ధైర్యంగా చొరవచేస్తున్న అక్కలు లేవిదే తామేంచేసినా వెలితిగానే ఉంటుందని అన్నలంటున్నారు. సిరొంచ మొదలు కుర్కెడ వరకు ఈరోజు అక్కలు లేని మోర్చాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు జరగడం లేదు. మహిళలు సాయుధులవుతున్నారని చూపడానికి చరిత్రలో నిలిచిపోయిన 'సుర్సుండి' ఘటన తాజా ఉదాహరణ అవుతుంది.

30-3-1990 నాడు పన్నిండూర్లకు మొనగాడైన రాజు సుర్సుండిలో తనతో సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుందామని వచ్చిన వందలాది అమాయక గోండులపైకి పోలీసులను రెచ్చగొట్టాడు. చెప్పాచేయకుండానే పోలీ

సులు కాల్పులు ప్రారంభించారు. తూటాలతో గాయపడిన స్త్రీ, పురుషులు రక్త ధారలతో పడి దొర్లుతుంటే, బలమైన గాయాలైనవారు నెత్తురు మడుగులో విల విల్లాడుతూ ప్రాణాలు వదలుతుంటే జనం ఆవేశం, పగ, కోపం కట్టలు తెంచు కొంది. కాల్వలుగా పారుతున్న రక్తం, నెత్తురు మడుగులో పడిఉన్న శవం, గాయాలతో తోటివారు 'బద్‌లా'కు హెచ్చరించారు. జనం పోలీసులపై బడ్డారు. పారిపోయేవాడు పారిపోగ దొరికిన పోలీసులు జనం చేతిలో నుజ్జునుజ్జయ్యారు. అదనుచూసిన మహిళలు తమకు దొరికిన పోలీసుల్ని చితకతన్ని వారి రైఫిళ్ళను లాక్కున్నారు.

నేలకొరిగిన కామ్రేడ్ దయారాం తుమ్రేటికి జోహార్లంటూ వేల కంఠాలు నినదించాయి.

ఇలా ఎక్కడికక్కడే ఆదివాసీ అక్కలు పోరాట పిలుపునందుకొని ముందు కొస్తున్నారు. వారి న్యాయమైన పోరాటాన్ని చూస్తున్న పెద్దలిపుడు వారినాపడం లేదు.

ఆదివాసీ సాంప్రదాయాలతో, రీతి రివాజులతో సమాజం అట్టడుగునా అణచి వేయబడిన ఆదివాసీ మహిళ వీర గెరిల్లా అవుతుంది. తోటి వారందరిని గెరిల్లా లుగా చేయాలనీ బందూకు చేతబట్టి ఒక నిర్మలలా, ఒక జ్యోతిలా, ఒక స్వర్ణలా ఊరూరా, వాడవాడ తిరుగుతూ తన శక్తినంతా సమీకరించుకుంటుంది. పోరాట పాట పాడుతుంది. ఆడుతుంది. పోరాటజెండా నెత్తుకుంది. నూతన ప్రజాతంత్ర విప్లవం వర్ధిల్లాలంటూ అడవి అడవంతా దద్దరిల్లేలా రణన్నినాదాన్నిస్తుంది.

బుల్లెట్స్

మీ తలలన్నీ నా ఉక్కుపాదం క్రింద చీమలని విర్రవీగావు
మేం భయంతో గజగజ వణికాం
మా నెత్తుటి లిపి రాస్తున్న వాళ్ళమీద కుట్రకేసు బనాయించావు
మా రక్తంలో చలనం మొదలయింది
మా తలల అస్థిత్వం కోసం పోరాడుతున్న వాళ్ళను ఎన్‌కౌంటర్ చేశావు
ఇప్పుడు నీమీదకు గురిపెట్టిన తుపాకిలో
బుల్లెట్స్ అయ్యారు ఆ అమరవీరులు —ఎమ్. ఎస్. ఆర్.

కథ :

తుపాకులు ఆకులు కోయలేవు

—కాడి

ఎర్రమట్టి రోడ్డుమీద చిన్నచిన్న కుదుపులతో మెల్లగా శబ్దం ఎక్కువ కాకుండా పోతూంది జీపు. జీపు ముందు భాగం పైన ఎర్రబల్బు ఆరిపోతూ వెలుగుతుంది. ఆకాశంలో చుక్కలు మాత్రం ఒకే తీరుగా మెరుస్తున్నవి. డ్రైవర్ రోడ్డు ప్రక్కనున్న పొదలనే ఎక్కువగా గమనిస్తున్నాడు. అనుమానించే ప్రతి పొదను ఒక వైతరణిలా దాటుతున్నాడు. కాని పాపం రెడ్‌బల్బు వెలగడం మాత్రం గమనించడంలేదు.

"ఆ ఇప్పుడు చింతవాగు దాటుతున్నాం". "ఇప్పుడు టేకు ప్లాంటేషన్‌లో ఉన్నాం". "పెద్ద బ్రిడ్జి దగ్గరికి చేరుకుంటున్నాం" అంటూ డ్రైవర్ ప్రక్కనే కూర్చున్న వైర్‌లెస్ ఆపరేటరు తన సోది తను కొనసాగిస్తున్నాడు. లేకపోతే ఆంధ్రలో జరిగినట్టు ల్యాండ్‌మైన్స్ పేలి పోలీసులందరు చచ్చిన తరువాత నాలుగు గంటల వరకు ఎవడికి వాళ్ళ అడ్రసు కూడ దొరకదని మధ్యప్రదేశ్ ప్రభుత్వం భయం. అందుకని ఆ సోది అలా సాగుతూనే ఉండాలి. ఆ సొద అకారణంగా ఆగిపోతే సమ్‌థింగ్ హాపెన్ అని కంట్రోల్ రూం వాడికి తెలుస్తుంది.

డ్రైవర్, ఆపరేటర్ తమ పనుల్లో తాము నిమగ్నమై ఉన్నారు. కొత్తగా వచ్చిన IPS ఆఫీసర్ పేరుకే జీపులో కూర్చున్నాడు కాని అతివి ఆలోచనలు మాత్రం జీపులో లేవు. వీడ్కోలు చెప్పుతూ కంటనీరుపెట్టిన తన ప్రియురాలు శశి చుట్టూరే తిరుగుతున్నాయి. బస్తర్‌లో తునికిఆకు జాతీయకరణ తరువాత తునికాకు తెంపించడం కోసం ప్రభుత్వంచే పంపబడ్డ 25 మంది IPS, IAS, IFSA ఆఫీసర్లలలో తనూ ఒకడు. ప్రభుత్వం ప్రతి రేంజ్‌కు ఒక IPS ఒక IAS ఒక IFSA ఆఫీసర్లతో కూడిన కమిటీల నిర్మించింది తునికి ఆకు కోయడానికి. 25 మంది IPS లలో అందరికంటే తనే చిన్నవాడు.

తను బొంబాయికి చెందినవాడు. ఇంతకుముందు బొంబాయిలో ఒక ఇంగ్లిషు పత్రికలో "రెడ్‌స్టార్ ఓవర్ ది బస్తర్" అనే వ్యాసం చదివాడు ఇంకా అనేక పత్రికల్లో నక్సలైట్ల "ఆగడాల" గురించి కూడ చదివాడు.

"మీరు వెళ్తుంది నక్సలైట్ల ప్రాంతమట చాల జాగ్రత్తగా ఉండండి" అంటూ శశి చెప్పిన మాటలు పదే పదే గుర్తుకువస్తున్నాయి అవును ఆంధ్రలో ఇదే పార్టీవాళ్ళు ల్యాండ్‌మైన్స్ పేల్చుతున్నారు. LMG లు గ్రెనేడ్ రైఫిల్స్ ఉన్నా మైన్ పేలితే అన్నీ దండుగే. అమ్మో నిజంగానే ఏదైనా మైన్ పేలి నేను తిరిగి వెళ్ళకపోతే నా శశి ఏమైపోవాలి అని అనుకుంటుండగానే తన దృష్టి అకస్మాత్తుగా ఆరిపోతూ వెలుగుతున్న రెడ్‌బల్బుపై పడ్డది.

అంతే అదిరిపోయాడు. బెదిరిపోయిన దుప్పిలాగ పెద్దగా కేకపెట్టాడు "బంద్‌కరో సాలె" అంటూ. ఆ కేకకు భయపడిపోయిన డ్రైవర్ ఏది బందు చెయ్యాలో అర్థంగాక సడెన్ బ్రేక్ వేశాడు. అంతే ఒకరి తలలు ఒకరికి ఠపీమని కొట్టుకున్నాయి. బొప్పికట్టిన తలలను పులుక్కుంటూనే వెనక కూర్చున్న నలుగురు పోలీసులు తమ టామీ గన్నులతో బయటికిదుమికారు. వెంటనే జీపు క్రింద టైర్ల వెనక పొజీషన్ తీసుకున్నారు. భయంతో వణకిపోతూనే "భాగో సాలే" అంటూ అలవాటు ప్రకారం అరుస్తున్నారు.

డ్రైవరు స్టీరింగ్ క్రింద నక్కాడు. ఆపరేటరు తను కాళ్ళుపెట్టుకునే జాగాతో బొప్పికట్టిన తలను పుణుక్కునేసరికి క్రూర ఆఫీసర్‌కు కోపం రెండింతలయ్యింది. "యూ ఇడియట్" అంటూ స్టీరింగ్ క్రింద నక్కిన డ్రైవర్‌ను గల్లపట్టి లేపుతూ "వెధవ రెడ్‌బల్బు బంద్ చెయ్యమంటే తలలు తగులకొట్టావు ఇంత భయం అయితే ఎలా బతుకుతావురా" అంటూ డ్రైవరే భయపడ్డట్టు డ్రైవర్‌నే తిట్టాడు. ఎలాగైతేనేం చివరికి విషయం అర్థంఅయ్యి డ్రైవర్ తొందరగా లేచి రెడ్‌బల్బును బందు చేశాడు. ఇంతసేపు ఏ దుర్ఘటన జరగనందుకు ఆఫీసరు ఎంతో సంతోషపడ్డాడు.

రెడ్‌బల్బు గురించి అర్థంకాకున్నా మొత్తానికి నక్సలైట్ల సమస్యకాదని అర్థంకాగానే ఆపరేటరు కూడ మెల్లగా లేచాడు. కాని రెడ్‌బల్బు ఎందుకు బందు చెయ్యాలో అర్థంకాకపోవడంతో అనుమానంగా "సర్ రెడ్ బల్బు"... అంటూ ఆగిపోయాడు వెలుగుతూ ఉండాలికదా అనే భావంతో. ఆ భావాన్ని అర్థం చేసుకున్న ఆఫీసరు "ఇది నక్సలైట్ల ఏరియారా మగడా ఎర్రలైట్లు వెలగడం అంటే కైలాసానికి టిక్కెట్టు రిజర్వు చేసుకున్నట్లే" అంటూ ఆపరేటరు అనుమానాన్ని తీర్చాడు. జీపు క్రింద పడుకున్న పోలీసులకు కూడా విషయం అర్థం అయ్యి బతికాముర భగవంతుడా అనుకుంటూ లేచారు.

ఆపరేటరుకు మొదటిరోజు ఇంకో IPS ఆఫీసర్ డిపార్టుమెంటుకుచెందిన కొత్తజీపు వద్దని పాతడొక్కు ప్రయివేట్ జీపునే ఎందుకు కోరికోరి తీసుకున్నాడో

ఇప్పుడు అర్థం అయ్యింది. కొద్దిసేపు వైర్‌లెస్ సంబంధాలు కట్ అయ్యినందుకు కంట్రోల్‌రూం వాళ్ళకు కారణం సర్దిచెప్పి మళ్ళీ మొదలుపెట్టాడు సోది "ఇప్పుడు పొలాలు దాటుతున్నాం" "ఆ ఊరిలోకి చేరాం" అంటూ

డ్రైవరు 15 రోజుల నుండి అయిన అలవాటు ప్రకారం జీపును స్కూల్ టీచర్ (గురూజీ) ఇంటిముందు ఆపాడు. ఆ జీపు శబ్దం కోసమే వేచి చూస్తున్న టీచర్ జీపు ఆగగానే లనే తలుపు తెరుచుకుని జీపు వద్దకు వచ్చాడు. తన కోపం బాధ అంతా ఎంత తొందరగా వెళ్ళగక్కాలా అన్నట్టుంది టీచరు మొఖం. టీచర్‌ను చూస్తేనే IPS ఆఫీసరు "ఏం గురూజీ ఇవ్వాలైనా ఆకులు తెచ్చారా ఊరివాళ్ళు"? అంటూ ప్రశ్నించాడు. ఊరివాళ్ళు రెండు రోజులే తునికి ఆకులు కోసి బంద్ చేశారు.

ఆఫీసర్ ప్రశ్న పూర్తి అయ్యీకాకముందే టీచర్ కోపం కట్టలు తెంచుకుంది. "ఆకులు సంగతి దేవుడుకెరుగు మా వీపులు సాపు అయ్యేలా ఉన్నవి. ఇంతవరకు నక్సలైట్ల చేతిలో ఫారెస్టు, రెవిన్యూ అధికారులే దెబ్బలుతిన్నారు. ఇప్పుడు మా టీచర్స్‌ను కూడ తన్నించేందుకే మమ్మల్ని ఈ ఆకుల కల్లెదార్లుగా ఇరికించినట్టున్నారు. లేకపోతే జనాలు కల్లెదార్లుగా ఉండమని అంటె మమ్మల్నే బలవంతంగా కల్లెదార్లుగా చేయడమేమిటి? ఇప్పటికే ఛస్తే, పుడితే సర్వేలు అని ఓటర్ల లిస్టులని మమ్మల్నే పీక్కుతింటారు. ఇప్పుడు తునికి ఆకులు కొనడం కూడా మా నెత్తిమీదికేనా? చూడపోతే ముందు ముందు ఊర్లు ఊడ్చించడం, రాత్రిల్లు ఊర్లు కాపలాకాయడం కూడా మాకే అప్పచెప్పేటట్టున్నారు. అసలు మేము ఇంటికి ఎప్పుడు వెళ్ళాలి? ఇప్పటికే ప్రభుత్వం ఈ సంవత్సరం 15 రోజుల సెలవులు కట్ చేసింది. అసలు జనం ఆకులు కొయ్యమని అంటే మేం ఇక్కడేంచెయ్యాలి?" అంటూ గుక్కతిప్పుకోకుండా తన బాధనంతా చెప్పుకు పోతూనే ఉన్నాడు.

కుర్ర ఆఫీసరు టీచర్ ధైర్యానికి ఆశ్చర్యపోయి అలాగే చూస్తూండిపోయాడు. ఇంతలో తనో IPS ఆఫీసరని గుర్తుకు వచ్చేసరికి తన అహంభావం దెబ్బతిన్నట్టు అనిపించింది. దాంతో తన ఆఫీసరు హుందాతనమంతా ప్రదర్శిస్తూ "యూ స్టాపిట్" అంటూ అరిచాడు. కాని ఆఫీసర్‌కు ఏం తెలుసు ఈ బలవంతపు కల్లేదార్ పనివల్ల తన చెల్లెలు పెండ్లి చూడలేకపోయిన కోపం టీచర్‌ను ఇలా మాట్లాడిస్తుందని. ఏమైతేనేం ఆఫీసర్ అరుపుకు టీచర్ మౌనం అయ్యాడు. తను చెప్పాలనుకున్నది చెప్పాననే తృప్తితో ఉన్నాడు ఇప్పుడు.

ఆఫీసర్ మాత్రం స్టాపిట్ అంటూ అరిచాడేకాని తరువాత ఏం తిట్టాలో అర్థంకాలేదు ఏం తిట్టితే ఏం కొంపలు మునుగుతాయో అసలే ఈ ఏరియాలో టీచర్ల దగ్గిరికి నక్సలైట్లు వచ్చిపోతుంటారని వినికిడి. వాళ్ళ ధైర్యం కూడ ఉందేమో వీడికి. ఎందుకొచ్చినగొడవ అనుకుని "చూడు మిస్టర్ నిన్ను కల్లే దారుగా నియమించింది నేను కాదు ఇక్కడ కల్లెదారుగా ఎవడు ఉంటే వాడి పనిని చెక్‌చేసుకోవడం నా బాధ్యత. అందుకని నీ కంఠశోష అంతా నాదగ్గర కాదు నిన్ను నియమించినవాదిదగ్గర వెళ్ళబోసుకో. అంతేకాని నాదిగ్గిర పిచ్చి వేషాలెయ్యకు వెళ్ళు వెళ్ళు" అంటూ గురూజి వెళ్ళక ముందే జీపును పోనియ్య మని డ్రైవర్‌ను ఆదేశించాడు.

నియమించినవాడికి కూడ నివేదిస్తే ఉద్యోగం ఉండాలో ఊడాలో తేల్చు కొమ్మని బెదిరించారు దొంగ వెధవలు అంటూ గులుక్కుంటూ టీచర్ ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

మరో గ్రామానికి చేరుకుంది జీపు. కాని ఆఫీసరు ముందుగ్రామంలో జరి గిన చర్చ వల్ల చికాకుగా ఉన్నాడు. అందుకని అక్కడ గురూజీని (టీచర్) లేపడానికి మనసొప్పక కేవలం కళ్ళంచూసుకొని తరువాత గ్రామానికి పోనీయ మని డ్రైవర్‌కు చెప్పాడు. ఆఫీసరు మతిమరుపుకు ఆశ్చర్యపోతూ "సర్ తరు వాత ఊరు మన గంగలూరు రేంజ్‌దికాదు బాసగూడెం రేంజిది" అంటూ డ్రైవర్ సెలవిచ్చాడు.

"ఓహ్ అవునుకదూ. అయితే బాసగూడెమే పోనియ్" అంటూ ఆర్డరు ఇచ్చాడు ఆఫీసర్ IPS. అసలు బాసగూడెం రేంజ్‌లో తునికి ఆకు తెంపు తున్నారో లేదో. తన తోటి ఆఫీసర్లు ఎలాచేస్తున్నారో తెలుసుకుందామని, జీపు బాసగూడెం చేరేసరికి తొమ్మిదింబావు అవుతుంది. బాసగూడెం ఆఫీసర్లు అప్పుడే అన్నం తిని తమ కార్యకలాపాల గురించి చర్చించుకుంటున్నారు. ఇంతలో గంగలూరు IPS రావడంతో సంతోషంగా ఆహ్వానించారు. కొద్దిసేపు కుశల ప్రశ్నలు అవి ఇవి సాగిన తరువాత చర్చ మళ్ళీ తునికి ఆకుల మీదికి తిరిగింది.

అవును మీ దగ్గర ఆకులు కోస్తున్నారా? మాదిగ్గర రెండురోజులు కోసి ఇక చస్తే కోయమంటున్నారు. గట్టిగా చెప్పితే లక్ష తొంభై వంకలు చెప్పి తప్పించుకుంటున్నారు. అసలు మీరెలా చేస్తున్నారు" అంటూ ప్రశ్నించాడు గంగలూరు IPS. "వాట్? రెండురోజులు అన్ని గ్రామాలలో ఆకులు కోశారా"? ఆశ్చర్యపోతూ అడిగాడు బాసగూడెం IFSA ఆఫీసర్. "అయితే మీరు అదృష్ట

వంతులు అన్నమాట. మేము ఏడు గ్రామాలలో రెండేసి రోజులు కోయించడా
నికి ఏడు చెరువుల నీళ్ళు తాగాము" అంటూ వాపోయాడు బాసగూడెంకు చెందిన
మరో IAS ఆఫీసర్.

ఇప్పుడు ఆశ్చర్యపోవడం గంగలూరు IPS వంతు అయ్యింది. "ఏమిటి?
మీ దగ్గర ఇంకా అన్ని గ్రామాలలో ఆకులు తెగలేదా? అసలు వీళ్ళు వినాలంటే
గట్టిగా బెదిరించాలి" అంటూ ఓ ఆపద్ధర్మ సలహా పారేశాడు. మనసులో మాత్రం
వీళ్ళకంటె తనే నయమని అర్థంకాగానే సంతోషంగా ఉంది.

"ఆ గట్టిగా ఎందుకు చెప్పడంలేదు సామ భేద దాన దండోపాయాలు
అన్నీ ప్రయోగించాం. ఆకులు కొయ్యకపోతే మా ప్రభుత్వం వేయించిన
బోరింగ్ పీక్కొనివెళ్తాం అన్నాగాని ఎవడూ వినడే! ఒక ఊరిలో అయితే ఒక
బోరింగ్ విరగ్గొట్టాం కూడ అయినా వినరే ఈ మురియా దరిద్రులు. అసలు ఆ
ఏడు గ్రామాలలో కూడా ఆ తిక్కమాంజిగాడు లేకపోతే ఆకు తెగకనేపోవును.
ఆ దరిద్రుడు రోజూ ఓ బాటిల్ ఇస్తేగాని జీపు ఎక్కేవాడుకాదు" అంటూ తన
చికాకునంతా ఏకరువుపెట్టాడు బాసగూడెం IPS. "మొత్తానికి గంగలూరువాళ్ళు
పతకాలుకాకున్నా ప్రశంశా పత్రాన్ని అయినా పొందుతున్నారన్నమాట" లోపల
ఈర్ష్యగానే ఉన్నా మీదికి మాత్రం మామూలుగానే అన్నాడు బాసగూడెం IAS
మరోసారి కల్పించుకుంటూ.

ఇంతలో వేగంగానే ఓ జీపు వచ్చి కీచుమంటు ఆగింది. అందరు చర్చ
ఆపి జీపులో ఎవరు వచ్చారా అవి చూస్తుండగానే మద్దేడ్ రేంజ్ SI జీపు దిగి
ఉరుకులు పరుగుల మీద వచ్చి టక్ టక్ సెల్యూట్ చేశాడు. SI మొఖంలో
ఆందోళన కొట్టివచ్చినట్లు కన్పిస్తుంది. "ఏం కొంపలు మునిగాయి? ఏంటి
ఇటొచ్చావు ఇంత రాత్రి" అంటూ అనుమానంగానే అడిగాడు బాసగూడెం IPS
"సర్ మా రేంజ్‌లో ఇప్పుడిప్పుడే పదకొండు కళ్ళాలు కాలబెట్టారు నక్సలైట్లు.
ఆ విషయం చెప్పమని పంపారు మా ఆఫీసర్" అంటూ SI చావుకబురు చల్లగా
చెప్పాడు. "వాట్ మా రేంజ్‌లో కూడ కాలబెట్టారా?" అంటూ లేచినిలబడ్డాడు
అనుకోకుండానే బాసగూడెం IPS "లేద్సార్ మీ రేంజ్‌లో కళ్ళాల వద్ద పోలీ
సులున్నారు కళ్ళాలు కూడ సురక్షితంగానే ఉన్నాయి నేను దారిలో చూశాను"
అన్నాడు SI "అవునుకదూ నేను మరిచేపోయాను" అంటూ గట్టిగా గాలిపీల్చు
కుంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"పదకొండు కళ్ళాలు ఒకేసారి కాలబెట్టారా? అసలు ఎంతమంది నక్స
లైట్లు తిరుగుతున్నారు మద్దేడ్ ఏరియాలో?" ఆశ్చర్యంగా అడిగాడు గంగలూరు

IPS అన్ని కళ్ళాలు నక్సలైట్లే కాలబెట్టారనుకుని. ఆఫీసరు ఆలోచనను అర్థం చేసుకున్న SI "అదికాదు సార్ అన్ని కళ్ళాలు నక్సలైట్లే కాలబెట్టారు. వాళ్ళు ఏదో ఒకటే కాలబెడతారు. మిగతావన్ని వాళ్ళ మిలిషెంట్లు కాలబెడతారు" ఆఫీసర్ అనుమానాన్ని తీర్చాడు. "అవును మరి మర్దేడ్‌లో కళ్ళాల వద్ద పోలీసులను కాపలాపెట్టలేదా?" మళ్ళీ ఓ భేతాళ ప్రశ్నవేశాడు గంగలూరు IPS "జనాన్ని తన్నేసరికి అన్ని గ్రామాల వాళ్ళు ఒకటి రెండు రోజులు ఆకులు కోశారు. అన్ని ఊర్లలో కళ్ళాలు అయినాయి. దానితో మా రేంజ్‌కిచ్చిన ఫోర్స్ సరిపోలేదు" మళ్ళీ ఓపిగ్గా జవాబిచ్చాడు SI.

మన దగ్గర ఏడు గ్రామాల వాళ్ళే కోయడం మంచి అయ్యిందన్నమాట. అన్ని గ్రామాలవాళ్ళు కోస్తే మనకు కూడ ఫోర్స్ సరిపోకపోవు. అయితే మనమే అదృష్టవంతులమన్నట్లు. వాళ్ళు అన్ని గ్రామాలలో ఆకులు కోయించి నట్లేకాని మనంత ఆకును కూడా చూపించలేరన్నమాట" అంటూ బిగ్గరగా నవ్వడం మొదలుపెట్టాడు బాసగూడెం DFO. "ఏం గురూ మీ దగ్గర కూడ అన్ని కళ్ళాల దగ్గర ఫోర్స్ ఉందా" అంటూ గంగలూరు IPS ను చూస్తూ ప్రశ్నించాడు బాసగూడెం IAS అంతే అసంకల్పితంగా లేచి నిలబడ్డాడు గంగలూరు IPS. "అ.... అవును మా దగ్గర కూడ మూడు దిక్కులే ఫోర్సు అంతా ఉంది. ఎందుకైనా మంచిది ఇక నేను వెళ్తాను" అంటూ ఆవరా బాదరగా అందరికి గుడ్‌నైట్ చెప్పి బయలుదేరాడు. అప్పటివరకు అజేయునిగా కనిపించిన ఆఫీసర్ ఫోజు అప్పుడు రాజ్యం కోల్పోయిన రాజులా అయ్యింది.

జీపు వేగంగానే వెళ్తుంది. డ్రైవర్ పరిస్థితిని అర్థం చేసుకున్నట్టుంది. ఆఫీసరు ఆలోచనలన్ని ఆకుల కళ్ళాల చుట్టే తిరుగుతున్నాయి కొద్ది సమయం క్రితంవరకు రెండురోజులే అయినా అన్ని గ్రామాలలో ఆకులు కోయించినందుకు గర్వంగా పొంగిపోయాడు. కాని అప్పుడే అదృష్టాలు తారుమారు అయ్యాయి. పతకాలు, ప్రశంశాపత్రాలు రాకపోయినా పర్వాలేదు కాని తన రేంజ్ కళ్ళాలు కాలవద్దని మనసులోనే భగవంతున్ని ప్రార్థిస్తున్నాడు ఇప్పుడు గంగలూరు IPS. జీపు బీజాపూర్ గుట్టలబెల్టు దాటి గంగలూరు రేంజ్‌లో ప్రవేశించింది. ఆఫిసరు ఊపిరిబిగపట్టి కూర్చున్నాడు. గంగలూరు రేంజ్‌కు చెందిన పెద్దకోర్మె అనే ఊరు ఇంకా కిలోమీటరు దూరం ఉందనగా ఆకాశంలో నల్లగా పొగలు, ఆ పొగల క్రింద ఎర్రగా వెలుతురు ప్రత్యక్షమైంది. అనుకోకుండానే ఆఫిసరు చేతులు తలను పట్టుకున్నాయి.

* * *

జగదల్‌పూర్ జూన్ 10, 89. లఘువనోపజ్ సంఘంకు చెందిన హాలులో IPS, IAS, IFSA కు చెందిన 75 మంది ఆఫీసర్లు కూర్చుని ఉన్నారు. అందరు బస్తరు తునికి ఆకు పనిలో పాల్గొన్నవారే. అందరు చిర్రుబుర్రుగానే ఉన్నారు వాళ్ళకు ఎదురుగా లఘువనోపజ్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు భావె కూర్చున్నాడు. అతని మొఖం కూడ చిరాకు తో నిండిఉంది. తునికి ఆకు జాతీయకరణ వల్ల బస్తర్‌లో పొందిన ఫలితాల్ని సమీక్షిస్తున్నారు.

ఒక IAS ఆఫీసర్ లేచి "IPS, IAS, IFSA కు చెందిన 25-25 మంది ఆఫీసర్లను, దక్షిణబస్తర్ పోలీసుజిల్లాకుచెందిన 14 కంపెనీల SAF (స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్స్), ఇంకా అదనపు SAF కంపెనీలు, హోంగార్డులు ఇందరిని ఉపయోగించికూడ గత సం॥రం తెంపిన ఆకులో 10% ఆకుకూడ తెంపించలేక పోయామంటే దానికి కారణం ప్రభుత్వం జాతీయకరణ పేరుమీద బస్తర్‌లో 30పై॥ ఉన్న రేటును 15పై చేయడమే. ఒక్క కుంట తాలుకానే చూస్తే అర్థం అవుతుంది. మొత్తం తాలుకాలో 5 గ్రామాల వాళ్ళే రెండురోజులే ఆకులు కోశారంటే మనం ఎంత గొప్పగా విఫలం అయ్యామో అని" అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తపరచాడు.

10% ఆకు కోయించలేక పోవడం కాక కోయించిన ఆకులో సగం రక్షించుకోలేకపోయాం. అసలు ప్రభుత్వం నక్సలైట్లను సరిగా అంచనా వేయలేదు. తునికి ఆకు రేటు విషయం వాళ్ళతో చర్చిస్తే బాగుండును. ఇంతకు ముందు పారెస్టు పనుల రేట్ల గురించి వాళ్ళు సంప్రదించినపుడు, ఈ ఆకు రేటు గురించి వాళ్ళతో సంప్రదించడానికి ప్రభుత్వం ప్రతిష్టకు గురికాకుండా ఉంటే బాగుండేది" అంటూ మరో IAS ఆఫీసరు మొదటి IAS ఆఫీసరును సమర్థించుకుంటూ అతని అభిప్రాయానికి కొనసాగింపుగా మాట్లాడాడు. మిగతా IAS ఆఫీసర్లు కూడ ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లుగా తలలు ఊపారు.

IPS ఆఫీసర్లకు మాత్రం IAS ల అభిప్రాయాలు వినేసరికి ఒళ్ళుమండినట్లు అయ్యింది. ఒక IPS లేచి ఏదో అనబోయాడు ఇంతలో భావె కల్పించుకుంటూ "ప్రభుత్వం నక్సలైట్లను సరిగా అంచనా వెయ్యలేదనడం నిజంకాదు. తునికాకు రేటును చర్చించడంకోసం వాళ్ళ ప్రతినిధిమండలిని పంపమనికోరుతూ అన్ని దినపత్రికలలో ప్రకటించాము వాళ్ళ ప్రతినిధులకు రక్షణ కల్పిస్తామని హామీ కూడ ఇచ్చాము చివరికి రావాలంటే అడవిలోకే వచ్చి కలుస్తామని రేటు గురించి చర్చించుదామని కూడ స్థానిక కాంగ్రెస్ నాయకుడితో పేపరు స్టేటు

మెంట్ ఇప్పించాడు. అయినా నక్సలైట్లు, నిర్బంధాన్ని తీవ్రంచేస్తూ ప్రభుత్వం చర్చలు అవధం. అంతా బూటకం అంటూ ముందు పోలీసు క్యాంపులు ఎత్తివేయండి అంటూ ప్రభుత్వ ఆహ్వానాన్ని తిరస్కరించారు దానికి మనమేం చేయగలం" అంటూ గుక్కతిప్పుకోకుండ గడగడ చెప్పేసి అందరివైపు చూశాడు చెప్పండి ప్రభుత్వం తప్పేమైనా ఉందా అన్నట్లు.

వెంటనే IAS గుంపు నుండి "మరి వాళ్ళు అన్నది నిజమే కదా" అంటూ వెక్కిరింపుగా ఓ కామెంట్ దూసుకొచ్చింది అన్నది ఎవరో అర్థంకాకుండా. భావె మొఖం కందగడ్డలా అయ్యింది. ఓపిక నశించిందేమో ఒక IPS విసురుగా లేచి "నాన్సెన్స్ అసలు మీరు ఇలాంటి IAS ల మాటలు పట్టుకు పత్రికలలో ఆహ్వానాలు పలకడంవల్లనే నక్సలైట్లు మరీ రెచ్చిపోయారు. వాళ్ళకసలు జనంలో పునాది లేదు. ప్రభావం అంతకంటే లేదు. తుపాకులు చూపించి జనం తోటి బందులు, కళ్ళాలు కాలబెట్టించడం చేస్తున్నారు. అందువల్ల సమస్య పరిష్కారానికి ఆహ్వానాలు పంపడం కాదు ఇంకా పోలీస్ ఫోర్స్‌ను పెంచి కఠినమైన చర్యలు తీసుకోవాలి. అంతేకాని శాంతిభద్రతల సమస్యలతో సంబంధం లేని IAS ల అభిప్రాయాలు నక్సలైట్ల ఉత్సాహాన్ని పెంచుతాయి" అంటూ తన కోపాన్నంతా కుప్పలుపోశాడు. "అవునవును వాళ్ళను అణచడానికి బస్తరుకు ఇంకా అదనపు ఫోర్సును, ఆధునిక ఆయుధాలను ప్రభుత్వం సమకూర్చాలి. పోలీసుల జీవన పరిస్థితులను కూడ మెరుగుపర్చాలి" అంటూ మరో IPS మొదటి IPSను బలపరుస్తూ మాట్లాడాడు. భావె మొఖం సంతోషంతో చేటంత అయ్యింది "అవునవును ఇప్పటివరకు ఫోర్సు పెంచి సాధించింది కనబడటం లేదా?" అంటూ మరో వ్యంగ్య బాణం దూసుకొచ్చింది IAS గుంపు నుండి

మొత్తానికి సమావేశంలో IAS మరియు IPS ల మధ్య భేదాభిప్రాయాలు, వైరుధ్యాలు స్పష్టంగా బయటపడ్డాయి ఒకరు తూర్పు అంటే ఒకరు పడమర అన్నారు. ఒకరు ఎద్దుకొమ్ము అంటే ఒకరు బర్రెకొమ్ము అన్నారు. IFSA వాళ్ళు మాత్రం అటూ, ఇటూ కూడా మాట్లాడారు. చివరికి అటూఇటూ చేసి మూడు గంటలు తిప్పలుపడి సమావేశం ముగించారు

* * *

మరునాడు ఉదయం పేపర్లో "నక్సలైట్ల టెర్రరిస్టు చర్యల వల్లే ఈ సంవత్సరం బస్తరులో తునికాకు లక్ష్యాన్ని సాధించలేకపోయాం. అందువల్ల వచ్చే సంవత్సరం ఇంకా అధిక రక్షణ ఏర్పాట్లతో తునికి ఆకు కోయించడం జరుగు

వ్యాసం :

భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమచరిత్ర

—వి. సుబ్రహ్మణ్యం

ఏ ఉద్యమమైనా ఆ దేశంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నుండి పుట్టినట్టే, మన దేశంలో పౌరహక్కుల ఉద్యమం కూడా నిర్దిష్ట పరిస్థితుల నుండే పుట్టింది. ఈ ఉద్యమం చవిచూసిన విజయాలకన్నా అపజయాలే ఎక్కువ. అయినా దీని ప్రభావం మాత్రం బలీయమైనదనే చెప్పవచ్చు. దేశంలో అనేక రకాలైన ఉద్యమాలు నడిచే క్రమంలో వాటిని ప్రభుత్వాలు - 'పిచ్చికుక్క' అని పేరు పెట్టి చంపినట్టు - 'శాంతిభద్రతల' (law and order) పేరుతో అణచివేయడానికి మిలటరీ పరిష్కారాన్ని అనుసరించినప్పుడల్లా పౌరహక్కుల ఉద్యమం తన గళాన్ని విప్పింది. ప్రస్తుతమున్న వర్గసమాజంలో 'శాంతి భద్రతలు' అంటే భూస్వామికి, కాంట్రాక్టర్లకు, పోలీసులకు, స్థానిక రాజకీయ నాయకులకు లభించే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని అర్థంచేసుకోవాలి. ఇంకొక విధంగా చెప్పాలంటే తుపాకిగొట్టంద్వారా పరిపాలించడానికి పాలకులకు లభించే

తుంది" అని లఘువనోపజ్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భావే పేరుమీద ప్రకటన వచ్చింది.

"చూశావా పేపర్లో ఏం వచ్చిందో వచ్చేసం॥రం ఇంకా అధిక రక్షణ ఏర్పాట్లతో తునికాకు కోయించుతారట. భావేగారు ప్రకటించారు" అంటూ ఒక IAS తన స్నేహితుడైన మరో IAS కు పేపరు చూపిస్తూ నీ అభిప్రాయం ఏంటి అన్నట్లు చూశాడు.

"ఏడ్చినట్లుంది. అదే నిజమైతే నక్సలైట్ల అభిప్రాయాన్నే మరోసారి ఋజువుచేసిన వాడవుతాడు భావే" అన్నాడు రెండో IAS.

"ఏ అభిప్రాయాన్ని" అర్థంకాక అడిగాడు మొదటి IAS.

"తుపాకులు ఆకులు కోయలేవని" జవాబిచ్చాడు రెండవ IAS.

(ఈ కథ రాస్తున్న సమయంలోనే 1989 జూన్ 7వ తేదీన ఉత్తర బస్తరులో కేశ్‌కాల్ ఏరియాలో పోలీసు కాల్పులలో అమరుడైన, బస్తర్ వీర పుత్రుడు కా॥ వైరాఫ్ (హల్బా గిరిజన జాతి), మరియు ఆదిలాబాదు ముద్దుబిడ్డ కా॥ ప్రభాకర్‌లకు ఈ కథ అంకితం)

రై సెన్సు ఈవిధంగా ప్రజలపై ప్రభుత్వం అమలు జరుపుతున్న వివిధ రూపాలలోని నిర్బంధాన్ని ప్రపంచానికి చాటిచెప్తూ అభివృద్ధికర మార్పుకోరే ఉద్యమాలకు ఊపిరిపోసింది. ఈ క్రమంలోనే జాతీయోద్యమకాలంలో పౌరహక్కుల ఉద్యమం ప్రారంభమైంది.

వలసపాలన - పౌరహక్కుల ఉద్యమం :

19వ శతాబ్దం ఆరంభంలోనే పత్రికాస్వేచ్ఛ, వాక్‌స్వాతంత్ర్యం, జాతి వివక్షత, చట్ట సమానత్వం మొ॥న వాటి లక్ష్యసాధన రూపాలలో పౌరహక్కుల చైతన్యం వ్యక్తమయింది. అయితే ఒక ప్రత్యేక ఉద్యమంగా 1910-20 ల మధ్యలోనే రూపుదిద్దుకుంది. 20వ శతాబ్ది ప్రారంభమే నూతన జాతీయోద్యమానికి, నూతన తరానికి ప్రాణంపోసింది. నూతన భావాలతో, ఆలోచనలతో వలసాధిపత్యాన్ని భరించలేని ఈతరం బ్రిటీషు సామ్రాజ్యం నుండి విముక్తి పొంది, స్వేచ్ఛా పౌరులుగా కొనసాగాలని ఆకాంక్షించింది.

1918 లో బొంబాయిలో భారత జాతీయ కాంగ్రెస్ (Indian National Congress) ప్రత్యేక సమావేశంలో రూపొందించి ఆమోదించబడిన 'హక్కుల ప్రకటన'యే (Declaration of Rights) భారత పౌరహక్కుల ఉద్యమానికి మొట్టమొదటి ప్రణాళికగా నాంది పలికింది. ఈ 'ప్రకటన'ను మాంటేంగ్-ఛమ్స్‌ఫర్డ్ కొత్తగా రూపొందించబోయే రాజ్యాంగంలో చేర్చాలనే ప్రతిపాదన కూడా కాంగ్రెస్ చేసింది. ఈ 'ప్రకటన'లో ప్రాథమిక హక్కులైన వాక్, సభా, సమావేశ స్వాతంత్ర్యాలతోపాటు చట్టప్రకారం విచారణ జరిపే హక్కు, వీటన్నింటికన్నా ముఖ్యంగా జాతి వివక్షత నుంచి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు పొందే హక్కులు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రతినిధివర్గం బ్రిటీషు పార్లమెంటుకు సైతం ఈ 'ప్రకటన'ను సమర్పించింది. అయితే యిది చెత్తబుట్టపాలయింది.

మద్రాసుకు చెందిన యస్ సత్యమూర్తి అనే కాంగ్రెస్ నాయకుడు (క్విట్ ఇండియా ఉద్యమకాలంలో జైలులో చనిపోయాడు) 'పౌరహక్కులు' (The Rights of citizens) అనే పుస్తకాన్ని 1919 జూన్‌లో ప్రచురించారు. భారతదేశంలో పౌరహక్కులపై వెలువడిన మొట్టమొదటి గ్రంథంగా దీనిని చెప్పుకోవచ్చు. ఆరోజులలోనే, ఆ గ్రంథంలో పౌరహక్కులపై జరుగుతున్న చర్చను సత్యమూర్తి ప్రస్తావిస్తూ, పౌరహక్కులనేవి పరిశోధకులు లేదా విద్యావేత్తలు నమ్ముతున్నట్టుగా మేధావుల తియ్యని చర్చలలో లేవని

స్పష్టంగా పేర్కొంటూ, మొదటి ప్రపంచయుద్ధంలో ఊచకోత కోయబడిన ప్రజాహక్కులు, రాక్షస రౌలట్ చట్టం కలిగించిన భయం ప్రజలలో నూతన చైతన్యానికి, నిర్దిష్ట లక్ష్యానికి ప్రేరణనిచ్చాయని నొక్కి చెప్పాడు.

జలియన్‌వాలాబాగ్ దురంతం జరిగిన తరువాత డయ్యర్ రెండునెలల పాటు అమృతసర్‌లో సైన్యాధికారిగా వుండి పంజాబ్‌లోని అన్ని ప్రాంతాలలో ప్రజలను నిష్కారణంగా కొరడాలతో కొట్టించి, విద్యుత్ సరఫరాను ఆపివేసి, కొన్నివందల మందిని జైళ్ళకు పంపారు. 1919 డిసెంబర్‌లో అమృతసర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో మోతీలాల్ నెహ్రూ 'హక్కుల ప్రకటన' **(Declaration of Rights)** ను సమర్థిస్తూ బ్రిటీషుప్రభుత్వ చర్యను గర్హించాడు. ఆ సమావేశంలో మాట్లాడుతూ 'ఈమధ్యనే పంజాబ్‌లో కర్కశంగా అణచివేసిన హక్కులకు (జలియన్‌వాలాబాగ్ దురంతంలో) రక్షణకల్పించలేని ఏ రాజ్యాంగంకూడా మన అవసరాలను తీర్చజాలద'ని పేర్కొన్నాడు. 'హోం రూలు' ఉద్యమం విజయవంతమైనా, అప్పుడు కూడా ఈ హక్కులకు రక్షణ కావాలని కోరుకోవడం అత్యాశకాదని సభలో ఉద్ఘాటించారు. ఈ 'హోంరూలు' ఉద్యమం 1916 లో ప్రారంభమైంది. దీని ఉద్దేశ్యం భారతదేశం బ్రిటీషు సామ్రాజ్యం నుంచి విడిపోకుండా, అందులో భాగంగానే వుంటూ ఆంతరంగిక స్వపరిపాలనను కోరుకోవడం. 1918 లో బ్రిటీషు రాజ్యాంగ కార్యదర్శియైన మాంటేగ్ ప్రకటనతో ఈ కోరిక నెరవేరినట్టుగా భావించి, ఉద్యమనాయకులైన తిలక్, అనీబిసెంట్ ఉద్యమాన్ని విరమించారు. 'సంపూర్ణ స్వరాజ్యం' అనే నినాదాన్ని తిలక్ ఉపసంహరించుకొని, 6 సం॥రాలు మాండలే జైలులో (బర్మా) శిక్ష అనుభవించిన తరువాత ఈ హోమ్‌రూలు ఉద్యమాన్ని నడిపాడనే విషయాన్ని యిక్కడ గుర్తించాలి.

1920 ల నాటికి పౌరహక్కుల ఉద్యమం ఒక నూతన సంప్రదాయాన్ని సంతరించుకుంది పౌరహక్కుల అణచివేత జరిగిన చోటల్లా స్వతంత్రంగా విచారణ జరిపి, ప్రభుత్వ దుష్ప్రచారాన్ని, ప్రభుత్వం యిచ్చే తప్పుడు సమాచారాన్ని తన ప్రచారంలో ఖండిస్తూ వచ్చింది. ఈ దశాబ్దంలో అనేక రకాలైన సంఘటనపై - జలియన్‌వాలాబాగ్ నుంచి పేష్వార్ వరకు - స్వతంత్రంగా విచారణ జరిపి, రిపోర్టులు తయారుచేసి ప్రచారం చేసింది.

పై సంఘటనలన్నీ పౌరహక్కుల ఉద్యమం ఒక కొలిక్కిరావడానికి అనువైన వాతావరణాన్ని ఏర్పరిచాయి. అయితే ఈ ఉద్యమం సంఘటిత పడ

డానికి 1936 దాకా వేచివుండాల్సి వచ్చింది. భారత దేశ చరిత్రలోనే 1936వ సంవత్సరం ఒక మైలురాయి. జాతీయస్థాయిలో మొట్టమొదటిసారిగా మూడు రకాలైన ప్రజాసంఘాలు ఏర్పడడం ఈ సం॥లోనే జరిగింది. అవి ; (1) అఖిలభారత కిసాన్ సభ 2) అఖిలభారత విద్యార్థి సమాఖ్య 3) అభ్యుదయ రచయితల సంఘం. ఈ సంఘాలు ఎవరో పథకం ప్రకారం చేసినవికావు. ఆనాడు దేశంలో జరుగుతున్న అనేక ప్రజాపోరాటాలే ఆ సంఘాల ఏర్పాటుకు కారణమయ్యాయి. ఈ సందర్భంలోనే జవహర్‌లాల్ నెహ్రూ దేశవ్యాపితంగా వున్న మేధావులు, రాజకీయ నాయకులైన 150 మందికి జాతీయ పౌరహక్కుల సంఘాన్ని ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనతో ఒక సర్క్యులర్‌ను పంపాడు. అయితే ఆ సర్క్యులర్‌కి అనుకూలంగా ప్రతిస్పందించిన మేధావులు పన్నెండు గురే అని తెలిసినప్పుడు అప్పటికి, యిప్పటికి మేధావుల ప్రతిస్పందనలో పెద్ద తేడా లేదనిపిస్తుంది.

1936 ఆగష్టు 24న భారతీయ పౌరహక్కుల సంఘం (Indian Civil Liberties Union - ICLU) బొంబాయిలో స్థాపించబడింది. రవీంద్రనాథ్ టాగూర్ గౌరవాధ్యక్షులు. సరోజినీనాయుడు అధ్యక్షులు. K.B. మీనన్ ప్రధాన కార్యదర్శిగా 21 మందితో కార్యనిర్వాహకవర్గం ఏర్పడింది. ఇందులో నెహ్రూ, అజాద్, శరత్‌బోస్, రామానంద ఛటోపాధ్యాయ, భూలాభాయ్‌దేశాయ్, జాకీర్ హుస్సేన్, అమ్రిత్‌కౌర్, జయప్రకాష్ నారాయణ, సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు వున్నారు. ఈ సంస్థ శాఖలు బొంబాయి, కలకత్తా, మద్రాసు, పంజాబ్ లలో ఏర్పడ్డాయి.

అయితే ఆనాడు పౌరహక్కులను సమర్థిస్తున్నవారి సిద్ధాంతం ఏమిటి? దీనికి ICLU ప్రారంభ ఉపన్యాసంలో చివరగా నెహ్రూ మాట్లాడిన మాటలను చెప్పుకోవాలి.

"పౌరస్వేచ్ఛ భావన ఏమిటంటే ప్రభుత్వాన్ని ఎదిరించడానికి హక్కు కలిగివుండడమే" (The idea of civil liberty is to have the right to oppose the Government) ఇదే భావాన్ని ఆ సంవత్సరం ప్రచురింప బడిన "The Struggle for Civil Liberties" అనే గ్రంథంలో రాంమనోహర్ లోహియా వివరించడం జరిగింది. దీనినిబట్టి పౌరహక్కుల ఉద్యమం అనేది నిజానికి రాజ్యాంగయంత్ర వ్యతిరేక ఉద్యమమనే విషయాన్ని మరువ రాదు.

జైళ్ళలో రాజకీయఖైదీలపై జరుగుతున్న అణచివేత, పోలీసుల పైశాచికత్వం, ప్రభుత్వ నిషేధాలు మొ॥న అంశాలపై స్వయంగా విచారణ జరిపి, రిపోర్టులను తయారుచేసి ప్రచారం చేయడం, నిరసన ప్రదర్శనలు చేయడం మొదలగునవి ఈ సంస్థ ప్రధాన కార్యక్రమాలుగా వుండేవి. అయితే ఏమైనా సాధించిందా? అని చూస్తే చెప్పుకోదగినంత విజయాలేవి లేవుగాని, ప్రజలలో పౌరహక్కుల చైతన్యాన్ని కొంతవరకు పెంచిందని మాత్రం చెప్పుకోవచ్చు. 1937లో- అతి స్వల్పకాలం రాష్ట్ర లేదా స్థానిక ప్రభుత్వాలలో మంత్రి పదవులను అలంకరించిన కాంగ్రెసు వారికి- తమ ప్రభుత్వాలలో పౌరహక్కులకు రక్షణకల్పించవలసింగా సర్క్యులర్ కూడా జారీచేసింది. ఒక సంవత్సర కాలంలో జరిగిన సంస్థ కార్యకలాపాలను సమీక్షించారు. ఆ సమీక్షలో కొన్ని ప్రోత్సాహకర ఫలితాలు కనిపించాయి. ఆనాటి పౌరహక్కుల ఉద్యమంలో ఉత్సాహవంతులైన గోపీనాథ్ శ్రీవాత్సవ లాంటి వారి మాటలలో చెప్పుకోవాలంటే "ప్రతిష్ఠాకరమైన ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం పౌరహక్కుల పరిధిని పెంచేటట్టుగా వుండాలి" అని చెప్పారు. కాని అదే సమయంలో సంస్థ సంక్షోభంలో పడింది. ఒక వైపు కాంగ్రెస్ పరిపాలిస్తున్న స్థానిక ప్రభుత్వాలలో పౌరహక్కుల రక్షణకు భరోసా లేకుండాపోయింది. దీనితో సభ్యుల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఇంకొక వైపు కొద్దిమంది ముఖ్యులుగా వున్న సభ్యులు అయిష్టతతో సంస్థనుంచి తప్పుకున్నారు. అయినప్పటికీ 1942 వరకు ఈ సంస్థ కొనసాగి అంతిమంగా 'క్విట్ ఇండియా' ఉద్యమంలో అంతర్లీనమైపోయింది. పౌరహక్కుల సంస్థలో (ICLU) ఒకే పార్టీకి చెందినవారు మెజారిటీగా వుండడం వలన ఏర్పడే దుష్ఫలితాలు బట్టబయలయ్యాయి.

భారత దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా పౌరహక్కుల ఉద్యమం భారత రాజకీయ వ్యవస్థమీద చూపిన ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయలేము. కొద్దిమందైనా ప్రసిద్ధిచెందిన మేధావులు, రాజకీయ నాయకులు ఒక సత్యాన్ని గుర్తించారు. అదేమిటంటే జాతీయ ఉద్యమం క్లిష్ట పరిస్థితుల నెదుర్కొంటున్న సమయంలో పౌరహక్కుల ఉద్యమం యిచ్చిన ప్రేరణ, చైతన్యం. ఇటువంటి చైతన్యం మరలా మరలా చివరివరకు కొనసాగాలని కూడా ఆనాటి మేధావులు కోరుకున్నారు.

రవీంద్రనాథ్ టాగూర్ తన చివరి దశలో బ్రిటన్ జాతీయ పౌరహక్కుల సంఘం కౌన్సిల్ (National Council of Civil Liberties) అధ్యక్షుడైన Dr. H W. నెవిన్‌సన్‌కు ఉత్తరం వ్రాస్తూ "పౌరహక్కుల సంఘా

నికి (ICLU) అధ్యక్షునిగా అంగీకరించగానే, మా ప్రజలకు కావలసిన ప్రజా స్వామ్య ఆదర్శాలకోసం నేను మరింతగా సంఘటిత కృషిలో భాగస్వామి నయ్యాను. ఐరోపాలోను, ఇతర దేశాలలోను జరుగుతున్న యుద్ధాలతోపాటు, మా దేశంలోవున్న ఒడిదుడుకులు మా కర్తవ్యాన్ని మరింత తీవ్రతరంచేశాయి" అని పేర్కొన్నారు.

అధికారమార్పిడి - పౌరహక్కుల ఉద్యమం :

1947లో కొత్తగా అధికారానికి వచ్చిన పాలకులను చూసి ఉద్యమం చల్లబడింది. దానికి కారణం కొత్త పాలకులు ప్రజాహక్కుల అవసరాన్ని గురించి ప్రకటనలు గుప్పించడమే. వలసపాలన కారణంగా గత రెండు శతాబ్దాలుగా చిన్నాభిన్నమైన దేశ పరిస్థితిని చక్కబరచాలని ప్రజలు ఉవ్విళ్లూరుతున్న సమయమది. ఆ సమయంలో పాలకులు తెలివిగా రాజ్యం పురిట్లో వుందనే (Infant state) మిషతో చైతన్యవంతులందరిని మౌనం వహించేటట్టుచేశారు. అయినప్పటికీ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలోనే పాలకులు పురిటిలోని రాజ్యానికి వలస పాలకుల నమూనాలో మారణాయుధాలను సమకూర్చారు.

పౌరహక్కుల ఉద్యమంకూడా త్వరలోనే పునరుద్ధరించబడింది గతంలో ICLU మద్రాసు శాఖగా పనిచేసిన సంస్థ 1947లో మద్రాసు పౌరహక్కుల సంఘంగా (Madras Civil Liberties Union) ఏర్పడింది. ఇదే సంస్థ 1949 జూలై 16, 17 తేదీలలో మద్రాసులో అఖిలభారత పౌరహక్కుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఆ సమావేశంలో ప్రముఖ న్యాయవాది A.K పిళ్లై తాను చదివిన వ్యాసంలో పౌరహక్కులను గురించి వ్యాఖ్యానిస్తూ బ్రిటీషు పాలనలోని భారతీయుని అపరిమితమైన హక్కులే నేడు (స్వాతంత్ర్యానంతరం) ప్రమాదానికి గురవుతున్నాయి. ఇదే మన అనుభవం, మనకు నేర్పిన గుణపాఠం" అని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముందుగానే జనవరి 1, 2 తేదీలలో బొంబాయిలోని పౌరహక్కుల సంఘం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

కమ్యూనిస్టుపార్టీపై నిషేధం, నిర్బంధం ప్రయోగించడంతో పశ్చిమ బెంగాల్‌లో 1948లో 'పౌరహక్కుల సంఘం' (Civil Liberties Committee) యేర్పడింది. ఈ సంఘం ప్రసిద్ధిచెందిన కొద్దిమంది మేధావులను-డా॥ మేఘనంద సహా, ప్రొఫెసర్ కె. పి. ఛటోపాధ్యాయ, శరత్‌బోస్,

యన్.సి. ఛటర్జీ- తనవైపుకు ఆకర్షించగలిగింది. చివరికి ఈ సంఘం కూడా ప్రభుత్వం నుంచి అనేక దాడులను ఎదుర్కొంది. ఈ సంఘం కార్యదర్శులుగా పనిచేసిన కమల్‌బోస్, జె. భట్టాచార్య, ప్రమోద్‌సేన్‌గుప్తా అరెస్టయ్యారు. ఈ సంఘం అధ్యక్షుడైన కె.పి. ఛటోపాధ్యాయ బహిరంగంగా ఎటువంటి ఉపన్యాసాలు, రచనలు చేయకూడదని కలకత్తా పోలీస్ కమిషనర్ ఆజ్ఞలు జారీ చేశాడు. అయినప్పటికీ ఈ సంఘం నిర్భయంగా విచారణలు జరపడం, పత్రికా ప్రకటనలు యివ్వడం, నిరసనసభలు ఏర్పాటుచేయడం కొనసాగించింది.

బెంగాల్‌లోని పౌరహక్కుల ఉద్యమం ప్రభుత్వం ప్రయోగించే నిర్బంధంతోపాటు యింకొక సమస్యను కూడా ఎదుర్కొంది. పౌరహక్కుల ఉద్యమంలోని కార్యకర్తలు ఎక్కువ భాగం కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు. వీరు తమ పార్టీపై నిర్బంధం పెరిగినప్పుడు పౌరహక్కుల పరిరక్షణకు ప్రాముఖ్యత చూపేవారు అయితే ముందుగా నిర్ణయించుకున్న రాజకీయ జీవన విధానం, పార్టీ ఆదేశిస్తున్న మార్గం వారిని పౌరహక్కుల ఉద్యమంలో దృష్టిని కేంద్రీకరించడానికి కష్టతరంచేసేవి. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘంలో పనిచేసిన ఒక న్యాయవాది, అదే సంఘంలో పనిచేసిన కమ్యూనిస్టు కార్యకర్తకు చెప్పిన మాటలు గుర్తుంచుకోవడం ఎంతైనా అవసరం.

"నా మార్గానికి, నీ మార్గానికి తేడా ఏమిటో తెలుసా? పౌరహక్కులకు సంబంధించిన విషయాలలో నీకు శ్రద్ధలేదు, నీకు నీ కామ్రేడ్స్‌ను విడుదల చేసుకోవడంలోనే శ్రద్ధ. నేను కూడా నీ కామ్రేడ్స్ విడుదల విషయంలో శ్రద్ధచూపుతాను. కాని అది పౌరహక్కుల ఉద్యమంలో భాగంగా మాత్రమే". అందుకే 1950 ప్రారంభంలో కమ్యూనిస్టులు జైలు నుండి విడుదలకాగానే ఉద్యమం సన్నగిల్లింది.

1970 మొదటి దశలో తిరిగి పౌరహక్కుల ఉద్యమం నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది. కమ్యూనిస్టు విప్లవకారులు- ప్రభుత్వ అణచివేత కవల పిల్లల్లా వున్న పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో సంఘాలు ఏర్పడ్డాయి. 1972 జూన్ 25న కలకత్తాలో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేస్తూ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంఘం **(Association for Protection of Democratic Rights - APDR)** ఏర్పడింది. ఈ సంఘంలో మేధావులు, రాజకీయ ప్రముఖులు, ఎంతోమంది యువకులు చేరారు. ఇదే పద్ధతిలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా 1974లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఏర్పడింది.

ప్రణాకవులైన శ్రీశ్రీ, చెరబండరాజు, రాజకీయ ప్రముఖులైన జాపా లక్ష్మారెడ్డి వంటివారు, యింకెంతోమంది యువకులు యిందులో చేరారు.

APDR, APCLC రెండూ తమ కార్యకలాపాలను నగరాలకే పరిమితం చేయకుండా, చిన్నచిన్న పట్టణాలకు, గ్రామాలకు కూడా విస్తృతం చేశాయి. అయితే 1975 జూన్ 25న 'అత్యవసర పరిస్థితి' ప్రకటించడంతో కార్యకలాపాలు పరిమితమైపోయాయి. చాలా ప్రజాసంఘాలను నిషేధించినట్టే APDR ను కూడా August 5న నిషేధించారు. ఆ సందర్భంలోనే APDR "భారత ప్రజా స్వామ్యం యొక్క నిజస్వరూపం" అనే పేరుతో ఒక పుస్తకాన్ని ముద్రించడం కోసం ప్రెస్‌లో యిచ్చింది. పోలీసులు ఆ ప్రెస్‌పై దాడిచేసి, ఆ ప్రెస్ యజమానిని, నిర్వాహకులను అరెస్టుచేశారు. అయినప్పటికీ రహస్యంగా ఆ పుస్తకాన్ని బయటకు తీసుకొచ్చి ప్రచారం చేశారు. APCLC ని ప్రభుత్వం నిషేధించకపోయినా అందులోని నాయకులందరినీ జైళ్ళలో పెట్టింది.

అత్యవసర పరిస్థితి అమలులో వున్నప్పుడే అఖిలభారతస్థాయిలో ఢిల్లీలో 1976 అక్టోబరులో PUCL (Peoples Union for Civil Liberties) ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సంస్థ భారత స్వాతంత్ర్యానంతరం అతి గడ్డు పరిస్థితులలో యేర్పడింది. అందుకే అది విశాల ప్రాతిపదికపై సభ్యులను చేర్చుకోవడం జరిగింది. దీనికి కారణం 'అత్యవసర పరిస్థితి లోను, అంతకు ముందు మూడు, నాలుగు సం॥రాలలో యేర్పడిన పరిస్థితులే. సమావేశ స్వాతంత్ర్యంకానీ, వాక్‌స్వాతంత్ర్యంకానీ పూర్తిగా నిషేధించబడింది. విప్లవకారులతో సంబంధం పెట్టుకోవడంగాని, సానుభూతిపరులుగా వుండడానికిగాని అవకాశం లేకుండాపోయింది. దీనికి కారణం ఆనాడు అణచివేత అంత తీవ్రస్థాయిలో వుండడమే. 1976 ఆగష్టులో ఎమర్జెన్సీ అనే ఉరిత్రాడు సడలింపబడడం, అదే సమయంలో జయప్రకాష్ నారాయణ్ ఆరోగ్యకారణాలరీత్యా జైలునుంచి విడుదలై చొరవ తీసుకోవడంతో విశాల ప్రాతిపదికపై భిన్నాభిప్రాయాలు కలిగిన వ్యక్తులు పౌరహక్కుల వేదికను ఏర్పాటుచేయడానికి ముందుకొచ్చారు.

'అత్యవసర పరిస్థితి'ని ఎత్తివేయడంతో APDR పై వున్న నిషేధాన్ని కూడా ఎత్తివేశారు తిరిగి 1977 జూన్‌లో కలకత్తాలో సమావేశం ఏర్పాటుచేసి APDR ను పునఃప్రారంభించారు. అప్పటినుండి APDR రాజకీయఖైదీలను విడుదలచేయడంలోను, ఎమర్జెన్సీ ముందు, ఎమర్జెన్సీలోనూ జరిగిన పౌర హక్కుల ఉల్లంఘనపై విచారణలు జరపడం ప్రారంభించింది.

PUCL లోని చాలామంది నాయకులు జనతాపార్టీలో వున్నారు. ఆ పార్టీయే అధికారానికి వచ్చింది. పౌరహక్కుల ఉద్యమంలోని వారే ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పుడు పౌరహక్కుల ఉద్యమం అవసరం లేదనే అభిప్రాయం చాలా మందిలో చోటుచేసుకుంది దీనితో PUCL పూర్తిగా నిర్వీర్యమైపోయింది. అయినప్పటికీ జనతా ప్రభుత్వం పౌరహక్కులను కాలరాస్తూవచ్చింది. కొత్తగా నల్లచట్టాలను రూపొందించడం మానలేదు. ఆలీఘర్‌లో మైనారిటీ హక్కులను కాలరాయడం, అశేష ప్రజానీకం ఆంధ్రలోను, ఈశాన్య రాష్ట్రాలలోను ప్రకటించిన 'కల్లోలిత ప్రాంతాల' (Disturbed Areas) వలన బాధలకు గురికావడం తప్పలేదు. జరుగుతున్న ఈ పరిణామాలపై దేశవ్యాపితంగా వున్న PUCL మౌనంవహించినప్పటికీ, రాష్ట్రాలలో వున్నటువంటి APDR, APCLC, CPDR, PUCLDR (ఢిల్లీ యూనిట్) ఆందోళనను చేపట్టాయి. తిరిగి PUCL పునరుద్ధరించబడడంతో PUCLDR తన పేరును PUDRగా (Peoples Union for Democratic Rights) 1981 లో మార్చుకుంది.

వామపక్షాలు పాలించే బెంగాల్‌లో పౌరహక్కుల ఉద్యమ సమస్య యింకొక రకంగా వుంది. కేంద్రంలో ఎమర్జెన్సీ తరువాత అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ నిర్వహించిన పాత్రనే ఈ వామపక్ష ప్రభుత్వాలు కూడా నిర్వహించాయి. అయినప్పటికీ పౌరహక్కుల ఉద్యమంలో పనిచేసే కార్యకర్తలు 'తక్కువ ప్రమాదకారి' అనే సిద్ధాంతానికి గురై ప్రభుత్వం పౌరహక్కులను కాలరాస్తున్నప్పటికీ చాలాకాలం వరకు మెతకవైఖరినే ప్రదర్శించారు.

ఈ సమయంలోనే యింకొకవిధమైన చర్యకూడా చోటుచేసుకుంది అదేమిటంటే పౌరహక్కులకు (Civil Liberties) ప్రజాస్వామ్యహక్కులకు (Democratic Rights) సిద్ధాంతరీత్యా వున్న సంబంధం. పౌరహక్కుల సిద్ధాంతం ఎక్కువగా చట్టబద్ధమైన హక్కులు, వాటి పరిరక్షణపై దృష్టిని కేంద్రీకరిస్తుంది. అయితే యిటువంటి పరిమితమైన హక్కులు భారత దేశం వంటి దేశాలకు సరిపోవనేది మెజారిటీ పౌరహక్కుల సంఘాల అభిప్రాయం. ఎందుకనంటే ఈ దేశంలో వున్న న్యాయవ్యవస్థ విధానమే దోపిడీచేసేవారికి, అణచివేత ప్రయోగించే వర్గాలవారివైపు పక్షపాతం చూపుతున్నాయి. కాబట్టి ఈ అసమాన సామాజిక వ్యవస్థను వ్యతిరేకించే ప్రజాస్వామ్యహక్కును పౌర హక్కుల సంఘాలు కలిగివుండాలని చాలామంది అభిప్రాయపడ్డారు.

కమ్యూనిస్టు విప్లవకారులు రాజ్యానికి వ్యతిరేకంగా బోధించే, అనుసరించే హింసపై కూడా చర్చ చోటుచేసుకుంది. దీనిపై ఏకాభిప్రాయానికి రాలేకపోయి

ఉత్తరం

చాపల్యం తర్వాత....

'క్రితం తర్వాత' అనే సంయుక్త కవిత మొదట ఉదయం దినపత్రిక ఆదివారం అనుబంధం (1990 ఏప్రిల్ 1) లోను, తర్వాత 'కవిత్వం ప్రచురణలు' (ఏప్రిల్ 1990)గా పుస్తకరూపంలోను వెలువడింది. ఈ కవితను అఫ్సర్, కె. నరసింహాచారి, కృష్ణుడు, నీలిమా గోపీచంద్, ప్రసేన్, త్రిపురనేని శ్రీనివాస్‌లు సంయుక్తంగా రాసినట్టు ప్రకటించుకుంటున్నారు.

ఈ కవిత గురించి ఆలోచించవలసిన విషయాలు నాలుగు ఉన్నాయి. వాటిని పాఠకులతో పంచుకునేందుకే ఈ ఉత్తరం.

మొదటిది. ఈ కవితలో కంపూచియా గురించి, సిద్ధాంతాల గురించి వ్యక్తమైన అవగాహన. 'ఇక్కడ కూడా పోల్‌పాట్‌లున్నారని మాకు తెలుసు | అధికారంఇస్తే ఒక్కొక్కరు | ఒక్కొక్క అభిజాత్యహంకారి | ఇక్కడకూడా డెంగ్‌జియావొ పింగ్‌లున్నారని మాకు తెలుసు | అధికారం ఇస్తే ఒక్కొక్కరు | ఒక్కొక్క సామూహిక హింసాకాండ | ఇక్కడకూడా సెసెస్కూలున్నారని మాకు తెలుసు | అధికారం ఇస్తే ఒక్కొక్కరు | ఒక్కొక్క రుమేనియా, నెత్తురుమేనియా' అని ఈ కవులు రాశారు.

పోల్‌పాట్‌ను, డెంగ్‌జియావొపింగ్‌ను, సెసెస్కూను ఒకేస్థాయిలో పోల్చడం అన్యాయం. పోల్‌పాట్‌ను అభిజాత్యహంకారి అనడం మరింత అన్యాయం. ఇలా రాయడంలో సంయుక్త కవులు కంపూచియా గురించి, పోల్‌పాట్ గురించి పాశ్చాత్య పత్రికలు, ప్రచారసాధనాలు, రివిజనిస్టు ప్రచారసాధనాలు కలిసికట్టుగా చేస్తున్న ప్రచారాన్నే యథాతథంగా అంగీకరించినట్టు కనబడుతున్నది.

నప్పటికీ, ఉద్యమంలోని మెజారిటీ వ్యక్తులు అణచివేత స్వభావంకలిగిన రాజ్యం నుంచి ప్రజలకు తమను తము రక్షించుకోగలిగే హక్కుకలిగివుండాలని పేర్కొన్నారు.

("Civil Rights : Past & Present" అనే APDR ప్రచురణలోని విలంజన్‌దత్తా వ్రాసిన "With Little Victories and Big Defeats" అనే వ్యాసం ఆధారంతో వ్రాసినది.)

"ప్రపంచంలో అన్నిటికంటె ఎక్కువ దుష్ప్రచారానికి గురయిన విప్లవం" అని కంపూచియా విప్లవం గురించి వ్యాఖ్యానించిన బ్రిటీష్ మేధావి మాల్కొమ్‌కాడ్వెల్ ఆ విప్లవం గురించి, ఆ విప్లవ నాయకులు జరుపుతున్న ప్రయోగాల గురించి ప్రపంచానికి నిజాలు తెలియజేశాడు. అంతకుముందే జార్జ్ హిల్డ్ బ్రాండ్, గారెత్ పోర్టర్‌లు 'కాంబోడియా : స్టార్వేషన్ అండ్ రెవల్యూషన్' అనే పుస్తకంలో (మంత్లీ రివ్యూ ప్రెస్, 1976) అమెరికన్ కీలుబొమ్మ ప్రభుత్వం కింద కాంబోడియా ఆర్థికవ్యవస్థ ఎట్లా చితికిపోయిందో వివరించారు. గ్రామీణప్రాంతాల మీద అమెరికన్ బాంబింగ్ వల్ల మూడోవంతు జనాభా పట్నాలకు చేరి, వ్యవసాయోత్పత్తి ఘోరంగా పడిపోయిందని, ఈ స్థితిలో గ్రామీణ ప్రాంతాల్ని విముక్తిచేస్తూ, చివరికి పట్నాల్ని కూడ స్వాధీనంచేసుకుని జనాభా మొత్తాన్నీ వ్యవసాయోత్పత్తిలోకి ప్రవేశపెట్టవలసిన అవసరం ఎలా వచ్చిందో వివరించారు. 1960 ల నుంచీ ఆర్భాటం లేకుండా, ఓపికగా విప్లవోద్యమాన్ని నిర్మిస్తూ వచ్చిన ఖ్మెర్‌రూజ్ దళాలు దేశ భూభాగంలో 70 శాతం మీద అధికారాన్ని 1970 డిసెంబర్‌కే సాధించడమేగాక ఆ అధికారాన్ని విశాల ఐక్య సంఘటనతో పంచుకున్నాయి. చివరికి 1976 జనవరి 5న కంపూచియా జాతీయ ఐక్యసంఘటన సైన్యాలు ప్రజాస్వామిక కంపూచియాను ఏర్పరిచాయి.

కంపూచియా విప్లవోద్యమంలో ప్రధానమైనది వాళ్ళు అవలంబించిన 'స్వావలంబన'. కంపూచియన్ విప్లవకారుల్లో ఏ ఒక్కరూ విదేశీ, స్వదేశీ సైనిక శిక్షణాలయాల్లో శిక్షణపొందలేదని, సైనిక సామాగ్రిలో సగంకన్న ఎక్కువ లోన్‌నాల్ ప్రభుత్వం నుంచే సంపాదించామని వాళ్ళు చెప్పుకున్నారు. విప్లవయుద్ధం అంతమయి జనాభాకు ఆహారం అందించవలసివచ్చేసరికి కూడా వాళ్ళు ఈ స్వావలంబన విధానాన్నే కొనసాగించారు. కంపూచియా వ్యవసాయాభివృద్ధికి కంపూచియన్ ప్రజల శ్రమశక్తి మీదనే ఆధారపడాలని, నమ్మకం లేని అంతర్జాతీయ సహాయాన్ని ఆశించగూడదని వాళ్ళు అనుకున్నారు. ఖియూ సాంఫన్ అధ్యక్షుడిగా, పోల్‌పాట్ ప్రధానిగా ఏర్పడిన ప్రజాతంత్ర కంపూచియా ప్రభుత్వం ఒక వెనుకబడిన వ్యవసాయదేశంలో సోషలిస్టు నిర్మాణాన్ని చేపట్టే ప్రయోగాలెన్నో చేసింది. కరెన్సీరద్దు, నిత్యావసర వస్తువుల ఉత్పత్తికి అత్యధిక ప్రాధాన్యం, కనీస ఆహారం అందరికీ లభించేలా చూడడం, పెరిగిపోయిన పట్టణ జనాభాను తగ్గించి గ్రామసీమలకు వెళ్ళేందుకు ప్రోత్సహించడం జరిగాయి. తద్వారా కంపూచియా ఆర్థికవ్యవస్థ మూడు సంవత్సరాలలోనే వస్తుల స్థితినుంచి చాలినంత దొరికే స్థితికి ఎదిగింది.

స్వావలంబన ద్వారా విప్లవం సాధించడం, దేశాభివృద్ధి సాధించడం, వ్యవసాయ ప్రధాన దేశంలో సోషలిజం నిర్మాణం గురించి వినూత్నమైన ప్రయోగాలు చేయడం కంపూచియన్ ప్రజాతంత్ర ప్రభుత్వం చేసిన అద్భుతాలు. ఈ అద్భుతాలను రద్దుచేయడం సామ్రాజ్యవాదానికీ, సోషల్ సామ్రాజ్యవాదానికీ అనివార్యమయింది. అందువల్లనే 1978 డిసెంబర్‌లో వియత్నాం సైన్యాలు సోవియట్‌యూనియన్ మద్దతుతో కంపూచియాపై దాడిచేశాయి. 1979 జనవరి 7న ప్రజాతంత్ర కంపూచియా ప్రభుత్వాన్ని కూలదోసి హెంగ్‌సామ్రిన్ నాయకత్వాన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. అప్పటినుంచి గత పదకొండు సంవత్సరాలుగా ఖియూసాంఫన్ నాయకత్వాన ప్రవాస ప్రభుత్వం ఖ్మెర్‌రూజ్ నాయకత్వాన కొనసాగుతూనే ఉన్నది. చెప్పుకోదగిన భూభాగం ఖ్మెర్‌రూజ్ పాలన కింద, మాజీ రాజు నరోదమ్ సిహనౌక్ నాయకత్వంలోని దళాల కింద, సోన్‌సాన్ నాయకత్వంలోని ఖ్మెర్ ప్రజా జాతీయ విముక్తి సంఘటనల కింద ఉన్నది. ఈ మూడు సైన్యాలలో ముప్పైవేల నుంచి నలభైవేల సైనికులతో ఖ్మెర్‌రూజ్ ఆధిక్యంతో ఉంది. ఇప్పటికీ ఈ మిశ్రమ ప్రభుత్వానికే ఐక్యరాజ్యసమితిలో స్థానం ఉన్నది. పదకొండేళ్ళుగా ఎడతెగకుండా సాగుతున్న చర్చలలో హెంగ్‌సామ్రిన్ తర్వాత వచ్చిన హున్‌సేన్ ప్రభుత్వానికి పాలనార్హత లేదని, నాలుగు కంపూచియన్ పక్షాలతో మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పరచి ఎన్నికలు జరిపించాలని ఖ్మెర్‌రూజ్ కోరుతున్నది. ఈ డిమాండ్‌ను వియత్నాం, సోవియట్‌యూనియన్ వ్యతిరేకిస్తూ వస్తున్నాయి.

లక్షమంది సైనికులతో ప్రభుత్వాన్ని కూలదోసి, పదకొండేళ్ళపాటు ప్రజలమీద దారుణ నిర్బంధాన్ని ప్రయోగించినా ఖ్మెర్‌రూజ్‌నుంచి ప్రజలను దూరం చేయలేకపోయాననే అక్కసుతో వియత్నాం, సోవియట్‌యూనియన్‌లు, సామ్రాజ్యవాద "సహాయం"తో సంబంధంలేని ఆర్థికాభివృద్ధివ్యూహాన్ని అమలు చేసి గెలిచారనే అక్కసుతో సామ్రాజ్యవాద దేశాలు ఖ్మెర్‌రూజ్ మీద, పోల్‌పాట్ మీద దుష్ప్రచారానికి పూనుకున్నాయి. ఈ దుష్ప్రచారాన్ని ప్రజాతంత్రవాదులు ప్రపంచవ్యాప్తంగా ఖండిస్తూనే ఉన్నారు. తెలుగుసీమలో 1979 వేసవిలో 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్ సందర్భంగా రాడికల్ యువజన సంఘం కంపూచియా ప్రజావిముక్తి పోరాటానికి మద్దతుకోరుతూ పోల్‌పాట్ బొమ్మతో బ్యాడ్జిలు అచ్చువేసి ప్రచారంచేసింది. 1979 ఫిబ్రవరి సృజన, అరుణతార మొ॥ పత్రికలు కంపూచియాపై వియత్నాం దురాక్రమణను ఖండిస్తూ సంపాదకీయాలు రాశాయి. రచనలు ప్రచురించాయి 1979 మే సృజన మీద కంపూచియాను

సమర్థించే ఆర్.వై.ఎల్ బ్యాడ్జి ప్రచురించారు. అప్పుడే హైదరాబాదు జనతా ప్రచురణలు తరపున ఇంగ్లీషులోను, తెలుగులోను మాల్కొమ్ కాడ్‌వెల్ పుస్తకం (కంపూచియా - రేషనేల్ ఫర్ ఎ రూరల్ పాలసీ, కంపూచియా యథార్థ కథాకథనం) ప్రచురించారు. కంపూచియా ప్రజాపోరాటాన్ని వివరిస్తూ క్రాంతి ప్రచురణలు ఒక పుస్తకాన్ని వెయివరించింది. ఆ తర్వాతికాలంలో 'కిల్లింగ్ ఫీల్డ్స్' వంటి దుష్ప్రచార సినిమాలు, పత్రికా వార్తలు వచ్చినా ఒక దురాక్రమణ సైన్యం అధికారం కింద ఉన్నచోటి నుంచి, హాలీవుడ్ నుంచి వచ్చే సమాచారాన్ని నమ్మవలసిన అవసరం లేదు. పోల్‌పాట్ పాలన ప్రచారమవుతున్నంత దుర్మార్గమైనదే అయితే ఇంకా కొనసాగగలిగిన ప్రజాబలం ఉండేదే కాదు. అయితే ఎక్కడో ఒకచోట జరిగిన సంఘటనలను అతిశయోక్తులతో ప్రచారం చెయ్యడం జరుగుతోంది. ఇంత వివరంగా ఎందుకు రాయవలసి వచ్చిందంటే, కవితోద్వేగం కింద అతి సమీప చరిత్ర కూడ వక్రీకరణ పాలవుతున్నప్పుడు, పాఠకులకు మళ్ళీ ఒకసారి చరిత్ర గుర్తుచేయాలనిపించింది.

ఇక సంయుక్త కవితలో మరికొన్ని వాక్యాలు "కారణాలు ఏవైనా కారణాలు ఏవైనా కారణాలు ఏవైనా | సిద్ధాంతాలు ఏవైనా సంస్థాగతాలు ఏవైనా | కొత్త పూలమొక్కని సృష్టించడమే సృజనాత్మకత | నాడీ మండలంలో కొత్త ప్రకంపనాలనుకదిలించడమే విప్లవీకరణ" అంటున్నాయి. "కొత్తపూలమొక్క" "సృజనాత్మకత", "కదలించడం", "విప్లవీకరణ" అనే మాటల నిర్వచనాలే, అర్థాలే 'సిద్ధాంతాల'ను బట్టి, 'సంస్థాగతాల'ను బట్టి నిర్ణయమవుతాయని, 'ఏవైనా' అనే అనిర్దిష్టత అనవసరం మాత్రమేగాక ధూర్తత్వానికి, మోసానికి దారితీస్తుందని గుర్తించవలసి ఉంది.

సంయుక్త కవిత గురించి చెప్పుకోవలసిన రెండో విషయం, ఈ కవుల సమ్మేళనం. భావజాలాలలో స్పష్టమైన విభజన, వ్యతిరేకత ఉన్న కవులు ఒకే కవితరాసి, ప్రచురించగలగడం ఎట్లా సాధ్యమయిందో పాఠకులు ఆలోచించవలసి ఉంది. ఈ కవుల ఇతర రచనలు, ఆచరణ తెలిసిన పాఠకులు ఈ ఆరుగురూ సమకాలీన రాజకీయ, సామాజిక సంఘటనల మీద ఒకేరకంగా స్పందించగలరని అనుకోలేదు. ఈ వైచిత్రి ఎట్లా సాధ్యమయిందో?

ఈ కవిత గురించిన మూడో విషయం, ఒక తొలి ప్రయోగంగా జరుగుతున్న ప్రచారం. సంయుక్తంగా కవిత్వ రచన సాగడం కొత్తసంగతేమీకాదు. కాకపోతే గతకాలపు సంయుక్త కవులు తాము రాసిన భాగాలకే తమ సంతకం

విరసం విశేషాలు

22-5-90 న గుంటూరులో విరసం కార్యవర్గం చేసిన తీర్మానాలు

తుఫాను, వరదల బీభత్సానికి గురయినవారికి వెంటనే పునరావాసం కల్పించాలి

మే తొమ్మిదో తేదీనాటి భయంకరమైన పెనుతుఫాను కోస్తాంధ్ర ప్రాంతాన్ని జలప్రళయానికి గురిచేసింది. వందలాదిమందిని బలితీసుకుంది. కోట్లాది ఆస్తులను ధ్వంసంచేసింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎనలేని నష్టం జరిగింది. తుఫానుమూలంగా కురిసిన కుంభవృష్టికి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వరదలొచ్చి ప్రజాజీవితం అస్తవ్యస్తమైపోయింది. 1977 నాటి బీభత్సాన్ని మించిన ఈ పెనుతుఫాను బాధితులు అప్పటిలాగానే ఇప్పుడూ పేద ప్రజానీకమే! గుడిసెవాసులే! ఈ ప్రకృతి బీభత్సానికి కార్యవర్గం ఆవేదన చెందుతున్నది. బాధితుల దుఃఖంలో పాలుపంచుకుంటున్నది. తుఫానులో మరణించినవారి కుటుంబాలకు, సర్వస్వంకోల్పోయిన బాధితులకు తగిన సహాయం

పెట్టుకున్నారు. అందువల్ల పాఠకులు గందరగోళపడవలసిన అవసరం లేకపోయింది. ఇక్కడ మాత్రం కనీసం నాలుగు ధోరణులకు చెందిన కవులు ఒకే విషయం కింద కలిసి సంతకం పెట్టారు. అందువల్ల అన్ని ధోరణులకూ అందరూ బాధ్యులు కావలసి వచ్చింది. పైన వివరించిన అచారిత్రకత, సిద్ధాంత వ్యతిరేకత, 'కలవని కరచాలనాల మధ్య | కొత్త లతలు పెనవేసుకోవాలి' లాంటి అనిర్దిష్ట 'మానవతావాదాలు', 'రాజీల్లేని బేరాల్లేని | ఓ ఉదయపవనాన్ని | ఓ ఉద్యమ ఘనాన్ని సృష్టిద్దాం' వంటి ఆశావహ పాదాలు అన్నీ కలగలసిపోయాయి.

ఈ గందరగోళం నుంచే గుర్తించవలసిన నాలుగో అంశం, ఈ సంయుక్త కవిత అక్కడక్కడ మెరిసినా, అక్కడక్కడ హృదయాన్ని తాకినా అంతిమంగా ఏమీ సాధించలేకపోయింది. ఒక ధార లేకపోవడం, కవులు దేన్ని సూచిస్తున్నారో, ఒక పాదంలో సూచించబడుతున్న విషయం తర్వాత పాదాల్లో కొనసాగుతున్నదో లేదో పాఠకుడు అర్థంచేసుకోలేని స్థితి ఏర్పడింది. ప్రయోగ చాపల్యంకింద ప్రయోజనం బలిఅయిపోయిన తాజా ఉదాహరణ 'క్రితరంతర్వాత'.

—ఎన్. వేణుగోపాల్

చేయవలసినదిగా కార్యవర్గం విరసం సభ్యులు, విప్లవాభిమానులైన ప్రజలకు విజ్ఞప్తిచేస్తున్నది. తుఫానుకు కూలిపోయిన ఇళ్ళస్థానే పక్కా-ఇళ్ళు నిర్మించాలని కార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. దశాబ్దాలుగా డ్రైనేజీవ్యవస్థను ఆధునీకరించకుండా వరదప్రమాదాలకు అవకాశం ఇస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని విరసం ఖండిస్తున్నది.

చెన్నారెడ్డి "ప్రజాస్వామ్య"వంచనను ఎండగట్టండి

విప్లవ ప్రజాసంఘాలపైన అన్నిరకాల ఆంక్షలనూ ఎత్తివేస్తున్నట్లు ప్రకటించిన చెన్నాప్రభుత్వం మరోవైపు అదనపు పోలీసు బలగాలకు కేంద్రానికి విజ్ఞప్తి, వేలసంఖ్యలో పోలీసుల నియామకం, నూతన పోలీసు బలగాల ఏర్పాటు - మొదలైన చర్యలు చేపట్టింది. ఇంకోపక్క రాష్ట్రంలో పోలీసు కాల్పులు ఉధృతమైనాయి. బాన్స్‌వాడ, పడ్కల్, నగరి తదితర ఘటనలు ఉదాహరణలు. స్త్రీలపై అత్యాచారాలు, దళితులపై దాడులు, గుడిసెల కూల్చివేత ముమ్మరమైనాయి. ఎన్‌కౌంటర్ హత్యలు, లాకప్ హత్యలు మొదలయ్యాయి. నిన్నటిదాకా దళితులపై దాడుల విషయంలో మొసలికన్నీరు కార్చిన చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఇవి తీవ్రపయ్యాయి -

"త్రిసూత్రపథకం" పేరిట అమలుజరిపే ఈ విధానాలు సారాంశంలో ఏకసూత్ర పథకమే. అది ప్రజావుద్యమాలను దెబ్బతీయడం. విప్లవ రచయితలపై కేసులు ఎత్తివేయలేదు విప్లవకారులను బెయిల్‌పై విడుదలచేస్తూ మరోప్రక్క కేసులు ఎత్తివేయకపోవడం గమనార్హం. చెన్నారెడ్డి ప్రజాస్వామ్య వంచనను ఎండగట్టాలని విరసం పిలుపునిస్తున్నది. ఈస్థితిలో ప్రజావుద్యమాలను రక్షించుకొనుటకై విప్లవశ్రేణులు, సంఘాలు ఐక్యంగా పోరాడాలి.

గుడిసెవాసులకు వెంటనే పట్టాలివ్వాలి!

జంటనగరాలలోనూ, ఇతర ప్రాంతాలలోనూ గుడిసెవాసులకు పట్టాలిస్తానని హామీ ఇచ్చిన చెన్నారెడ్డి ప్రభుత్వం - గుడిసెలు కూలగొడుతూవున్నది. బతకమ్మకుంట, చెన్నానగర్ తదితర ప్రాంతాలలో వేలాది గుడిసెలను కూలగొట్టింది. జంటనగరాలలో దాదాపు 700 కు పైగా మురికివాడలలో నివసిస్తున్న సగంమంది ప్రజలను ఈ చర్యలద్వారా భయకంపితులను చేస్తున్నది. రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వైఖరిని విప్లవరచయితల సంఘం నిరసిస్తుంది. గుడిసెవాసులందరికి వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్‌చేస్తున్నది.

యువతరాన్ని నిర్వీర్యం చేసేందుకు ఉప్పెనలావస్తున్న అశ్లీల సాహిత్యాన్ని, అశ్లీల చలనచిత్రాల నిర్మాణాన్ని విరసం ఖండిస్తోంది.

భూస్వామ్య, సామ్రాజ్యవాద సంకర విషసంస్కృతిని భూస్వామ్య, పెట్టుబడిదారీశక్తులు, పాలకవర్గాలు పెద్దఎత్తున ప్రజలకి ప్రచారం చేస్తూ యువతరాన్ని నిర్వీర్యంచేస్తూ సమాజంపట్ల స్పందించలేని వ్యసనపరులుగా మారుస్తున్నాయి. కేవలం సెక్స్, డిటెక్టివ్ పత్రికలకే పరిమితమైన సాహిత్యం ఒక దశాబ్దకాలంగా దిన వార పత్రికలలోకి నేరుగా చొచ్చుకొచ్చి పెద్ద వ్యాపార ముడి సరుకుగా మారింది. పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన విషపుత్రికలైన అన్ని వ్యాపార పత్రికలు దీన్ని వ్యాపారం చేసుకోవడంలో పోటీపడుతున్నాయ్. ఇంతక్రితం వరకు కాస్త సాహితీ పత్రికలుగా, గౌరవప్రదంగా ఉన్నవికూడా వ్యాపారంలో తట్టుకోవడం కోసం సిగ్గువిడిచి బరితెగించాయి. ఇటీవలనే ఆంధ్రజ్యోతి వారపత్రికలో వచ్చిన బూతు సీరియల్ నవల 'కామోత్సవ్'పై వచ్చిన దుమారం ఆగకుండానే అదే పత్రికలో 'తేనెటీగ' అనే మరో సెక్సు సీరియల్ ప్రచురితమైంది. ఇప్పుడు అది చలనచిత్రంగా రూపొందబోతోంది. ఒకవైపు మళయాళంనుండి సెక్సు సినిమాలు, విదేశీ NRI ద్వారా దిగుమతి అవుతున్న విదేశీ సెక్సు చిత్రాలతో తెలుగుచిత్రాలు పోటీపడుతూ ఆందోళనకు వస్తున్నాయి ఈ అశ్లీల సాహిత్యాన్ని, చలనచిత్రాలను ఖండిస్తూ విశాఖ విరసం ఇతర ప్రజాసంస్థలతో కలిసి తేనెటీగ చలనచిత్ర నిర్మాణానికి వ్యతిరేకంగా జరిపిన ఆందోళనకు మద్దతునిస్తూ అశ్లీల సాహిత్యాన్ని చలనచిత్ర నిర్మాణాన్ని ఖండిస్తున్నాం.

కాశ్మీరీ ప్రజల స్వయంనిర్ణయాధికార హక్కును బలపర్చండి.

గుత్తపెట్టుబడిదారుల, బడాభూస్వామ్యశక్తులకు ఏజెంట్లు, సామ్రాజ్యవాదతొత్తులు అయిన భారత కేంద్రప్రభుత్వ పాలకవర్గాలకు తమకు లొంగిపడి ఉండని జాతులన్నీ దేశద్రోహులు అవుతారు. మైనార్టీ హిందూ పాలకరాజులపై వీరోచిత పోరాటం సాగించిన కాశ్మీరీ ప్రజలను స్వాతంత్ర్యానంతరం ప్రజాసేకరణ జరిపి వారి స్వయంనిర్ణయాన్ని మన్నిస్తానని చెప్పిన నెహ్రూప్రభుత్వం

ఆ నిర్ణయాన్ని అమలుజరపక ఆనాటినుండి తమ తొత్తులు మాత్రమే, తమ అధికార పరిధిలో ఉండటానికి అంగీకరించిన వాళ్ళను మాత్రమే అధికారంలోకి రానిస్తూవచ్చింది. దశాబ్దాలుగా కాశ్మీరీ ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిపై, తమ సంస్కృతిని రక్షించుకోవాలనే ఆరాటం, దీర్ఘకాలికంగా ఆర్థికంగా, రాజకీయంగా అణచివేయబడిన తమ జాతి విముక్తికై కాశ్మీరీ ప్రజలు జరుపుతున్న పోరాటంపై పాలకవర్గాలు, పాలకవర్గ ఏజెంట్లు అమలుజరుపుతున్న ఫాసిస్టు దాడిని, దుష్ప్రచారాన్ని ఖండించవలసినదిగా విజ్ఞప్తిచేస్తున్నాం. కాశ్మీరీ ప్రజల స్వయంనిర్ణయాధికారాన్ని విరసం బలపరుస్తోంది. అణచివేత చర్యలను తక్షణం నిలిపి మిలటరీని అక్కడినుండి వెనక్కు రప్పించాలి. యుద్ధోన్మాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న, భారత పాకిస్తాన్ పాలకవర్గాల కుట్రలను విరసం ఖండిస్తోంది.

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేసినట్టు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏ ప్రకటనా చేయకుండానే మళ్ళీ ఎన్‌కౌంటర్లను ప్రారంభించింది.

అనంతపురం జిల్లా ఓబులనాయనిపల్లెలో భారతకమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) పీపుల్స్‌వార్ సెంట్రల్ ఆర్గనైజర్ కేశ్‌నాయక్‌ను మే నెల 14వ తేదీన పోలీసులు తుపాకులతో కాల్చి హత్యచేశారు. అక్కడి కాంగ్రెస్‌పార్టీ శాసనసభ్యుడి గూండాల ద్వారా కేశ్‌నాయక్ వున్న చోటుని తెలుసుకుని పథకం ప్రకారమే ఎస్ ఐ కేశవయ్య నాయకత్వంలో పోలీసులు చుట్టుముట్టి కేశ్‌నాయక్‌ను హత్యచేశారు. నాలుగుగంటలపాటు జరిగిన ఎదురు కాల్పులలో కేశ్‌నాయక్ మరణించినట్టు అనంతపురంజిల్లా ఎస్ పి చెప్పడం పచ్చి అబద్ధం. ఈ హత్య విషయమై ఎవరిపైనా ఇంతవరకూ కేసులు నమోదు కాలేదు. మళ్ళీ మొదలైన ఎన్‌కౌంటర్ దాడులను విరసం తీవ్రంగా ఖండిస్తున్నది. దీనిపై న్యాయవిచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలి.

AILRC

1990 ఏప్రిల్ 14, 15 తేదీలలో అఖిలభారత సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బొంబాయిలోని కా॥ అవతార్‌సింగ్‌పాశ్ హాలులో జాతీయస్థాయి సదస్సు జరిగింది. 14వ తేదీ ఉదయం కా॥ సనోబర్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో ప్రొ॥ మనోరంజన్ మొహంతి మతతత్వవాదంపై

ప్రారంభోపన్యాసంచేశారు. ఆయన తన ఉపన్యాసంలో భారత దేశంలో మత తత్వవాదం రాజ్యలక్షణాలలో ఒకటిగా మారిపోయిందని "ప్రభుత్వ లౌకిక వాదం" స్థానంలో ప్రజాస్వామిక లౌకికవాదాన్ని స్థాపించడానికి కృషిచేయాలని అన్నారు.

"భారత దేశంలో మతతత్వం, రాజ్యమూ మరియు సమాజం" అనే అంశంపై కా॥ కె.వి ఆర్. ఒక నోట్ పేపర్‌ను సమర్పించారు. తన ప్రసంగంలో ఆయన మతతత్వం పుట్టుకనూ, అభివృద్ధినీ చారిత్రికంగా వివరిస్తూ మొత్తం మీద రాజ్యాంగయంత్రం పాలకవర్గాల అవసరాలను కాపాడడంకోసం మత తత్వాన్ని ఏవిధంగా రెచ్చగొడుతున్నదీ వివరించారు.

అదేరోజు ఉదయం కా॥ ఎన్.కె. రాసిన "లాల్‌బనో గులామీ ఛోడో, బోలో వందేమాతరం" తెలుగు ఆడియో క్యాసెట్‌ను, హిందీ అనువాద పుస్తకాన్నీ కా॥ రాజ్‌కిషోర్ సింగ్ ఆవిష్కరించారు. కా॥ బారూ సత్వర్గ్ పంజాబీ రచన "మాకే గోద్" (తల్లి ఒడి)ని కా॥ కంచన్‌కుమార్ ఆవిష్కరించారు.

అదేరోజు మధ్యాన్నం సమావేశంలో శ్రీ శరద్‌పాటిల్ హిందూమత తత్వం గురించి ఒక పత్రాన్ని సమర్పించారు. కులం భారతీయ సమాజానికి సంబంధించిన ఒక ప్రత్యేక లక్షణమనీ, దాన్ని మార్క్సిజం విస్మరించిందనీ, కులనిర్మూలన జరగందే విప్లవం సాధ్యంకాదనీ అన్నారు. తదనంతరం ప్రొ॥ హరగోపాల్ ప్రసంగిస్తూ వర్గపోరాట ప్రాతిపదికమీద జరిగే నూతన ప్రజాతంత్ర విప్లవమే కుల సమస్యనూ, మతతత్వవాద సమస్యనూ పరిష్కరించగలదని, తెలంగాణా ప్రాంతంలో జరుగుతున్న రైతాంగపోరాటాల నుండి ఉదహరిస్తూ వివరించారు.

రాత్రి ఆనందపట్వర్ధన్ దర్శకత్వం వహించిన "ఇన్ మెమొరీ ఆఫ్ ఫ్రెండ్స్" (స్నేహితుల స్మృతిలో) అనే హిందీ డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. అది పంజాబ్‌లో నేడు నడుస్తున్న చరిత్రకు సంబంధించిన ఒక సినిమా. ప్రదర్శనానంతరం దానిపై చర్చ జరిగింది.

రెండోరోజు ఉదయం సమావేశానికి కా॥ అనూరాధ గాంధీ అధ్యక్షత వహించారు. శ్రీ అస్గరాలీ ఇంజనీర్ ముస్లిం మతతత్వవాదం గురించి బారూ సత్వర్గ్, దిలీప్ సింగ్‌ల సిక్కుమతతత్వవాదం గురించీ, మనోరంజన్ మొహంతి కాశ్మీర్ సమస్య గురించీ ప్రసంగించారు.

మధ్యాన్న సమావేశానికి కా॥ కంచన్‌కుమార్ అధ్యక్షతవహించారు. ఆ సమావేశంలో అనూరాధగాంధీ, సునీల్ ధిగే, నాగేశ్‌చౌదరి, దేవనాథన్, బీహార్, కేరళరాష్ట్రాలకుచెందిన విప్లవసాంస్కృతిక సంస్థలు మతతత్వవాదాన్ని సమర్ధవంతంగా ఎలా ఎదుర్కోవలసిందీ వివరిస్తూ పత్రాలు సమర్పించారు. తదనంతరం చర్చ జరిగింది. ఆ చర్చలో గుర్‌బీర్, మీనా, మూర్తి తదితరులు పాల్గొన్నారు. సమావేశానంతరం ఆహ్వాన్ నాట్యమంచ్ దళం మతతత్వవాదాన్ని వివరిస్తూ వీధి నాటకాన్ని ప్రదర్శించింది. దేశం నలుమూలల నుండీ దాదాపు 300 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

విజ్ఞప్తి

'అరుణతార'కు చందాలు పంపేవాళ్ళు కొందరు మనియార్డర్‌ఫారం కూపన్‌లో అడ్రసు రాయడంలేదు. మరికొందరు అస్పష్టంగా రాస్తున్నారు. దాని వల్ల పత్రిక పంపడంలో ఇబ్బందికలుగుతోంది. కాబట్టి అడ్రసు స్పష్టంగా రాయండి. ఇంతవరకు చందాపంపి పత్రిక అందనివాళ్ళు ఎవరైనా ఉంటే వెంటనే కార్డుద్వారా మీ అడ్రసు రాస్తూ తెలియచేయండి. చందాలు పూర్తయిన వాళ్ళు వెంటనే చందాలు చెల్లించండి. ఈ విషయాల్లో అందరూ సహకరిస్తారని ఆశిస్తున్నాం.

అభ్యుదయ, విప్లవ సాహిత్యం, క్రాంతి ప్రచురణలు
దొరుకు చోటు

నవోదయ బుక్ హౌస్

3-3-865, ఆర్యసమాజమందిర్‌కు ఎదురువీధి,
కాచిగూడ, హైదరాబాద్ - **500 027.**

స్వీకారం

1. **అభివృద్ధి వెలుగునీడలు :** రచన ; ఆర్.ఎస్. రావు, ప్రచురణ : పర్స్పెక్టివ్స్, వెల ; 5 రూ, ప్రతులకు ; నవయుగ బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాద్ - 500 195.
2. **భూమిపుత్రుడు :** కవితాసంకలనం - మందాడి కృష్ణయ్య, వెల : 5 రూ., ప్రతులకు : నవయుగ బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాద్ - 500 195.
3. **ఆలోచించండి - ఆలోచింపచేయండి :** సంకలనం : పసల భీమన్న, వెల : 13 రూ, ప్రతులకు : పి. యూస్పీ, C/o పి. భీమన్న, డి.ఇ.ఒ., (ఏజన్సీ), రంపచోడవరం - 533288, తూ.గో. జిల్లా.
4. **నిత్యజీవితంలో హేతుత్వం :** పసల భీమన్న, వెల ; 12 రూ., ప్రతులకు : పై అడ్రసే.
5. **తూర్పుయూరప్ పరిణామాలు, గుణపాఠాలు:** చంద్రం, సత్యం వెల : 6 రూ, ప్రతులకు : మేనేజర్, ప్రజాపంథా, కొరిటపాడు, గుంటూరు - 522 007.
6. **కన్నీటిధారల్లో కాశ్మీర్ లోయ :** పి. ప్రసాద్. వెల : 4 రూ., ప్రతులకు : పై అడ్రసే.

చిగుళ్ళు

పొంగిన గంగంతా సముద్రంపాలుగాదు
సముద్రంలోని నీరంతా వృథాకాదు
మళ్ళీ ఆకాశం మేఘావృతమౌతుంది
తిరిగి తిరిగి ఉప్పెనలొస్తాయి
వచ్చిన ప్రతి ఉప్పెనా వినాశకరంకాదు.
కొమ్మలెన్ని విరిగినా చెట్లు మోడువోవు
మళ్ళీ మళ్ళీ కొత్తజీవనం వస్తుంది
చిగుళ్ళు కొమ్మలవుతాయి
విత్తులు మొలకలౌతాయి
జీవితం ఎప్పుడూ ముందుకేపోతుంది.

—శ్యామ్

నేతపనివారి పాటలు-1

చేనేత కూలన్నా! —రుద్రజ్వాల

చేనేత కూలన్నా!
లాక1 బద్దపై లేరా!
నేతకార్మిక సోదరా
గద్దపలుగుపై రారా!
నిను నిలువున దోచెటోళ్ళ
పోరి, పోరి గెలవరా ॥చేనేత॥
పోగుపోగు చూసతికీ
పోగులు సరిజేసినా...
ఓ నేతకూలన్నా!
నేతకార్మిక సోదరా!
చిక్కుచిక్కుదారం తెగి
చేతిసరాల్ పేనినా.... ॥ఓనేత॥
యింతలేసి పసిబిడ్డల
యిచ్చల నెలిపిచ్చినా ॥ఓనేత॥
నడ్డొంగిన ముసలి ముతక
లక్డీ2 ల్తోడిచ్చినా ... ॥ఓనేత॥
పచ్చి బాలెంతై భార్యా
కండెలు3 జుట్టిచ్చినా .. ॥ఓనేత॥
గుంటబతుకు తప్పనోడ!
కంటతడీ తీరనోడ!
చేయి, చేయి గలిపి నీవు
చిటపటమని మండవేల?- ॥చేనేత॥
లడ్డిలడ్డీ రీలుగ నువ్
ఆసు4 మీద ఆడినా.... ॥ఓనేత॥
పడుగు, పడుగు పోగుగ నువ్
పొగళ్లు5 గ మారినా . ॥ఓనేత॥
పొగడచ్చు అతుకై నువ్
పడుగుదోనె6 గుండినా... ॥ఓనేత॥
ఆయాసం తప్పనోడ!
ఆకలితో కుంగినోడ!
పదిమందిని కూడగట్టి
బరిలోకి దూకవేల?- ॥చేనేత॥
కండె, కండె నాడినెట్టి
కండలు కుదిలిచ్చినా... ॥ఓనేత॥
అడఅడ7 కీ నీ ఎమికలు
అరగదీసి పిండినా.... ॥ఓనేత॥
గడిగడికీ నీ నెత్తురు
రంగులుగా అద్దినా.... ॥ఓనేత॥
బారుబారు8 కీ బతుకూ
బారెడేసి చిరిగినా... ॥ఓనేత॥
ముసురులోన నేతాదర
పలకై9 నువ్ జరిగినా... ॥ఓనేత॥
ఏదెండకి పడుగులు తెగి
పోగైనువ్ బిగిసినా . ॥ఓనేత॥
కుచ్చు10 లాగి అవి11 రొక్కి
కొత్తగుడ్డ నేసినా ... ॥ఓనేత॥
నిదరగాచి, నిదరగాచి
నీ మగ్గం లాగినా... ॥ఓనేత॥
వూపిరుడిగి, వూపిరుడిగి
వుత్పత్తులు పెంచినా.... ॥ఓనేత॥
జాగారం పెరిగినోడ!
జొన్నపూస12 గెండినోడ!
సుడిగాలై లేచినీవు
సమరం సాగించవేల?- ॥చేనేత॥

---

1) వెదురుబద్ద 2) పదియిచ్చెలు 3) పూసమీదచుట్టేది 4) పడగుపోసేది 5) గంజిపట్టిన పడుగు 6) నూలుచుట్టే పరికరం 7) డిజైనొచ్చేది 8) 24 మీటర్ల గుడ్డ 9) మగ్గంనడిపే పరికరం 10) నాడిని కదిలించే దారాల కలయిక 11) కాలికింద చెక్క 12) పండెచుట్టేది.

66

KLVA106m103

120 ARUNA TARA MAY - JUNE 1990 H/GTR-70

Annual Subscription Rs. 30/- Single Issue Rs. 3/-

వేగుచుక్క

నిశ్శబ్దంగా కాలం అనంత ప్రకృతి దేహంపైనుంచి సాగిపోతున్నది
రాత్రి రెండోజాము కలలతోటలోకి నడిచిపోతున్నాయి గుడిసె గుండెలు
రక్తంమడుగులో మోదుగచెట్ల నీడలో రక్తం ముద్దగా మారిన కొడుకు
అది కరకు కత్తుల అమావాస్యరాత్రి
భవిష్యత్తు ఆశలనౌక నడిసంద్రంలో తుఫాన్‌కు తునాతునకలైనప్పుడు
ఎదిగిన చెట్టంతకొడుకు నిర్జీవంగా అచేతనంగా పడివున్న దృశ్యం....
ఒక్కసారి కడుపులో కసుక్కున కత్తిని దించినట్టుగా
ఇరవై సంవత్సరాల పేగుబంధాన్ని ఎవరో తెంచినట్టుగా
వికలమైన స్వప్నంలో ఆ మాతృమూర్తి కేకలు
ఆ తల్లి పరుగుల ప్రవాహంలో వెతుక్కుంటోంది కొడుకును
తనదారిన తానై పోతున్న గాలిని కొడుకు జాడేదని అడుగుతున్నది
ప్రతి చెట్టును, ఆకుఆకును ఆనవాలు చెప్పమని అర్థిస్తున్నది
కొండకోనల్ని బ్రతిమాలుకుంటున్నది
వాగువంకల్ని గాలిస్తున్నది
అతడు-
లోకం కన్నీటిచారికను తుడిచేందుకు అమరయాత్రికుడయ్యాడు
ప్రపంచానికి వెలుగుల్నిపంచి, చీకటిపై యుద్ధయాత్రకు మరోబుద్ధుడయ్యాడని
ఆ పిచ్చితల్లికి తెలియదు పాపం!
అతడు-
ప్రతినిత్యం అరణ్యాల అంతరాత్మై ప్రతిధ్వనిస్తున్నాడు
ప్రతి వేకువకు ముందు వేగుచుక్కై వెలుగుతున్నాడు
అతడిప్పుడు ఉద్యమాల ఊపిరై
తూర్పుగుండెమీద ఉదయిస్తున్న ఎర్రెర్రటి సూర్యుడు.

[కా॥ కె. శ్రీనివాస్ స్మృతిలో]

—సుచిత్ర

Printed at Konarka Printers, Kavali on behalf of Venkataramana Printers, Guntur-1. Revolutionary Writers' Association

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M103
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	67
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	Jayamma
స్కాన్ చేసినది	Priyanka
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good